శుక్రవారం
14-10-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 113
పేజీలు : 12, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
విశాలాంధ్ర
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఆదర్శకమ్యూనిస్టు పెద వెంకట్రాయుడు
టెర్రరిస్టుల సింహస్వప్నం సత్యపాల్ డాంగ్
రాజ్యసభలో రైతుబంధు జెడ్‌ఎ అహ్మద్
12లో

దారులన్నీ బెజవాడకు...

నేడే సీపీఐ మహా ప్రదర్శన

సింగ్‌నగర్ స్టేడియంలో బహిరంగసభ

- రేపటి నుంచి ప్రతినిధుల సభలు
- ర్యాలీ దృష్ట్యా ట్రాఫిక్ మళ్లింపు

మహాసభ ప్రాంగణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న రామకృష్ణ, జల్లి విల్సన్, ముప్పాళ్ల, వనజ, చంద్రశేఖర్, రవీంద్రనాథ్ తదితరులు

కొల్లాం నుండి యువ కమ్యూనిస్టుల తీసుకొచ్చిన అరుణ పతాకాన్ని అందుకున్న రాజా, వినయ్ విశ్వం, రామకృష్ణ, నారాయణ తదితరులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సీపీఐ జాతీయ మహాసభలకు విజయవాడ నగరం ముస్తాబైంది. పార్టీ పతాకాలు, తోరణాలు, ఫ్లెక్సీలతో అరుణార్ణవమైంది. ఎర్రదండు కవాతు తొక్కనుంది. మహాసభల్లో పాల్గొనే ప్రతినిధులంతా నగరానికి చేరుకున్నారు. విదేశీ ప్రతినిధులు సైతం విచ్చేశారు. ఎక్కడ చూసినా పండగ వాతావరణం నెలకొంది. ఈ మహాసభలు దేశానికి దిశానిర్దేశం చేయనున్నాయి. పార్టీ శ్రేణులకు భవిష్యత్ కార్యక్రమాన్ని అందించనున్నాయి. మహాసభలను పురస్కరించుకుని శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు నగరంలోని మీసాల రాజారావు బ్రిడ్జి పండ్ల మార్కెట్ నుంచి మాకినేని బసవపున్నయ్య సింగ్‌నగర్ స్టేడియం వరకు వేలాదిమంది ఎర్రదండుతో మహాప్రదర్శన జరుగుతుంది. సుమారు ఐదు కిలోమీటర్ల పొడవున ప్రదర్శన సాగనుంది. సాయంత్రం 4 గంటలకు బహిరంగసభ ప్రారంభమవుతుంది. అరుణకాంతుల రెపరెపలతో సభా ప్రాంగణం ఆకట్టుకుంటోంది. సీనియర్ కామ్రేడ్లు ఆశీనులు కావడానికి వీలుగా దాదాపు 20 వేల కుర్చీలు ఏర్పాటు చేశారు. స్టేడియం లోపలా, వెలుపలా నిలబడిన కామ్రేడ్లు కూడా నేతల ప్రసంగాలను దగ్గరగా చూడటానికి, వినడానికి వీలుగా ప్రాంగణానికి నలువైపులా భారీ డిజిటల్ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. అధునాతన డిజిటల్ సౌండ్ సిస్టమ్, ఫ్లడ్ లైట్లను భారీ సంఖ్యలో ఏర్పాటు చేశారు. ఇక అతి ముఖ్యమైన ఉపన్యాసకుల వేదిక సభా ప్రాంగణంలో ఏ మూల నుంచి చూసినా కనపడేలా ఐదడుగుల ఎత్తులో వంద మంది ఆశీనులవడానికి వీలుగా నిర్మించారు. అతిథులు వేదికను సునాయాసంగా చేరుకోవడానికి వీలుగా బారికేడ్లతో కూడిన ప్రత్యేక మార్గాన్ని ఏర్పాటు చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ ఈ ఏర్పాట్లన్నీ దగ్గరుండి పర్యవేక్షించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షతన జరిగే సభలో ఉపన్యాసకులుగా సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఐ పార్లమెంటరీ పక్ష నాయకులు వినయ్ విశ్వం, పార్టీ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, అమర్‌జిత్ కౌర్, జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఏపీ సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణ మూర్తి ప్రసంగిస్తారు. ఏర్పాట్లను గురువారం సాయంత్రం రామకృష్ణ, ఇతర నాయకులు పరిశీలించారు.

ప్రత్యేక రైళ్లు, వాహనాల్లో తరలివస్తున్న సీపీఐ శ్రేణులు

విజయవాడలో శుక్రవారం జరగనున్న మహా ప్రదర్శన, బహిరంగసభలో పాల్గొనేందుకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో సీపీఐ శ్రేణులు తరలివస్తున్నారు. వరంగల్, అనంతపురం, ధర్మవరం, విశాఖ ప్రాంతాల నుంచి 6 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేశారు. ఈ రైళ్లన్నీ శుక్రవారం ఉదయానికి విజయవాడ చేరుకోనున్నాయి. వందలాది బస్సులు, లారీలు, ట్రాక్టర్లు, కారులు, ద్విచక్రవాహనాల్లో సీపీఐ, వాటి ప్రజా సంఘాలకు చెందిన శ్రేణులు చేరుకుంటున్నాయి. దూర ప్రాంతాలకు చెందినవారు గురువారం సాయంత్రమే బయలు దేరారు. ప్రత్యేక వాహనాల్లో బయలుదేరిన వారు రాత్రికే నగరానికి విచ్చేశారు. రష్యా, చైనా, క్యూబా, ఫ్రాన్స్, అమెరికా, పాలస్తీనా, గ్రీస్, వియత్నాం, లావోస్, దక్షిణాఫ్రికా, నేపాల్, కొరియా, పోర్చుగల్, శ్రీలంక, బంగ్లాదేశ్, టర్కీ దేశాలకు చెందిన 30 మంది విదేశీ ప్రతినిధులు హాజరవుతున్నారు. వీరంతా ఇప్పటికే నగరానికి

- మిగతా 2 లో

జాతీయ రాజకీయాల్లో భారీ మార్పు

దేశానికి దశ, దిశా నిర్దేశంగా... జాతీయ మహాసభలు

- 16న విదేశీ ప్రతినిధుల సందేశాలు
- 18న నూతన జాతీయ కార్యవర్గం ఎన్నిక
- అందర్నీ కలుపుకుని బీజేపీపై పోరాటం
- వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులు ఐక్యమవ్వాలి
- వైసీపీ నేతల భూకబ్జాలపై జగన్ స్పందించాలి
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ
- కీలక మలుపుగా మహాసభలు: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశానికి ఒక దశ, దిశా నిర్దేశంగా సీపీఐ 24వ జాతీయ మహాసభలు నిలవనున్నాయని, జాతీయ రాజకీయాల మార్పునకు ఇవి ఎంతో కీలకం కానున్నాయని పార్టీ జాతీయ కార్యదర్శి, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ వెల్లడించారు. మహాసభలకు స్వదేశీ, విదేశాల నుంచి వామపక్ష, లౌకికవాద, ప్రజాతంత్ర శక్తులు, వివిధ పార్టీల ప్రముఖులు తరలివస్తున్నారన్నారు. విజయవాడ గురుదాస్ దాస్‌గుప్తానగర్ ప్రాంగణం (ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటరు)లో గురువారం మహాసభల ఆహ్వాన సంఘం విలేకరుల సమావేశాన్ని నిర్వహించింది. నారాయణ మాట్లాడుతూ, ఈనెల 14వ తేదీ సాయంత్రం 3గంటలకు విజయవాడ కేదారేశ్వరిపేట ఫ్రూట్ మార్కెట్ నుంచి గొప్ప ప్రజా ప్రదర్శన ప్రారంభమవుతుందని, సింగ్‌నగర్‌లోని సీఆర్ మైదానం(మాకినేని బసవపున్నయ్య స్టేడియం)లో భారీ బహిరంగ సభ జరుగుతుందని వివరించారు. 15వ తేదీన ఉదయం

- మిగతా 2 లో

ఇదీ లోకం!

డియర్ స్టూడెంట్స్, ఈ రోజు పుర్రె, ఎముకల ఉపయోగం తెలుసుకుందాం!

కమ్యూనిజమే ఉత్తమం

ప్రజాకవి గోరేటి వెంకన్న

అట్టహాసంగా కళాకారుల ధూం ధాం

2లో

అక్టోబరు 14

చలో విజయవాడ

ఈ నెల 14 నుండి 18 వరకు విజయవాడలో జరగనున్న
భారత కమ్యూనిస్టు పార్టీ
24వ జాతీయ మహాసభల సందర్భంగా

14 మధ్యాహ్నం 3 గంటలకు B.R.T.S. రోడ్డు ఉత్తరం వైపు చివర
(మీసాల రాజారావు బ్రిడ్జి, పండ్ల మార్కెట్) నుండి

ప్రజా ప్రదర్శన

సాయంత్రం 4 గంటలకు అజిత్‌సింగ్ నగర్ యం.బి స్టేడియంలో

బహిరంగసభ

అధ్యక్షులు : కామ్రేడ్ కె. రామకృష్ణ, Ex,MLA. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి
ఉపన్యాసకులు : కామ్రేడ్ డి. రాజా, Ex,MP. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి
: కామ్రేడ్ బినయ్‌విశ్వం, M.P. సిపిఐ పార్లమెంటరీ పక్ష నాయకులు
: కామ్రేడ్ కె. నారాయణ, సిపిఐ జాతీయ కార్యదర్శి
: కామ్రేడ్ అమర్‌జిత్ కౌర్, సిపిఐ జాతీయ కార్యదర్శి
: కామ్రేడ్ చాడ వెంకటరెడ్డి, Ex,MLA. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు
: కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు, Ex,MLA. సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి
: కామ్రేడ్ ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి
: కామ్రేడ్ జె.వి. సత్యనారాయణమూర్తి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి

తదితరులు.

సాయంత్రం 3 గంటల నుండి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి వారిచే మరియు
ప్రఖ్యాత సినీ గాయకులు వందేమాతరం శ్రీనివాస్ గారిచే బహిరంగసభ వేదికపై సంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.

ప్రజలంతా పాల్గొన మనవి

అభివందనములతో
ఆహ్వానసంఘం

వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తుల ఐక్యతకై ఉద్యమిద్దాం!

చైనా సీపీ 20వ మహాసభలకు సర్వం సిద్ధం

బీజింగ్: కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా (సీపీసీ) 20వ జాతీయ మహాసభలు అక్టోబర్ 16న బీజింగ్‌లో ప్రారంభించాలని ఏడవ ప్లీనరీ సమావేశం నిర్ణయించింది. వారం రోజులపాటు జరిగే కమ్యూనిస్టుపార్టీ మహాసభల్లో 2,296 మంది పార్టీ ప్రతినిధులు పాల్గొననున్నారు. దేశ వ్యాప్తంగా 96 మిలియన్లకు పైగా సీపీసీ సభ్యులకుప్రాతినిధ్యం వహిస్తున్న చైనాలో ఆదివారం నుంచి కమ్యూనిస్టు పార్టీ మహాసభలు ప్రారంభం కానున్నాయి. ఈ మహాసభలు ప్రతి ఐదుసంవత్సరాలకు ఒకసారి జరుగుతాయి. జిన్‌పింగ్ అధికారంలోకి వచ్చాక పెద్దఎత్తున అవినీతిప్రక్షాళన చేపట్టారు. అయితే ఉక్రెయిన్ యుద్ధం, అమెరికా నుంచి పలు సవాళ్లు ఎదురవుతున్న నేపథ్యంలో జిన్‌పింగ్ వంటి నాయకుడు దేశానికి అవసరమని జీవితకాల అధినాయకుడిని చేసే అవకాశాలు మెండుగా ఉన్నట్లు తెలుస్తోంది.

పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాలో జరిగే మహాసభలు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నాయి. చైనాలోని విశాలమైన రోడ్లు, భారీ అభివృద్ధి ప్రాజెక్టులు, హై-స్పీడ్ రైల్వేలు, ఇతర సాంకేతిక విజయాల ద్వారా వేగవంతమైన అభివృద్ధి నమూనాగా పరిగణించబడుతుంది. చైనా ఒక ప్రధాన శక్తిగా ఎదుగుతోంది. వీటన్నింటి వెనుక ఉన్న ప్రధాన చోదక శక్తి కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా. దాని 20వ జాతీయ కాంగ్రెస్‌ను సాధారణంగా పార్టీ కాంగ్రెస్ అని పిలుస్తారు, అక్టోబరు 9-12 మధ్య సీపీసీ 19వ సెంట్రల్ కమిటీ ప్లీనరీ సమావేశంలో సీపీసీ సెంట్రల్ కమిటీ పొలిటికల్ బ్యూరోకు ఏడవ ప్లీనరీ నివేదికను అందించారు. సీపీసీ సెంట్రల్ కమిటీ పొలిటికల్ బ్యూరో అధ్యక్షతన జరిగిన నాలుగు రోజుల సెషన్‌లో సీపీసీ సెంట్రల్ కమిటీ ప్రధాన కార్యదర్శి జిన్‌పింగ్ ప్రధాన ప్రసంగం చేశారు. గత ఐదేళ్లలో సీపీసీ సెంట్రల్ కమిటీ చైనా లక్షణాలతో సోషలిజం బ్యానర్‌తో పార్టీని, సాయుధ దళాలను, అన్ని జాతుల ప్రజలను ఐక్యంచేసి నడిపించిందని పేర్కొంది. అన్ని విధాలుగా సంపన్నమైన సమాజాన్ని నిర్మించడం, తద్వారా మొదటి శతాబ్ది లక్ష్యాన్ని సాధించడం లక్ష్యంగా ఈ నివేదిక పేర్కొంది. చైనాను అన్ని విధాలుగా ఆధునిక సోషలిస్టు దేశాన్ని నిర్మించే దిశగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించడం ద్వారా రెండవ శతాబ్ది లక్ష్యం దిశగా ముందుకు సాగడం ప్రథమ కర్తవ్యంగా ఈ ప్రకటన పేర్కొంది. చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న అనేక కఠినమైన సమస్యలు

పరిష్కరించబడ్డాయి. దీర్ఘకాలిక ప్రాముఖ్యత కలిగిన అనేక విషయాలు సాధించడం ద్వారా ప్రపంచం దృష్టిని చైనా ఆకర్షించింది. ప్రధాన విజయాలు పార్టీ , దేశం కోసం సాధించినట్లు కమ్యూనిక్ పేర్కొంది. కొత్త యుగానికి చైనా లక్షణాలతో సోషలిజంపై జిన్‌పింగ్ ఆలోచన మార్గదర్శక పాత్రను నిర్వచించిందని నొక్కి చెప్పారు. ఇది పార్టీ, సాయుధ దళాలు, అన్ని జాతులకు చెందిన చైనా ప్రజల ఉమ్మడి సంకల్పాన్ని ప్రతిబింబిస్తుంది కొత్త యుగంలో పార్టీ నిర్ణయాత్మక ప్రాముఖ్యతను కలిగి ఉందని పేర్కొంది.

ఉమ్మడి గ్యాస్ కొనుగోళ్లు, ధరలపై ఈయూ చర్చ

ప్రాగ్: ఉమ్మడిగా గాస్ కొనుగోళ్లు, సాధ్యమైనంతవరకు ధరలను పరిమితం చేయడంపై యూరోపియన్ కమిషన్ లక్ష్యంగా పెట్టుకుంది. అధిక గ్యాస్ ధరలకు పరిష్కారాలు, శీతాకాలంలో ఇంధన పరిస్థితి, విద్యుత్ మార్కెట్‌ను సవరించడంపై చర్చించడానికి యూరోపియన్ యూనియన్ (ఈయు) మంత్రులు సమావేశమయ్యారు. అధిక గ్యాస్ ధరల సమస్య, సమర్థవంతమైన పరిష్కారం కోసం దృష్టి సారించాయి. ఈ అంశంపై చర్చ సులభం కాదు, ప్రతి దేశానికి వేర్వేరు పరిస్థితులు, వివిధ నియమాలు ఉన్నాయి, విభిన్న ఆసక్తులు, కానీ కీలకంగా మనం ఆర్థిక ప్రభావాలను తగ్గించాలి అని చెక్ పరిశ్రమ వాణిజ్య మంత్రి జోజెఫ్ సికెలా అన్నారు. చెక్ రిపబ్లిక్‌లోని ప్రాగ్‌లో యూరోపియన్ యూనియన్ (ఈయూ) అనధికారిక శిఖరాగ్ర సమావేశం తర్వాత చెక్ ప్రధాని పీటర్ ఫియాలా, యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ చార్లెస్ మిచెల్, ఈయూ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయెన్ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ప్రతిపాదనలోని ప్రధాన అంశాలు ఉమ్మడి గ్యాస్ కొనుగోళ్లకు ప్లాట్‌ఫారమ్‌ను కలిగి ఉండవలసిందిగా తీర్మానించారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల పరిష్కారానికి అదే సమయంలో భవిష్యత్ ఇంధన పరిశ్రమలో మార్కెట్ ఏర్పాటు చేయవలసిన విధానాన్ని చర్చించారు. యూరోజోన్‌లో ద్రవ్యోల్బణం సెప్టెంబరులో 10 శాతం పెరిగింది, ప్రధానంగా ఇంధన ధరల కారణంగా సెప్టెంబరులో చెక్ రిపబ్లిక్‌లో ద్రవ్యోల్బణం సంవత్సరానికి 18 శాతం పెరిగింది,

సూకీ జైలు శిక్ష 26 ఏళ్లకు పొడిగింపు

మైన్మార్: మైన్మార్ నేత అంగ్‌సాన్‌సూకీ(77) జైలుశిక్షను ఆ దేశ కోర్టు 26ఏళ్లకు పొడిగించింది. స్థానిక వ్యాపారవేత్త నుండి 500,000 లంచం స్వీకరించినందుకు సూకీ దోషిగా తేలింది, అయితే ఈ ఆరోపణలను ఆమె ఖండించారు. సూకీ ప్రస్తుతం రాజధాని నైపిడాలోని జైలులో నిర్బంధంలో ఉన్నారు. నవంబర్ 2020 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన విచారణలో సూకీ గత నెలలో ఎన్నికల మోసానికి పాల్పడినట్లు తేలింది. దీనితో ఆమెకు మరో మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించడమైంది. 2021 సైనిక తిరుగుబాటు తర్వాత సూకీకి కఠిన శిక్ష విధించడం ఇదే తొలిసారి. దేశద్రోహం, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్స్‌పై చట్టాన్ని ఉల్లంఘించారనే ఆరోపణలపై గత వారం 10 సంవత్సరాలకు అదనంగా ఆ శిక్ష విధించబడింది. కరోనా నిబంధనల ఉల్లంఘన, అక్రమ వాకీటాకీల దిగుమతి, అధికార రహస్యాల బహిర్గతం, దేశద్రోహం, ఎన్నికల్లో అవినీతిపై కోర్టు 23ఏళ్ల జైలుశిక్ష విధించింది. ఏకంగా 26ఏళ్లు ఆమె జైలులోనే గడపవలసిన పరిస్థితి.

మిలటరీ బస్సు పేలి 17 మంది సైనికుల మృతి

దమాస్కస్: సిరియా రాజధాని దమాస్కస్‌లో మిలటరీ బస్సులో పేలుడు జరిగింది. ఈ పేలుడు కారణంగా 17మంది సైనికులు మృతి చెందినట్లు స్థానిక షామ్ ఎఫ్ఎం తెలిపింది. పేలుడుకు గల కారణాలు తెలియరాలేదు. ఇప్పటి వరకు ఏ సంస్థ ఈ పేలుడుకు బాధ్యత వహించలేదు. సిరియాలో దశాబ్దకాలంగా కొనసాగుతున్న ఘర్షణల కారణంగా ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. తిరుగుబాటుదారుల నుంచి సిరియా ప్రభుత్వ దళాలు తిరిగి భూభాగాన్ని స్వాధీనం చేసుకోగా ప్రభుత్వ నియంత్రణలో ఉన్న దమాస్కస్, సిరియాలోని ఇతర ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు పెరుగుతున్నాయి.

పాక్ బస్సులో మంటలు: 18 మంది మృతి

కరాచీ: పాకిస్తాన్ పోర్టు సిటీ కరాచీలో రన్నింగ్ బస్సు మంటల్లో చిక్కుకుంది. ఈ మంటల్లో 18మంది అక్కడికక్కడే మృతిచెందారు. వీరిలో 12మంది చిన్నారులు ఉన్నట్లు సమాచారం. అయతే వీరందరూ వరదబాధితులుగా గుర్తించారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 35మంది ఉన్నారు. మరో 10మంది కాలిన గాయాలతో చికిత్స పొందుతున్నారు. దాదూ జిల్లాకు చెందిన వరదబాధితులను వేరే ప్రాంతాలకు తరలిస్తున్న సమయంలో ఈ మంటలు చోటుచేసుకున్నాయి.

అంధేరి ఈస్ట్ ఉప ఎన్నికలో ఠాక్రే సేనకు సీపీఐ మద్దతు

ముంబై : మహారాష్ట్రలోని అంధేరి ఈస్ట్‌కు జరగనున్న ఉప ఎన్నికలో ఠాక్రే వర్గ అభ్యర్థికి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తమ మద్దతును ప్రకటించింది. ముంబైకి చెందిన సీపీఐ నేతలు ఉద్ధవ్ ఠాక్రేతో భేటీ అయ్యారు. ఆ పార్టీ అభ్యర్థికి మద్దతిస్తామని చెప్పారు. ఈ ఉప ఎన్నిక నవంబరు 3న జరగనుంది. సీపీఐ ముంబై కార్యదర్శి మిలింద్ రనడే అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాజకీయ పరిస్థితులు, సమీకరణలు మారినందునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 'పేట్రేగిన విద్వేషం వల్ల యావత్ దేశం వినాశం అంచున ఉంది. ప్రజాస్వామిక మూలస్తంభాలు దెబ్బతిన్నాయి. ఇది ఫాసిస్టు పనితీరు. ఈ పరిస్థితుల ముందుర శివసేనతో మాకున్న విభేదాలు చిన్నబోయాయి. మా మధ్య అంతా బాగుందని చెప్పడం లేదుగానీ ప్రస్తుతానికి అన్నింటిని పక్కకు పెట్టేసి ముందుకు సాగుతున్నాం' అని అన్నారు. శివసేన చీలిక తర్వాత జరగబోయే ఎన్నిక కాబట్టి అంధేరిఈస్ట్ ఉప ఎన్నికకు ప్రాధాన్యత ఏర్పడింది.

దారులన్నీ బెజవాడకు...

(మొదటిపేజీ తరువాయి)

చేరుకున్నారు. మహాసభల జయప్రదం కోరుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి బయలు దేరిన ప్రత్యేక జాతాలు నగరానికి చేరుకున్నాయి.

రేపటినుంచి ప్రతినిధుల సభలు

ఈనెల 15వ తేదీ నుంచి ప్రతినిధుల సభలు ప్రారంభం కానున్నాయి. బందరు రోడ్డుకి సమీపంలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో దీనికి అవసరమైన అన్ని ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. దేశంలోని 27 రాష్ట్రాల నుంచి సుమారు 950 మంది ప్రతినిధులు హాజరవుతుండగా, వీరందరికీ నగరంలోని హోటళ్లు, విడిది కేంద్రాల్లో ఆతిథ్యం కల్పిస్తున్నారు. వసతి ఏర్పాట్లను సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు దోనేపూడి శంకర్ పర్యవేక్షిస్తున్నారు.

ట్రాఫిక్ మళ్లింపు

సీపీఐ మహాప్రదర్శనను పురస్కరించుకుని పోలీసులు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. రాష్ట్ర నలువైపుల నుంచి వేలాది వాహనాల్లో పార్టీ శ్రేణులు ఉప్పెనలా తరలివస్తుండంతో ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా నగరంలో ట్రాఫిక్ మళ్లింపుపై ప్రత్యేకదృష్టి సారించారు.

త్యాగానికి ప్రతిరూపం ఎర్ర జెండా

- సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

- విజయవాడకు చేరిన ఫ్లాగ్ మార్చ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'ఎర్ర జెండా అంటేనే పోరాటం... ఎర్ర జెండా అంటేనే త్యాగం... ఎర్ర జెండా అంటేనే బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి... ఎర్ర జెండా అంటేనే అజరామరం....' అని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. అనేక పోరాటాలు, త్యాగాలతో పునీతమైన జెండా... ఎర్ర జెండా అని, ఆ జెండా భవిష్యత్తు తరాలకు మార్గదర్శి... దిక్సూచి... అని ఆయన వివరించారు. కేరళలోని కొల్లాం నుంచి యంగ్ కమ్యూనిస్టు ఫ్లాగ్ మార్చ్ కెప్టెన్, ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై రామన్ నేతృత్వంలో చేపట్టిన యంగ్ కమ్యూనిస్టు ఫ్లాగ్ మార్చ్‌కు గుంటూరు జిల్లా ఉండవల్లి సెంటరులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, జి.ఈశ్వరయ్య, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు తదితరులు స్వాగతం పలికారు. ఫ్లాగ్ మార్చ్ ప్రకాశం బ్యారేజ్, వన్‌టౌన్, పంజా సెంటర్, ఎర్రకట్ట, కేదారేశ్వరీపేట మీదుగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయానికి చేరుకుంది. అనంతరం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అరుణ పతాకాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సీపీఐ పార్లమెంటరీ పక్ష నాయకులు వినయ్ విశ్వం, మహిళా సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి అనీ రాజా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షులు సుకిందర్ మహేశ్వరి, జాతీయ ఉపాధ్యక్షులు వలీ ఉల్లా ఖాద్రీ, ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు నితీశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ గత 97 సంవత్సరాలుగా పీడిత, తాడిత ప్రజానీకానికి భారత కమ్యూనిస్టు పార్టీ అండగా నిలుస్తోందన్నారు. రాజీలేని పోరాటాలతో ముందుకు సాగుతూ, వారి సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కె.రామకృష్ణ మాట్లాడుతూ ఈ దేశ ప్రజల నమ్మకాన్ని పెంచి భవిష్యత్తుపై ఆశలు కలిగించేందుకు ఫ్లాగ్ మార్చ్ ఉత్తేజాన్ని కలిగిస్తుందన్నారు. ఈ యాత్రతో పాటు ఫ్లాగ్ మార్చ్‌కు సారథ్యం వహించిన తిరుమలై మాట్లాడుతూ సీపీఐ 23వ జాతీయ మహాసభలు జరిగిన కొల్లాం నుంచి 24వ మహాసభల సందర్భంగా 24 మంది ఎర్రజెండాలు చేబూని రెడ్‌షర్ట్ వలంటీర్లు విజయవాడకు బయలుదేరారని అన్నారు. ఈ ఫ్లాగ్ మార్చ్ కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలో దాదాపు 35 జిల్లాలు ప్రయాణించిందని వివరించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజలెంతో ఉత్సాహంగా ఫ్లాగ్ మార్చ్‌కు సహకారం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మత్స దుర్గాభవానీ, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, లెనిన్‌బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు, ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, కోశాధికారి ఎం.సాయికుమార్ తదితరులు ఉన్నారు.

హిజాబ్ వివాదం
సుప్రీం భిన్న తీర్పులు

సీజేఐ ముందుకు చేరిన అంశం

పిటిషన్లను తోసిపుచ్చిన జస్టిస్ గుప్తా

అమ్మాయిల విద్యకే ప్రాధాన్యతన్న జస్టిస్ ధులియా

న్యూఢిల్లీ: ముస్లిం విద్యార్థినులు విద్యాసంస్థల్లో హిజాబ్ ధరించరాదని కర్ణాటక ప్రభుత్వం విధించిన నిషేధం కేసుపై సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసింది. దీనిపై సుప్రీం కోర్టులో గురువారం భిన్న తీర్పులు వెలువడ్డాయి. ఈ అంశంపై దాఖలైన పిటిషన్లను ద్విసభ్య ధర్మాసనంలోని న్యాయమూర్తులు వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. హిజాబ్ నిషేధానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను న్యాయమూర్తి జస్టిస్ హేమంత్ గుప్తా తోసిపుచ్చగా, జస్టిస్ సుధాన్షు ధూలియా అనుమతించారు. ఈ అంశాన్ని భారత ప్రధాన న్యాయమూర్తి ముందుంచుతామని, ఈ కేసును కొత్త బెంచ్ విచారిస్తుందా లేదా విస్తృతస్థాయి ధర్మాసనానికి సూచించాలా అనేది ఆయన నిర్ణయిస్తారని పిటిషనర్ తరపు న్యాయవాది ఒకరు తెలిపారు. రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో హిజాబ్ ధరించడాన్ని నిషేధించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను సమర్థిస్తూ కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీళ్లను జస్టిస్ హేమంత్ గుప్తా తోసిపుచ్చారు. జస్టిస్ గుప్తా మాట్లాడుతూ 'భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నా ఆర్డర్‌లో, నేను 11 ప్రశ్నలు రూపొందించాను. ముందుగా అప్పీలును రాజ్యాంగ ధర్మాసనానికి పంపాలా వద్దా అనేది తేలాల్సి ఉంది' అని అన్నారు. కాగా అప్పీళ్లను జస్టిస్ సుధాన్షు ధులియా అనుమతించి, కర్ణాటక హైకోర్టు ఆదేశాలను పక్కన పెట్టారు. 'ఇది ఎంపిక విషయం. అంతకంటే తక్కువ ఏమీ లేదు' అని జస్టిస్ ధూలియా పేర్కొన్నారు. అమ్మాయిలకు విద్యను అందించడమే తనకు ప్రాముఖ్యమైన విషయమని, అయితే హిజాబ్‌ను నిషేధించడం వల్ల ఆ అమ్మాయిల జీవితాలు బాగుపడుతాయా అని జస్టిస్ ధులియా ప్రశ్నించారు. ఈ విషయంలో సోదర న్యాయమూర్తితో మర్యాద పూర్వకంగా విభేదిస్తున్నానని అన్నారు. విద్యా సంస్థల్లో హిజాబ్‌పై నిషేధాన్ని కర్ణాటక హైకోర్టు సమర్థించడాన్ని సవాలు చేస్తూ దాఖలయిన వివిధ పిటిషన్లపై సుప్రీం కోర్టు ఇంతకుముందు తన తీర్పును రిజర్వ్ చేసింది. ఈ కేసులో 10 రోజుల పాటు వాదనలు సాగగా, పిటిషనర్ల తరపు 21 మంది న్యాయవాదులు, ప్రతివాదుల తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అడిషనల్ సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్, కర్ణాటక అడ్వకేట్ జనరల్ ప్రభులింగ్ నవాద్గీ వాదించారు. విద్యా సంస్థల్లో యూనిఫారాలను సూచించేలా ఆదేశించాలన్న కర్ణాటక ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై వివిధ పిటిషన్లను కోర్టు విచారించింది. డ్రెస్ కోడ్‌ను అమలు చేసిన కర్ణాటక ప్రభుత్వ సర్క్యులర్‌లో పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) గురించి ఎటువంటి ప్రస్తావన లేదని సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే ధర్మాసనానికి తెలిపారు. కాగా పాఠశాలలు, కళాశాలల యూనిఫాం నిబంధనలను కఠినంగా అమలు చేయాలన్న కర్ణాటక ప్రభుత్వ ఉత్తర్వులను సమర్థిస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ వివిధ పిటిషనర్లు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. 'ప్రభుత్వ అధికారుల సవతి-తల్లి ప్రవర్తన వల్ల విద్యార్థులు తమ విశ్వాసాన్ని పాటించకుండా నిరోధించింది. అవాంఛనీయ శాంతిభద్రతల పరిస్థితికి దారితీసింది' అని అత్యున్నత న్యాయస్థానంలో అప్పీలు ఒకటి ఆరోపించింది. అప్పీల్‌లో హైకోర్టు ఆరోపించిన ఉత్తర్వు 'తన మనస్సును అన్వయించడంలో తీవ్రంగా విఫలమైందని, పరిస్థితి తీవ్రతను, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 కింద పొందుపరచబడిన ముఖ్యమైన మతపరమైన ఆచారాల ప్రధాన అంశాన్ని అర్థం చేసుకోలేకపోయింది' అని పేర్కొంది. కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రితూ రాజ్ అవస్థి, న్యాయమూర్తులు జస్టిస్ కృష్ణ ఎస్ దీక్షిత్, జస్టిస్ జె.ఎం.ఖాజీతో కూడిన ధర్మాసనం గతంలో యూనిఫాం ఎలా ఉండాలన్నది సహేతుకమైన పరిమితి అని పేర్కొంది. హిజాబ్ నిషేధాన్ని సవాలు చేస్తూ వచ్చిన వివిధ పిటిషన్లను కొట్టివేసింది. ఈ ఏడాది జనవరిలో ఉడిపిలోని ప్రభుత్వ పీయూ కళాశాలలో హిజాబ్ ధరించిన ఆరుగురు బాలికలను లోనికి రానీయకుండా నిషేధించడంతో హిజాబ్ వివాదం చెలరేగింది. దీంతో కళాశాలలో ప్రవేశం నిరాకరిస్తూ బాలికలు కళాశాల బయట బైఠాయించి నిరసన తెలిపారు. దీని తరువాత, ఉడిపిలోని అనేక కళాశాలల అబ్బాయిలు కాషాయ కండువాలు ధరించి తరగతులకు హాజరు కావడం ప్రారంభించారు. ఈ నిరసన రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించడంతో పాటు కర్ణాటకలోని అనేక చోట్ల నిరసనలు, ఆందోళనలకు దారితీసింది. ఫలితంగా, కర్ణాటక ప్రభుత్వం విద్యార్థులందరూ తప్పనిసరిగా యూనిఫాంకు కట్టుబడి ఉండాలని, నిపుణుల కమిటీ ఈ అంశంపై నిర్ణయం తీసుకునే వరకు హిజాబ్, కాషాయ కండువాలు రెండింటినీ నిషేధించింది. ఫిబ్రవరి 5న, ప్రీ-యూనివర్సిటీ ఎడ్యుకేషన్ బోర్డు ఒక ఉత్తర్వును విడుదల చేసింది. విద్యార్థులు పాఠశాల నిర్వాహకులు ఆమోదించిన యూనిఫాం మాత్రమే ధరించాలి. ఇతర మతపరమైన దుస్తులు ధరించే విద్యార్థులను కళాశాలల్లోకి అనుమతించరు.

'హిజాబ్' సుప్రీం దృష్టిని ఆకర్షిస్తూనే ఉంటుంది: జైరాం

న్యూఢిల్లీ : హిజాబ్ కేసులో సుప్రీం కోర్టు భిన్న తీర్పులు వెలువరించడం అంటే ఈ అంశం సుప్రీం కోర్టు దృష్టిని ఆకర్షిస్తూనే ఉంటుందని కాంగ్రెస్ గురువారం తెలిపింది. ఆర్థిక అసమానత వంటి సమస్యలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నుంచి జవాబుదారీతనం భారత్ జోడో యాత్ర డిమాండ్ చేస్తూనే ఉంటుందని పేర్కొంది. కర్ణాటకలోని విద్యాసంస్థల్లో హిజాబ్‌లపై నిషేధం విధించడంపై సుప్రీం కోర్టు భిన్నమైన తీర్పును వెలువరించింది. విస్తృత ధర్మాసనం ఏర్పాటుకు భారత ప్రధాన న్యాయమూర్తికి ఈ విషయాన్ని సూచించింది. 'హిజాబ్ కేసులో సుప్రీం కోర్టు విభజన తీర్పు ఆ విషయం కోర్టు దృష్టిని ఆకర్షిస్తూనే ఉంటుంది. ఇదిలా ఉంటే, పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, సామాజిక ధ్రువణత, రాజకీయ నియంతృత్వంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నుంచి జవాబుదారీతనాన్ని కోరుతూ భారత్ జోడో యాత్ర కొనసాగుతుంది' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ హిందీలో ట్వీట్ చేశారు.

కమ్యూనిజమే ఉత్తమం

విశాలాంధ్ర-విజయవాడ: మార్క్సిజానికి మించినది ప్రపంచంలో ఏదీ లేదని, కమ్యూనిజం ఉన్నతమైనదని ప్రముఖ వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్వర్యంలో గురువారం గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆట-పాట-మాట...ధూమ్ ధామ్ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. భారత కమ్యూనిస్టు పార్టీ 24వ జాతీయ మహాసభల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి నిర్వహించిన ధూమ్ ధామ్ కార్యక్రమంలో గోరేటి వెంకన్న పాల్గొన్నారు. సృష్టిలో సంపద ఎవరి ద్వారా వస్తున్నది... ఈ సంపదకు యజమానులు ఎవరన్నదానిపై గోరేటి వెంకన్న తనదైన శైలిలో పాటల ద్వారా సభికులను ఉత్తేజపరిచారు. ప్రశ్నించేతత్వం ఒక్క కమ్యూనిస్టులకే ఉంటుందని, అలాంటి వారిపై మనువాదశక్తులు అక్రమ కేసులు బనాయించడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ఎర్రజెండా ఎప్పుడూ జీవంతోనే ఉంటుందని కొనియాడారు. ఆట-పాట-మాట కళాకారుల ధూమ్ ధామ్‌కు విచ్చేసిన గుంటూరు రమణ, పాటల తోట ఉదయభాస్కర్, రంగం రాజేశ్, నూకతోటి శరత్‌బాబు, సత్య పాడిన పాటలు ప్రేక్షకులను ఆలోచింపజేసేవిగాను, ఆనందింపజేసేవిగా ఉన్నాయి. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, రాజ్యసభ సభ్యులు వినయ్ విశ్వం, జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, గుజ్జుల ఓబులేసు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఇన్‌చార్జి పీజే చంద్రశేఖరరావు పాల్గొన్నారు. సభకు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య స్వాగతం పలకగా రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్ర నాయక్ అధ్యక్షతన ధూంధాం విజయవంతంగా జరిగింది. ఈ పాటల పండగలో గని, ఎస్‌కే నజీర్, ఎస్.గురప్ప, ఆర్.పిచ్చయ్య, మహంతి లక్ష్మణరావు, కుమార్ శామ్యూల్, ఆర్.రామకృష్ణ పాల్గొన్నారు. హనుమంతరాయ గ్రంథాలయంలో 15 నుంచి 17వ తేదీ వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని, ఈ పాటల పండగకు విజయవాడ నగర ప్రజలు, ప్రతినిధులు హాజరై జయప్రదం చేయాలని చంద్రనాయక్, పెంచలయ్య విజ్ఞప్తి చేశారు.

ఉగ్రవాదుల్ని పట్టించిన జాగిలం కన్నుమూత

న్యూఢిల్లీ: అనంత్‌నాగ్ జిల్లాలో సోమవారం ఇద్దరు ఉగ్రవాదుల్ని సైన్యానికి పట్టించిన 'జూమ్' అనే జాగిలం గురువారం కన్నుమూసింది. ఉగ్రదాడిలో రెండు తూటాలు తగలడంతో సైనిక ఆస్పత్రిలో చేర్పించి శస్త్రచికిత్స చేయగా.. చికిత్సపొందుతూ గురువారం మధ్యాహ్నం ప్రాణాలు విడిచింది. సైనిక జాగిలం 'జూమ్' అడ్వాన్స్‌డ్ ఫీల్డ్ వెటర్నరీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ మధ్యాహ్నం 12గంటల సమయంలో మృతిచెందినట్టు సైన్యం వెల్లడించింది. ఈ ఉదయం 11.45గంటల సమయంలో బాగానే స్పందించిందని.. అకస్మాత్తుగా ఎగ ఊపిరి రావడంతో కుప్పకూలిపోయిందని తెలిపారు. మాతృదేశాన్ని రక్షించుకొనే క్రమంలో తమ ప్రాణాలు మీదకు వచ్చినా వెనకడుగు వేయని సైనికుల మాదిరిగానే వారి శిక్షణలో ఆరితేరిన 'జూమ్' సోమవారం ముష్కరుల్ని పట్టించడంలో తన నిబద్ధతను చాటుకుంది. జమ్ముకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా తంగపావా ప్రాంతంలో ఇద్దరు లష్కరే తొయిబా ఉగ్రవాదులు నక్కినట్లు సమాచారం అందడంతో భద్రతా బలగాలు రంగంలోకి దిగాయి. ముష్కరులను గుర్తించే పనిని అధికారులు జూమ్ అనే జాగిలానికి అప్పగించారు. దీంతో అది ఉగ్రవాదులను గుర్తించి, వారిపై దాడి చేసింది. ఈ క్రమంలో రెండు తూటాలు శరీరంలోంచి దూసుకెళ్లినా అది తన పోరాటాన్ని ఆపలేదు. ఇంతలో భద్రతా దళాలు అక్కడికి చేరుకుని, ఉగ్రవాదులను హతమార్చాయి. ఈ ఘటనలో జూమ్‌తో పాటు ఇద్దరు సైనికులు కూడా గాయపడ్డారు. ఉగ్రవాదులను గుర్తించి, మట్టుబెట్టడంలో 'జూమ్' ప్రదర్శించిన తెగువకు ప్రశంసలు వెల్లువెత్తాయి. కఠినమైన సైనిక శిక్షణ పొందిన ఈ జాగిలం.. గతంలోనూ అనేక ఆపరేషన్లలో ఎంతో నిబద్ధతను ప్రదర్శించింది.

చిత్రదుర్గ గ్రామాల్లో 'భారత్ జోడో'

చిత్రదుర్గ: కర్ణాటకలో భారత్ జోడో యాత్ర హుషారుగా సాగుతోంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు యువత, పార్టీకార్యకర్తలు, ప్రజలు కలిసి కదం తొక్కుతున్నారు. గురువారం చిత్రదుర్గ జిల్లాలోని బొమ్మగొండనహళ్లి నుంచి యాత్ర మొదలైంది. రోడ్డుకు ఇరువైపుల నిలబడి ప్రజలు యాత్రను స్వాగతించారు. ఉదయం 6.30 గంటలకు బొమ్మగొండనహళ్లిలోని బీజీ కేరే అండర్‌పాస్ నుంచి యాత్ర మొదలై 12కిమీలు సాగిన తర్వాత కొనసాగర వద్ద విరామం అనంతరం సాయంత్రం మొలకల్మురు వరకు సాగింది. రాత్రికి రామపురలో గాంధీ బసచేశారు. సెప్టెంబరు 30న కర్ణాటకలోకి ప్రవేశించిన యాత్ర ఈనెల 20న రాష్ట్రం దాటుతుంది. 21రోజుల్లో 511 కిమీలు సాగుతుంది.

జాతీయ రాజకీయాల్లో భారీ మార్పు

(మొదటిపేజీ తరువాయి)

10.30 గంటలకు మహాసభలు జరిగే ప్రాంగణంలో జాతీయ పతకాన్ని కామ్రేడ్ ఏటుకూరి కృష్ణమూర్తి, పార్టీ పతాకాన్ని సీపీఐ పూర్వపు జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి, అమర వీరుల స్థూపాన్ని సీపీఐ పూర్వపు జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ ఈడ్పుగంటి నాగేశ్వరరావు ప్రారంభిస్తారన్నారు. అనంతరం ఉదయం 11 గంటలకు నారాయణ స్వాగతోపన్యాసం, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.రాజా మహాసభలను లాంఛనంగా ప్రారంభిస్తారు. 16వ తేదీ సభలో విదేశీ ప్రతినిధులు సందేశాలిస్తారు. 18న నూతన జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న సంక్లిష్ట పరిస్థితుల నడుమ జరుగుతున్న ఈ మహాసభలు అత్యంత కీలకం కానున్నాయి. బీజేపీ చర్యల వల్ల దేశంలో అస్సలు రాజ్యాంగం ఉంటుందా ? మనుగడ సాగిస్తుందా ? అనే అనుమానాలు స్పష్టంగా కలుగుతున్నాయన్నారు. సీపీఐ ఒక్కటే బీజేపీని ఓడిస్తామని చెప్పడం లేదని విస్పష్టం చేస్తూ అందర్నీ కలుపుకుని బీజేపీపై పోరాటం చేస్తామన్నారు. టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇటీవల వరకు బీజేపీతో అనుకూలంగా ఉన్నారని, ఇప్పుడు వారికి వ్యతిరేకంగా పార్టీ పెట్టారని నారాయణ పేర్కొన్నారు. బీజేపీకి ఎవరు వ్యతిరేకంగా పోరాటం చేసినా తాము సంపూర్ణ మద్దతు ఇస్తామన్నారు. దేశంలో బలమైన ప్రాంతీయ పార్టీగా ఉన్న వైసీపీ సైతం కేంద్రం ఏది చెబుతుంటే దానికి సహకరిస్తోందని, అది ఎందుకో తమకు ఏమాత్రం అర్థం కావడం లేదన్నారు. రాష్ట్రాలను ఆర్థికంగా కేంద్ర ప్రభుత్వం అణిచి వేస్తోందని విమర్శించారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రాంతీయ పార్టీలు సమైక్యంగా పోరాడాలని పిలుపిచ్చారు. ప్రజలతో ఉంటారో, బీజేపీతో ఉంటారో జగన్ తేల్చుకోవాలని సూచించారు. బీజేపీకి కొమ్ముకాస్తున్న పారిశ్రామికవేత్త అదానీ గంజాయి స్మగ్లింగ్ చేస్తూ కుబేరుడయ్యాడని విమర్శించారు. విశాఖలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, ఆ పార్టీ నేతల భూముల ఆక్రమణలు, దోచుకోవడంపై సీఎం జగన్ స్పందించాలని డిమాండ్ చేశారు. దేశంలో మంచి ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకుంటానన్న జగన్, భూముల కబ్జాపై ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. దేశంలోని వామపక్ష, లౌకిక ప్రజాతంత్ర శక్తులంతా ఏకమై రాబోయే ఎన్నికల్లో మోదీని గద్దె దించేందుకు మహాసభలు ఒక వేదిక కానున్నాయని పేర్కొన్నారు. అటు ప్రాంతీయ పార్టీలు, బీజేపేతర శక్తులు సైతం ఐక్యంగా ముందుకు సాగి మోదీ విధానాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయాలని, కేంద్రంలోని బీజేపీని గద్దె దించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ప్రత్యేక బస్సులు, రైళ్ల ద్వారా రాక: రామకృష్ణ

రామకృష్ణ మాట్లాడుతూ దేశ రాజకీయాలను మార్చేలా సీపీఐ జాతీయ మహాసభలు కీలకం కానున్నాయన్నారు. మహాసభలకు దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. 14న జరిగే ప్రజాప్రదర్శనకు బస్సులు, రైళ్ళు, ఇతర రవాణా వాహనాల ద్వారా పార్టీ శ్రేణులు, సానుభూతి పరులు వేలాదిగా తరలిరానున్నారు. బహిరంగ సభ నిర్వహించే ప్రాంగణాన్ని కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు (సీఆర్) మైదానంగా నామకరణం చేశారు. సీఆర్ స్వస్థలమైన కృష్ణాజిల్లా మంగళాపురం నుంచి 24 మంది పార్టీ శ్రేణులు జెండాలు పట్టుకుని పాదయాత్రతో సభా స్థలికి చేరుకుంటారు. మహాసభల విజయవంతం కోరుతూ కేరళ రాష్ట్రం కొల్లాం నుంచి 24 మంది యువకులు బైక్ ర్యాలీతో నగరానికి చేరుకున్నారని రామకృష్ణ వివరించారు. మహాసభలు జరిగే ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌కు ప్రముఖ కమ్యూనిస్టు నేత గురుదాస్ దాస్ గుప్తా ప్రాంగణంగా నామకరణం చేశారు. వాటితోపాటు వివిధ విభాగాలకు షమీమ్ ఫైజీ హాల్, దాసరి భోజన శాల, రాఘవాచారి బుక్స్‌ఎగ్జిబిషన్‌గా నామకరణం చేసినట్లు వివరించారు. మహాసభలకు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివస్తున్నట్లు తెలిపారు. వారి కోసం ప్రత్యేక బస్సులు, రైళ్లు కేటాయించామని, అటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా స్వతంత్రంగా వివిధ రకాల వాహనాల్లో తరలివస్తున్నారన్నారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి, సీపీఐ (ఎంఎల్) నాయకులు దీపాంకర్ భట్టాచార్య, ఏఐఎఫ్‌బీ నుంచి జి.దేవరాజన్ తదితరులు వస్తున్నారని వివరించారు. వామపక్షాల పురిటిగడ్డయిన విజయవాడలో కమ్యూనిస్టు ఉద్యమాలకు ఎల్లవేళలా ఆదరణ ఉందని, 47 ఏళ్ల తర్వాత జరుగుతున్న ఈ మహాసభలకూ అనూహ్య స్పందన లభిస్తోందని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో మహాసభల ఆహ్వాన సంఘం కమిటీ నుంచి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మనోహర్‌నాయుడు, పార్టీ నాయకులు చలసాని అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అదరం... బెదరం...

రాష్ట్ర అభివృద్ధికే మా పోరాటం

మహా పాదయాత్ర రైతుల ఉద్ఘాటన

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రాజధానిగా అమరావతే ఉండాలని, దానికోసమే మా పోరాటమని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా అదరం.. బెదరం అని మహాపాదయాత్ర రైతులు ఉద్ఘాటించారు. 'ఒకే రాష్ట్రం- ఒకే రాజధాని' అనే నినాదంతో అమరావతి జేఏసీ పరిరక్షణ ఆధ్వర్యంలో రైతులు తలపెట్టిన మహా పాదయాత్ర 32వ రోజైన గురువారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం ఉండ్రాజవరం నుంచి ప్రారంభమైంది. రైతు రథం వద్ద స్థానిక మహిళలు కొబ్బరికాయలు కొట్టి, పూలుజల్లి పాదయాత్ర ప్రారంభించారు. జై అమరావతి, ఒకే రాజధాని... ఒకే రాష్ట్రం అంటూ రైతులు, మహిళలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మోర్త, దమ్మెన్ను గ్రామాల మీదుగా పెరవల్లి మండలం నడుపల్లి కోట, కానూరు మీదుగా సాయంత్రం 6 గంటలకు నిడదవోలు మండలం మునిపల్లికి పాదయాత్ర చేరుకుంది. పాదయాత్రలో టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మాజీ మంత్రి కేఎస్ జవహర్, మాజీ ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బూరుగుపల్లి శేషారావు, సీపీఐ, జనసేన నాయకులు పాల్గొన్నారు. కాగా, రైతుల పాదయాత్ర అడ్డుకోవడానికి వైసీపీ నాయకులు ప్రయత్నించగా పోలీసులు నియంత్రించారు. మహిళా రైతులు మాట్లాడుతూ, న్యాయస్థానం తీర్పును గౌరవించని మంత్రులు కవ్వింపు చర్యలకు పాల్పడటం సిగ్గుచేటని అన్నారు.

అఖిల భారత కిసాన్ సభ మద్దతు

అమరావతి రైతుల మహా పాదయాత్రకు అఖిల భారత కిసాన్ సభ జాతీయ సమితి సంపూర్ణ మద్దతు నిస్తుందని సీపీఐ జాతీయ కార్యదర్శి, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజన్ అన్నారు. దమ్మెన్నులో అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు రైతుల మహాపాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు. అతుల్ కుమార్ అంజన్ మాట్లాడుతూ అమరావతినే ఏకైక రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. రైతుల ఉద్యమం ప్రభుత్వ పతనానికి నాందిగా నిలుస్తుందన్నారు. మూడు రాజధానులు అనేది బూటకమని , ప్రజలను మభ్య పెట్టడం తప్ప మరొకటి కాదన్నారు. రావుల వెంకయ్య మాట్లాడుతూ పాదయాత్రకు ఆటంకాలు కల్పించడం, పోటీ ఉద్యమాలు చేయడం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు అద్దం పడుతుందన్నారు. ప్రసాద్ మాట్లాడుతూ, పాదయాత్రకు రాష్ట్ర ప్రజలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారన్నారు.

భీమారావు మాట్లాడుతూ, ప్రభుత్వం శాసనసభను రద్దు చేసి మూడు రాజధానుల ఎజెండాతోఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. సీపీఐ నాయకులు నామన వెంకటేశ్వరరావు, బొమ్మసాని రవిచంద్ర, గుబ్బల వెంకటేశ్వర రావు, బండి సత్యనారాయణ, పుట్టా అమ్మిరాజు, బొద్దాని మురళి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉండ్రాజవరపు మురళి పాల్గొన్నారు.

దేశాన్ని కార్పొరేట్‌లకు దోచిపెడుతున్న బీజేపీ

సీపీఐ రాష్ట్ర నాయకుడు, విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు

విశాలాంధ్ర-మోపిదేవి: బీజేపీ ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్‌లకు దోచిపెడుతోందని సీపీఐ రాష్ట్ర నాయకుడు, విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు విమర్శించారు. భూ పోరాట యోధుడు కామ్రేడ్ కంఠంనేని అచ్యుతరామయ్య 11వ వర్ధంతి సభ గురువారం మోపిదేవిలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాఘవేంద్రరావు మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో నిరంకుశత్వ పరిపాలన సాగుతోందని, ప్రభుత్వాన్ని బీజేపీ కార్పొరేట్‌లకు కట్టబెట్టే యత్నం చేస్తోందని ఆయన మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అదానీ, అంబానీ లక్షల కోట్లకు పడగలెత్తారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ... అభివృద్ధిని మర్చిపోయారని విమర్శించారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు దాటినా పోలవరం ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. పోలవరం పూర్తి చేసే ఆలోచన మరిచారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని, నియంతృత్వ పోకడలను ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. భూ పోరాట యోధుడు, పేద ప్రజల పక్షాన ముందుండి నిరంతరం పోరాటాలు చేసిన కామ్రేడ్ కంఠంనేని అచ్యుతరామయ్య జీవితం నేటితరం నాయకులకు దిక్సూచిగా నిలుస్తుందన్నారు. ఆయన చూపిన బాటలో కమ్యూనిస్టు పార్టీ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. కామ్రేడ్ అచ్యుత రామయ్య స్ఫూర్తిని కొనసాగించాలని హితవు పలికారు. ఎంపీపీ రావి దుర్గావాణి మాట్లాడుతూ 15 సంవత్సరాలు అచ్యుతరామయ్య గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై గ్రామాభివృద్ధికి నూతన ఒరవడి సృష్టించారని కొనియాడారు. సర్పంచ్‌గా ఆయన వేసిన అభివృద్ధి బాటలే నేటి నాయకులకు స్ఫూర్తిగా ఉన్నాయని అభివర్ణించారు. మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు మాట్లాడుతూ అచ్యుతరామయ్య కుటుంబసభ్యులు ఆయన ఆశయాలను పుణికిపుచ్చుకొని, సేవా కార్యక్రమాలు కొనసాగించడం ఎంతో గర్వించదగ్గ విషయమని అభినందించారు. తొలుత పార్టీ నాయకులు, కార్యకర్తలు మోపిదేవి పురవీధుల్లో ర్యాలీగా వెళ్లి ప్రధాన సెంటర్లో ఉన్న అమరవీరుల స్థూపం వద్ద జెండా ఆవిష్కరించారు. అనంతరం అచ్యుత రామయ్య చిత్రపటానికి పూలమాలవేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ కమ్యూనిస్టు పార్టీ నాయకులను సత్కరించారు. అనంతరం 15 మంది కార్యకర్తలకు నూతన వస్త్రాలను బహుకరించారు. కంఠంనేని ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలను ట్రస్ట్ కార్యదర్శి కంఠంనేని కుటుంబరావు వివరించారు. విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు మాలెంపాటి కాంచనరావు, పార్టీ సీనియర్ నాయకులు మోపిదేవి వెంకటరావు, కొలుసు లక్ష్మయ్య, రావి ప్రభు ప్రసాద్, దాసరి రామకృష్ణ, అచ్యుతరామయ్య కుటుంబ సభ్యులు పాలడుగు రత్నబాబు, కంఠంనేని జోత్స్నా దేవి, కంఠంనేని వాసు తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి ఉద్యోగుల సమస్యలు

ఆర్టీసీ-పీటీడీ ఉద్యోగుల ఐక్యవేదిక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం జగన్ దృష్టికి ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను వినతిపత్రాల ద్వారా తీసుకువెళ్లామని ఆర్టీసీ-పీటీడీ ఉద్యోగుల ఐక్యవేదిక సంఘం తెలిపింది. ఈ మేరకు ఏపీఎస్ఆర్టీసీ-పీటీడీ ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక కన్వీనర్లు వైవీ శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు, కో-కన్వీనర్లు సిహెచ్.సుందరయ్య, వైఎస్ రావు, ఈయూ రాష్ట్ర అధ్యక్షులు వైవీరావు, ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్షులు పీవీ రమణారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల కలెక్టర్ల ద్వారా సీఎంకు పీటీడీ ఉద్యోగుల సంతకాలతో కూడిన డిమాండ్లను అందజేశా రన్నారు. ఈ వినతులపై సీఎం స్పందించకుంటే త్వరలో జేఏసీ సమావేశమై ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. 2020 జనవరి తర్వాత గ్రేడ్-1 పదోన్నతులు పొందిన వారితోపాటు అర్హులందరికీ పీఆర్సీ అమలు చేయాలన్నారు. ప్రభుత్వం వద్ద నిలిచిపోయిన ఉద్యోగుల సెలవుల ప్రయోజనాలను పరిష్కరించాలని, ఆర్టీసీలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో పని చేస్తున్న మహిళలందరికీ ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు వర్తించేలా అన్ని సర్వీసు రూల్స్ వర్తింపజేయాలన్నారు. ఆర్టీసీ సిబ్బందికి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ఆర్టీసీలో దాదాపు 33 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఎస్ఆర్‌బీఎస్ స్కీమ్‌ను కొనసాగించాలని, పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ అధికారులు ఏకపక్ష వైఖరి విడనాడి, తక్షణమే ఉద్యోగుల సమస్యల పరిష్కారం పై దృష్టి పెట్టాలని కోరారు.

కర్నూలులో భారీ వర్షం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : భారీ వర్షాలకు కర్నూలు అతలాకుతలమైంది. పంటపొలాలు నీటమునిగి, చెరువుల కట్టలు తెగాయి. బుధవారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి 12ఏళ్ల తర్వాత ఆదోని చెరువు నిండి అలుగుపారింది. కంబాలపాడు చెరువు నిండింది. అవుకు మండలం మంగంపేట చెరువు కట్ట తెగింది. హంద్రీకి భారీగా నీరు వచ్చి చేరడంతో కర్నూలు లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. గోనెగండ్ల ప్రాజెకులో నీరు పూర్తిస్థాయిలో ఉంది. అవుకు, కొలిమిగుండ్ల, ఆదోని, పెద్దకడుబూరు, హోలగుంద మండలాల్లో పంటలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. చాలా మండలాల్లో రాకపోకలు నిలిచిపోయాయి.

ఉపాధ్యాయుల పదోన్నతులు పరిష్కరించాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించిన అన్ని రకాల సమస్యలు తక్షణమే పరిష్కరించి బదిలీల షెడ్యూలు విడుదల చేయాలని రాష్ట్రోపా ధ్యాయ సంఘం(ఎస్టీయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఇబ్రహీంపట్నం విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో సంయుక్త సంచాలకులు మువ్వ రామలింగానికి ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న వినతిపత్రం అందజేశారు. 610జీవో కింద ఉన్న ఉపాధ్యాయులు పదోన్నతులు కోల్పోకుండా చూడాలని, పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల వర్గాలకు న్యాయం చేయాలని కోరారు. జేడీని కలిసిన వారిలో ఎస్టీయూ నాయకులు దేవరపల్లి విద్యాసాగర్, కె.బాలాజీ పాల్గొన్నారు.

ముంపు బాధితులపై కనికరం లేదా?

- ప్రజాప్రతినిధుల ఉదాసీనతపై సీపీఐ నేతల ఆగ్రహం
- నీటమునిగిన ప్రాంతాల్లో పర్యటన
- తక్షణం 25 కేజీల బియ్యం, రూ.2 వేలు అందించాలని డిమాండ్

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: అనంతపురంలో ముంపునకు గురైన ప్రాంతాల్లో బాధితులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. నగరంలో భారీ నుంచి అతి భారీ వర్షాలకు ముంపునకు గురైన ప్రాంతాల్లో ప్రజా ప్రతినిధులు పర్యటించిన దాఖలాలు లేవని మండి పడ్డారు. గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల తాకిడికి అర్బన్ నియోజక వర్గ పరిధిలోని అనేక ప్రాంతాలు నీట మునిగి ప్రజలు జలదిగ్బంధంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. దీంతో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్ పార్టీ కార్యకర్తలతో కలిసి గురువారం పార్వతమ్మ కాలనీ, ఆజాద్ నగర్, సోమల దొడ్డి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. నాలుగు అడుగుల మేర ఇళ్లలోకి చేరడంతో సర్వం కోల్పోయి ఆకలితో అలమటిస్తున్న బాధితులను పరామర్శించారు. వారి అవసరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ... గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రుద్రంపేట గ్రామ పంచాయతీ ఎగువ ప్రాంతంలోని చెరువులు, కుంటలు పొంగిపొర్లి నగరంలోని అనేక ప్రాంతాల్లో భారీగా వర్షపు నీరు చేరడంతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. జలమయమైన ఇళ్లలో ఉండలేక మిద్దెలపై తల దాచుకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. మూడు రోజులుగా ఆయా కాలనీల ప్రజలు తినడానికి తిండిలేక అల్లాడుతున్నారన్నారు. దీనికి తోడు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో బిక్కు బిక్కుమంటూ చీకట్లో గడిపారని విచారం వ్యక్తంచేశారు. ఇంత జరుగుతున్నా ప్రజా ప్రతినిధులు ముంపు ప్రాంతాలను సందర్శించలేదని విమర్శించారు. పోలీసులు స్పందించి ఒకటి రెండు ప్రాంతాల్లో మాత్రమే బాధితులకు సహాయ పడ్డారని, అయితే ప్రజా ప్రతినిధులకు చీమ కుట్టినట్టైనా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీకి చెందిన అనేకమంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, రాష్ట్ర స్థాయి నాయకులు జిల్లా కేంద్రంలోనే ఉంటున్నప్పటికీ బాధిత ప్రజలపై కనికరం లేకుండా ఉన్నారని తూర్పారబట్టారు. వెంటనే అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఉన్నతాధికారులు ముంపు ప్రాంతాలను స్వయంగా సందర్శించి, బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాఫర్ మాట్లాడుతూ 40 సంవత్సరాల కాలంలో ఎన్నడూ లేనివిధంగా భారీ వర్షాలు కాలనీలను ముంచెత్తాయన్నారు. యుద్ధ ప్రాతిపదికన జిల్లా కలెక్టర్, నగర మేయర్, కమిషనర్ ఇతర ప్రజా ప్రతినిధులు స్పందించి బాధితులను ఆదుకోవాలన్నారు. ముంపునకు గురైన ప్రతి ఇంటికి 25 కేజీల బియ్యం, పప్పు దినుసులు, రెండువేల. రూపాయల నగదు తక్షణం అందజేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో వర్షాలు మరింత పెరిగే అవకాశం ఉందని బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజా ప్రతినిధులు మీడియాకు పరిమితమై బాధితులను ఆదుకుంటామని ప్రకటనలు మాని క్షేత్ర స్థాయిలో ముంపు ప్రాంతాలను స్వయంగా సందర్శించి ప్రజలకు సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, సహాయ కార్యదర్శి రమణ, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్,నాయకులు చిత్రచేడు రామాంజనేయులు, మునాఫ్, ప్రభాకర్, రమేష్, మాధవ తదితరులు పాల్గొన్నారు.

వికేంద్రీకరణపై వేడెక్కిన విశాఖ

- ఓ పక్క వైసీపీ జేఏసీ పేరుతో మహాగర్జన
- మరోపక్క జనసేన జనవాణి పేరుతో పవన్ కల్యాణ్ రాక
- విశాఖలో భూ కబ్జాలపై విపక్షాల ఆందోళనలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రశాంత విశాఖ నగరం ఇప్పుడు వికేంద్రీకరణ, భూకబ్జాల ఉద్యమాలతో వేడెక్కింది... గత కొన్ని రోజులుగా రాజకీయ పక్షాలు సమావేశాలతో నగరం హోరెత్తుతుంది. ఈనెల 15న విశాఖ మహా నగరంలో గర్జన పేరిట జేఏసీ అధ్వర్యంలో వైసీపీ ప్రతిష్ఠాకంగా విశాఖ రాజధాని కావాలంటూ వికేంద్రీకరణ ఉద్యమాన్ని ఉప్పెనలా నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తుంది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి లక్షలాది మందిని ఈ మహాగర్జనలో పాల్గొనేలా మంత్రులు, ఎమ్మెల్యేలు, వైసీపీ నేతలు వ్యూహరచనలు చేస్తున్నారు. వలంటీర్ల ద్వారా డ్వాక్రా మహిళలను అధిక సంఖ్యలో సమీకరించినందుకు వ్యూహాలు సిద్ధం చేసినట్లు సమాచారం. వార్డు కార్పొరేటర్లకు, నాయకులకు ఇప్పటికే జన సమీకరణ లక్ష్యాలు అధినాయకత్వం ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే విశాఖలో స్వచ్ఛందంగా మూడు రాజధానులు కావాలంటూ ఉద్యమాలు జరగడం లేదు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, రైల్వే జోన్ సాధన కోసం, ప్రత్యేక హెూదా కోసం గర్జనలు, ఉద్యమాలు చేయని వైకాపా మూడు రాజధానిలే ముద్దు అంటూ అమరావతి రైతుల పాదయాత్రను అడ్డుకునే కుట్రలో భాగంగానే చేస్తుందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

మరోపక్క అదే రోజు శనివారం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జనవాణి కార్యక్రమానికి విశాఖ రానున్న నేపథ్యంలో రాజకీయం మరింత వేడెక్కింది. పవన్ కళ్యాణ్‌కు ఎయిర్ పోర్టు వద్ద భారీ స్వాగతం పలికేందుకు జనసైనికులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంకోపక్క టీడీపీ, వామపక్షాలు, బీజేపీ విశాఖలో ఎంపీ విజయ సాయిరెడ్డి ముఠా దసపల్లా భూములు కాజేయడంపై, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ నిర్మిస్తున్న కూర్మన్నపాలెం భారీ అపార్ట్‌మెంట్ నిర్మాణాలపై, హైగ్రీవా నిర్మాణాలపై విపక్షాలు భగ్గుమంటున్నాయి. ఒకప్పుడు విశాఖ ప్రశాంతతకు మారుపేరుగా ఉండేది. గత కొద్ది నెలలుగా విశాఖలో అశాంతి నెలకొంది. నిత్యం నగరంలో ఏదో ఒకచోట హత్యలు జరుగుతూనే ఉన్నాయి. మరోపక్క నగరంలో పోలీసులకు శాంతి భద్రతల నిర్వహణ పెను సవాల్ గా మారాయి. అక్టోబర్ 15నే విశాఖలో ఇన్ని కార్యక్రమాలు ఉండడం పై పోలీసులు బందోబస్తు నిర్వహించడం పై తలలు పట్టుకుంటున్నారు. మరోపక్క అమరావతి రైతులు పాదయాత్ర మరికొన్ని రోజుల్లో విశాఖ జిల్లాలోకి ప్రవేశించనుంది. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్తరాంధ్రలో రైతుల పాదయాత్ర ఎలా నిర్వహిస్తారని పోలీసులు మల్ల గుల్లాలు పడుతున్నారు. 15 తేదీన టీడీపీ మూడు రాజధానులు వద్దు... అమరావతి రాజధాని ముద్దు అంటూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తోంది. జనసేన జనవాణి పేరిట అదే రోజు కార్యక్రమం నిర్వహించడంతో పోలీసులకు శాంతి భద్రతల సమస్య సవాల్‌గా మారింది. దీంతో రాజకీయ వేడి విశాఖలో అలజడిగా మొదలైంది.

'విశాఖ గర్జన' విజయవంతం చేయండి

వైసీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: పాలనా రాజధానిగా విశాఖను సీఎం జగన్ నిర్ణయించారని, దాన్ని కార్యరూపంలోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉమ్మడి విశాఖ జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. ఈనెల 15న నిర్వహించనున్న 'విశాఖ గర్జన' సన్నాహక సమావేశం మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అధికార వికేంద్రీకరణకు శ్రీకారం చుట్టారని, దీనికి ప్రతిపక్షపార్టీ అడుగడుగునా అడ్డు పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలన్న సంకల్పంతోనే వికేంద్రీకరణ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. అమరావతిని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకునేందుకు అనువుగా మార్చుకున్నారని ఆరోపించారు. ప్రతి పౌరుడూ విశాఖ గర్జనను విజయవంతం చేయాలని కోరారు. మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ, పాదయాత్రగా వస్తున్న అమరావతి వాసులు ఉత్తరాంధ్ర ప్రజలను రెచ్చగొడుతున్నారని అన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి



గుడివాడ అమర్నాథ్, అనకాపల్లి ఎంపీ సత్యవతమ్మ, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, కన్నబాబురాజు, అదీప్ రాజ్, మేయర్ హరి వెంకట కుమారి, మాజీ మంత్రి బాలరాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ బాబు, తిప్పల గురుమూర్తి రెడ్డి, ఎస్ఏ రెహమాన్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆదారి ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతుగా బైక్ ర్యాలీ

మానవహారంలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర-చోడవరం(అనకాపల్లి జిల్లా): రాష్ట్ర వికేంద్రీకరణకు మద్దతుగా విశాఖలో పరిపాలనా రాజధాని కోరుతూ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు చోడవరం మండలంలో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, గంధవరం గ్రామంలో బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మశ్రీ మాట్లాడుతూ... వెనుకబడ్డ ఉత్తరాంధ్రలో ముఖ్యంగా విశాఖ జిల్లా అభివృద్ధికి పరిపాలనా రాజధాని ఎంతో అవసరమన్నారు. గంధవరం నుండి ముద్దుర్తి జంక్షన్ మీదుగా వెంకన్నపాలెం, గోవాడ అంభేరుపురం మీదుగా చోడవరం డిగ్రీ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. కొత్తూరు జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి వికేంద్రీకరణకు మద్దతుగా నినాదాలు చేశారు.

ఇదిలా వుండగా మానవహారంలో ఓ వ్యక్తి వికేంద్రీకరణకు మద్దతుగా నినాదాలు చేస్తూనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం... బైక్‌కు నిప్పు అంటుకోవడంతో కొంత సేపు గందరగోళం నెలకొంది. చివరకు ఎమ్మెల్యే, పోలీసులు అందరూ అడ్డుకుని నచ్చజెప్పడంతో సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యేడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసులమ్మ, జెడ్పీటీసీ మారిశెట్టి విజయ శ్రీకాంత్, పల్లా నరసింగరావు, మూడెడ్ల శంకర్రావు, ఓరుగంటి నెహ్రూ, సూరిశెట్టి నాగ దుర్గా గోవింద తదితరులు పాల్గొన్నారు.

పవన్, రాహుల్‌ను కలుస్తాం...

ఉక్కు పరిరక్షణ కమిటీ : 609వ రోజుకు దీక్షలు

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చీ వద్ద నిర్వహిస్తున్న దీక్షలు గురువారానికి 609వ రోజుకు చేరుకున్నాయి. ఎస్ఎంఎస్- 2, విభాగం కార్మికులు పాల్గొన్నారు. పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, సభ్యులు వరసాల శ్రీనివాసరావు, గుమ్మిడి నరేంద్ర మాట్లాడారు. ఈనెల 16న జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను, 19వ తేదీ మధ్యాహ్నం కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీని కలవాలని కమిటీ నిర్ణయించిందని తెలిపారు. భారత్ జోడో యాత్ర ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం జిల్లాలో జరగనున్న క్రమంలో రాహుల్‌ని కలవాలని వారు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎమ్ఎస్-2, మరిడయ్య, జగదీష్, వరప్రసాద్ సాయి తదితరులు పాల్గొన్నారు.

జగన్... నోరుమెదపరేం: బండారు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: సొంత పార్టీ వాళ్ల కోట్ల రూపాయలు దోచుకున్నా జగన్ పట్టించుకోవడంలేదని, విశాఖలో వైసీపీ భూ దోపిడీకి అడ్డుకట్ట వేయాలని, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కూర్మన్నపాలెంలో విశాఖ ఎంపీ ఎంవీవీ వెంచర్‌లో 99:1 శాతం వాటా అంశాన్ని 2021 జులైలోనే జీవీఎంసీ కౌన్సిల్‌లో తమ సభ్యుడు లేవనెత్తారని, విజయ సాయిరెడ్డి ఆ రోజు ఎందుకు ఆరా తీయలేదని ప్రశ్నించారు. తెలిసీ కూడా సమాచారాన్ని ప్రభుత్వానికి చెప్పకపోవడం విజయ సాయిరెడ్డి నేరమని, ఇప్పుడు ఇద్దరు ఎంపీల మధ్య విభేదాలు మొదలయ్యాయన్నారు. కూర్మన్నపాలెం నుంచి ఫకీర్ తకియాకు వెళ్లే 30 అడుగుల రోడ్డును వంద అడుగుల రోడ్డు అని తప్పుగా చూపిస్తారా అని ప్రశ్నించారు. 15 లక్షల ఎస్ఎఫ్‌టీలో నిర్మాణ అనుమతుల కోసం అడ్డగోలుగా వ్యవహరిస్తారా అని ప్రశ్నించారు.

సంపాదకీయం

దేశ రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలంగా తయారైన కీలక దశలో భారత కమ్యూనిస్టు పార్టీ 24వ జాతీయ మహాసభలు విజయవాడలో శుక్రవారం నుంచి మంగళవారం దాకా అయిదు రోజుల పాటు జరుగుతున్నాయి. 2018లో కేరళలోని కొల్లాంలో జరిగిన 23వ మహాసభల నుంచి చూస్తే దేశ రాజకీయాలు పెనం మీంచి పొయ్యిలోపడ్డట్టు అత్యంత మితవాద దిశగా సాగుతున్నాయి. ఈ దశలో 24వ మహాసభల్లో తాజా రాజకీయ, ఆర్థిక పరిస్థితులను క్షుణ్ణంగాచర్చించి బీజేపీ పురోగమనాన్ని అడ్డుకోవడానికి అత్యవసరమైన, నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికను నిర్దేశించవలసిన ఆవశ్యకత ఉంది. అంటే విశాల ప్రాతిపదికన ప్రజాస్వామ్య, సెక్యులర్ శక్తులను పటిష్ఠంచేసి, ఐక్యం చేసి పోరాట పథాన్ని రూపొందించుకోవడానికి ఈ మహాసభలో సముచిత నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుంది. 2019లో మోదీ నాయకత్వంలోని బీజేపీ రెండవ సారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సమాజాన్ని మతాల వారీగా చీల్చడానికి, ముస్లింలను జనజీవన స్రవంతి నుంచి దూరం చేయడానికి ప్రయత్నపూర్వకంగా ముస్లింల మీద ద్వేషాన్ని పెంచి పోషించడానికి భారీ ఎత్తున కుటిల పన్నాగాలు పన్నడంలో హిందుత్వ శక్తులు నిమగ్నమై ఉన్నాయి. ఈ క్రమంలో సకల రాజ్యాంగ వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేస్తున్నారు. 2024 ఏప్రిల్/మే నెలల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో అధికారం నిలబెట్టుకోవడానికి బీజేపీ అన్ని రకాలుగా వనరులు సమీకరించుకుంటోంది. ఆ ఎన్నికలలో కూడా మోదీ మూడో సారి అధికారంలోకి వస్తే సంఘ్ పరివార్ కచ్చితంగా 2025 నాటికి ఈ దేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చడానికి సమాయత్తమవుతుంది. 2025 నాటికి ఆర్.ఎస్.ఎస్. అవతరించి వందేళ్లు అవుతుంది. బీజేపీ వ్యతిరేక శక్తులనూ, భావ సారూప్యతగల రాజకీయ పార్టీలను ఐక్యం చేసి ప్రజా ప్రయోజనాలను కాపాడవలసిన బాధ్యత తమ మీద ఉందని సీపీఐ గ్రహించింది. ఈ లక్ష్య సాధన విస్తృత ప్రాతిపదికన ఎజెండా రూపొందించడం వల్లే సాధించగలమన్న స్పష్టమైన అవగాహన సీపీఐకి ఉంది. అందుకే 24వ మహాసభలో ఆమోదించే రాజకీయ తీర్మానంలో ఈ విషయాలన్నీ విపులంగానే ప్రస్తావించారు. ఇది సాధ్యం కావాలంటే మూడు కర్తవ్యాలు నిర్వర్తించవలసి ఉందని సీపీఐ గుర్తించింది. అందులో మొదటిది సీపీఐని బలోపేతం చేయడం. రెండవది వామపక్ష శక్తులను సంఘటితం చేయడం. మూడవది బీజేపీ నాయకత్వంలోని సంఘ్ పరివార్ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ప్రగతిశీల, సెక్యులర్ శక్తులను ఐక్యం చేయడానికి తీవ్రంగా కృషి చేయడం. ఈ లక్ష్యాలు నెరవేరడానికి మౌలికమైన ప్రాతిపదిక బీజేపీ-ఆర్.ఎస్.ఎస్. ను వ్యతిరేకించే రాజకీయ శక్తులను, పార్టీలను సమీకృతం చేయవలసిందే. ఈ విస్తృత సంఘటన ఏర్పాడాలంటే కాంగ్రెస్ తో సహా, తృణమూల్ కాంగ్రెస్, రాష్ట్రీయ జనతా దళ్, డి.ఎం.కె., నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీల మధ్య మరింత పటిష్ఠమైన అవగాహన కుదరాల్సి ఉంటుంది. అప్పుడే బలమైన ప్రతిపక్షం ప్రజలకు ప్రత్యామ్నాయంగా నిలబడగలుగుతుంది. ప్రజలు ఎదురు చూస్తున్నది ఈ ప్రత్యామ్నాయం కోసమే. వచ్చే లోకసభ ఎన్నికలలో బీజేపీని గద్దె దించడానికి కాంగ్రెస్ ఈ వేదికలో క్రియాశీల పాత్ర పోషించేట్టు ఉండాలి. 2019 ఎన్నికలు జరగడానికి ముందూ మోదీ సర్కారు మీద అపారమైన వ్యతిరేకత ఉండేది. కానీ ప్రతిపక్షాలు ఒక్క తాటి మీదకు రాకపోవడంతో

ఆశాదీపం

బీజేపీ విజయావకాశాలు పెరిగాయి. అందుకే బీజేపీ 2014 కన్నా మరిన్ని ఎక్కువ సీట్లు సంపాదించగలిగింది. ఈ దృష్టితో చూస్తే 2024 ఎన్నికలు బీజేపీ వ్యతిరేక, సెక్యులర్ శక్తులు కలిసి ఉమ్మడి లక్ష్యసాధనా మార్గాన్ని అనుసరించవలసిందే. ఇది జీవన్మరణ పోరాటం లాంటిది. లేకపోతే బీజేపీ మరో సారి అజేయంగా నిలుస్తుంది. అందుకే బీజేపీ వ్యతిరేక కూటమి అత్యంత శక్తిమంతంగా పని చేయవలసి ఉంటుంది. ప్రతిపక్షాలు వేసే ప్రతి అడుగూ ఆచి తూచి వేయాల్సిందే.

విశాలమైనరీతిలో బీజేపీ వ్యతిరేక శక్తులను కూడగట్టడంలో రాష్ట్రాలలో సమస్యలు ఉండక తప్పదు. చాలా రాష్ట్రాలలో బీజేపీ వ్యతిరేక పార్టీలు అధికారంలో ఉన్నాయి. కానీ రాష్ట్రస్థాయికి వచ్చే సరికి బీజేపీని వ్యతిరేకించే పార్టీలలోనే అంతర్విరోధాలు ఉన్నాయి. అందుకే దేశమంతటా ఒకే రకమైన ఎన్నికల ఎత్తుగడలు అనుసరించడం సాధ్యంకాదన్న నికరమైన అవగాహనా సీపీఐకి ఉంది. అయితే ఉమ్మడి లక్ష్య సాధనకు రాష్ట్రాలలో కనిపించే వైరుధ్యాలు ఆటంకం కాకూడదని సీపీఐ భావిస్తుంది. కేంద్రంలో బీజేపీని గద్దె దించడమే పరమావధి అన్న అవగాహన బలంగా ఉంటే రాష్ట్రాలలో విభేదాలను అధిగమించడం అసాధ్యమైతే కాదు. రాష్ట్రాల దగ్గరకొచ్చే సరికి బీజేపీని వ్యతిరేకించే పక్షాలలో కూడా అనేక అంశాల విషయంలో భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు. అందువల్ల ప్రతిపక్షాలు ఎక్కడికక్కడ అంతిమ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఐక్యంగా మెలగడం సాధ్యమే. వామపక్ష ప్రజాతంత్ర శక్తులను ఐక్యం చేయాలన్న పట్టుదలతో సీపీఐ దశాబ్దాలుగా కృషి చేస్తూనే ఉంది. ఈ కాంక్ష నెరవేరాలంటే ముందు సీపీఐ మరింత బలోపేతం కావడం అనివార్యం. ముందు వామపక్ష శక్తుల మధ్య ఐక్యత సాధిస్తే మిగతా ప్రతిపక్షాలను కూడా ఒకే వేదిక మీదకు, అవి కచ్చితమైన దిశా నిర్దేశంతో పని చేసేట్టు చూడడం సులువు అవుతుంది. చట్ట సభల్లో ఈ మధ్య వామపక్షాల ప్రాతినిధ్యం తగ్గింది. ఇది వామపక్ష ప్రభావం తగ్గిందనడానికి సూచిక కాదు. చట్టసభల్లో ప్రాతినిధ్యం పెంచుకోవడానికి ప్రయత్నించేక్రమంలో అనువుగానిచోట పోటీచేయకుండా విజయావకాశాలు ఉన్న ప్రాంతాల్లోనే దృష్టి సారించాలని సీపీఐ సముచిత సంకల్పంతో ఉంది. చట్టసభల్లో ప్రాతినిధ్యంతో సంబంధం లేకుండానే కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బిహార్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, పంజాబ్, ఉత్తర ప్రదేశ్ లో కమ్యూనిస్టు పార్టీ అస్తిత్వం మాయమై పోలేదు. ఒకప్పుడు బిహార్ సీపీఐకి బలమైన కేంద్రం. బిహార్ మహాగట్బంధన్ ప్రభుత్వంతోసీపీఐకి సాన్నిహిత్యంఉంది కనక ఆ అవకాశాన్ని వినియోగించుకుంటే మునుపటి ప్రాభవం పునరుద్ధరించడం సాధ్యం అవుతుంది. ఎన్నికల ఫలితాలు మెరుగుపడాలంటే క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలను మరింత శక్తిమంతంగా ప్రస్తావించి ఉద్యమాలు నిర్మించవలసిన అగత్యం ఉందన్న అవగాహన సీపీఐకి ఉంది. ప్రజలతో నిత్య సంబంధాలు ఇందుకు కీలకం. వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత అవసరం గురించి ఎప్పటి నుంచో సీపీఐకి సమగ్రమైన అవగాహన ఉంది. ఈ విషయంలో సీపీఐ దీక్షాబద్ధంగానే వ్యవహరిస్తోంది. సీపీఐతోపాటు వామపక్షాలు బలం పుంజుకోవడం ప్రస్తుత తక్షణావసరం. వామ పక్షాలు బలోపేతం కావాలన్నది నిజానికి ప్రజల ఆకాంక్ష. వామపక్షాలు బలంగా ఉన్నప్పుడే విచ్ఛిన్నకర, మతతత్వ శక్తులను నిలవరించడం సాధ్యం అని ప్రజలు ఎప్పుడో గ్రహించారు. వామపక్షాలు కుంగిపోవడంవల్ల తమకే నష్టమని సవ్యంగా ఆలోచించే వారందరూ భావిస్తున్నారు. వారిలో ఉన్న ఈ ఆశాదీపాన్ని మరింత జ్వాజ్జ్వల్యమానం చేయడానికి 24వ మహాసభ దిటవైన నిర్ణయాలు తీసుకోవడానికి ఉపకరించాలి.

ప్రజాస్వామ్యంలో మతం

రా బావ ఏంటి ఈరోజు ఆలస్యం అయింది. కారణం ఏంటి. ఏంలేదు బావ యింటి దగ్గర మీ చెల్లి పూజ మొదలుపెట్టి మీరు పూజ చేయకపోయినా అయ్యేవరకు వెళ్లటానికి వీల్లేదంది. మనకు నమ్మకాలు లేకపోయినా మన కోసం ప్రాణం యిచ్చే మనిషిని బాధపెట్టలేం కదా. అది నిజమే బావ. ఈ పూజలు, వ్రతాలు హిందువులకే గాని క్రిస్టియన్లు, ముస్లింలు వారిని ఇలా చేయరు. వారి మతాన్ని బట్టి వారు నమ్మిన దేవుళ్లను వారు కొలుస్తారు. అదిసరే బావ ఈ మతాలు, కులాలు అవసరమంటావ బావ. నిజమే బావ అసలు ప్రజలు తమ జీవనయానం సాగించడానికి ఏ మతము అవసరం లేదు బావ. పైగా ఈ మతాల వల్ల ప్రజల మధ్య వైరుధ్యాలు చివరకు మత యుద్ధాలు జరగవచ్చు. అందుకే మతం మత్తుమందు లాంటిదన్నాడు మార్క్స్ మహాశయుడు. అసలు మానవుడు మానవత్వమే తన మతంగా భావిస్తే సమాజంలో ఈ మతాల గొడవలు ఉండవు బావ.

నిజమే బావ మొన్న నా ఫోనులో సోషల్ మీడియాలో వింటే ఒకతను సినీ హీరో కమలహాసన్‌ను చోళరాజులు హిందువులు కాదన్నందుకు తీవ్రంగా విమర్శిస్తున్నాడు బావ. చోళరాజులు కంబోడియా ఇండోనేషియా లాంటి అనేక దేశాలు పాలించారని భారతదేశంలో అనేక హిందూ దేవాలయాలను నిర్మించారని, చోళులు హిందువులే అని ఆయన వాదన. కాని ఆయన చెప్పినట్లు యితర దేశాల్లో హిందూ దేవాలయాలు నిర్మించ లేదు. దాన్ని బట్టి ఆయా దేశాల ప్రజల మనోగతం కనుగుణంగా

పాలించారని అర్థం అవుతుంది గద బావ. నిజమే బావ అయినా ఆ చోళరాజులు ఏ మతస్థులో యిపుడు అవసరమా బావ. అనవసరంగా ప్రజల్లో మత చిచ్చు రగిలించడం తప్ప. నిజమే బావ శాస్త్రం మతంలోని మంచి ఒప్పుకున్నా మతం మాత్రం అనాది నుండి నేటి వరకు శాస్త్రం మీద ప్రత్యక్షంగాను, పరోక్షంగాను దండయాత్ర చేస్తూనే ఉంది బావ. వీలైన చోట శాస్త్రాన్ని వీలుగాని చోట శాస్త్రజ్ఞాన చరిత్రను వక్రీకరించి ప్రచారం చేస్తూనే ఉంది బావ. అవును బావ చివరకు ప్రజా కవి వేమన రాయనివి వేమన రాసినట్లుగా అచ్చు వేసి మార్కెట్లో పెట్టి ప్రజల్ని పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు బావ. చివరకు మతం సైన్సుకు వ్యతిరేకం అన్నా ఒప్పుకోని వారే ఎక్కువ. అంతగా మనిషి మస్తిష్కంలో మతం పాతుకు పోయింది బావ. అవును బావ సెక్యులర్ దేశంలో రాజ్యాంగ ప్రతినిధులు అన్ని మతాలను సమాన దృష్టితో చూడాలేగాని, అన్ని మతాలను ప్రోత్సహించమని కాదు బావ. మరైతే మంత్రులు శాసనసభ్యులు అన్ని మతాల దేవుళ్లను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ సొమ్ముతో దేవాలయాలు నిర్మించడం తప్పుగద బావ. మనం సెక్యులర్ రాజ్యాంగానికి బద్దులమై ఉండాల్సిందె. అన్ని మతస్థులను యిబ్బంది పెట్టకుండ సమదృష్టితో చూడాలె తప్ప ప్రజలందరి సొమ్ముతో ఒక మతానికి సంబంధించిన ఆలయాలను నిర్మించడం తప్పే బావ.

బావ అసలు మనిషి దేముడు ఎవరు ఎవరికి కారణం అని ఆలోచించినపుడు మనిషికి బుద్ధి తెలిసిన తరువాతనే దేవాలయాలు వెలిశాయనేది నిర్వివాదాంశం. అటువంటపుడు మనిషి భయంతో ఒక దేవుణ్ణి సృష్టించుకొని ఆలయం ఏర్పాటు చేసుకుని తన భయాన్ని పోగొట్టుకోవడానికి పూజలు చేశాడనేది కూడా అందురు ఒప్పుకొనే విషయమే కద బావ. నిజమే బావ అలాంటపుడు మనిషి సృష్టించుకున్న దేవుడు ఆ మనిషి వ్యక్తిగత ఆస్తే తప్ప దాన్ని సమాజపరం చేయకూడదు కద బావ. అది నిజమే బావ మతంతోను, రాజకీయంతోను సంబంధం లేకుండా మనిషి మనుగడ సాగించడం కష్టంగా మారింది. ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఆ రెంటి ప్రభావం సగటు మనిషిపై పడుతుంది. తప్పించుకోలేని పరిస్థితి నేడు నెలకొంది. మతంపై నమ్మకం వ్యక్తిగతం కావాలి. కాని నేటి పాలకులు వాటిని మనిషిపై బలవంతంగా రుద్దుతున్నారు బావ.

నిజమే బావ దేశానికి ప్రథమ పౌరుడైన రాష్ట్రపతి నుండి సామాన్య రాజకీయ నాయకుడు నెలకొకసారి తిరుపతి వెళ్లి దర్శనం చేసుకుంటే సగటు మనిసిపై ఆ ప్రభావం పడి అప్పు చేసి తిరుపతి వెళ్లి వచ్చి చేసిన అప్పు తీర్చలేక సతమతమవుతున్నాడు. ఇది పరోక్షంగా రాజకీయాలపై ప్రభావం పడుతోంది. నిజమే బావ ఆధ్యాత్మిక చింతన ఏకైక మార్గమని ఊదరగొడుతూ లెక్కకు మించిన దొంగ స్వాములు పెరుగుతున్నారు. వారి మాయలో పడి ధన, మాన, ప్రాణాలు అమాయకులు పోగొట్టుకుంటుంటే అటువంటి స్వాముల దర్శనానికి పాలకులు అర్రులు చాస్తుంటే, అమాయకులు బలి కావడంలో ఆశ్చర్యమేముంది బావ. నిజమే బావ సమాజంలో ప్రతి మనిషికి ఒక నమ్మకముంటుంది. ఆ నమ్మకంతోనే ముందుకు సాగుతాడు. అయితే ఆ నమ్మకం మూఢ నమ్మకం కాకూడదు. ప్రతి విషయాన్ని శాస్త్రీయమా, అశాస్త్రీయమా అని ఆలోచించి నమ్మాలి. నిజమే బావ. కాని ప్రస్తుతం ఎక్కువ శాతం ప్రజలు మూఢ నమ్మకాల్లో మునిగి తేలుతున్నారు. అందుకు పరోక్షంగా పాలకులే కారణం బావ.అందుకు ఉదాహరణ గత పుష్కరాలే కారణం బావ. స్వాములంతా లౌకిక రాజ్యాన్ని కూలదోసి, మతాల సాలెగూడులో చిక్కుకునేలా ప్రజల్ని తయారు చేస్తున్నారు బావ. నిజమే బావ మనది మతాతీతమైన రాజ్యాంగం కాని ప్రధాని మోదీ మాత్రం కాశీని ఆధ్యాత్మిక రాజధాని చేస్తానని గంగానదిని ప్రక్షాళన చేస్తానంటున్నాడు. బిజెపి మత పిచ్చి ప్రజల్లో వ్యాప్తం చేసే పనిలో నిమగ్నమయింది బావ. అది ప్రజాస్వామ్యానికి విఘాతమే.

వ్యాస రచయిత సెల్ 98855 69394

దేశాలు కార్పొరేట్ల వశం

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

కార్పొరేట్ అధికారం ప్రజాస్వామ్యాన్ని ఎలా ధ్వంసం చేయగలదో 1976 ఆంగ్ల చిత్రం 'నెట్వర్క్'లో నెడ్ బీటీఏకపాత్రాభినయంలోచిత్రించారు. 46 ఏళ్ల నాటి భయం నేడు స్థిరపడింది. బహుళ జాతి సంస్థలు స్వతంత్ర సార్వభౌమ దేశాల విధులను ఆక్రమించాయి. సామ్రాజ్యవాద అమెరికా విశ్వాన్ని శాసిస్తోందనుకుంటాం. కానీ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పట్టని అమానవీయ సంస్థలు యూనియన్ కార్బైడ్, ఐబిఎం, ఐటిటి, ఎటిటి, డుపాంట్, డౌ, ఎక్సాన్ ప్రపంచాన్ని ఏలుతున్నాయి. వీటి వాణిజ్య నిబంధనలు విశ్వగమనాన్ని, పాలనాపద్ధతులను, సమాజ స్థితిగతులను నిర్ధారిస్తున్నాయి. పాలకులు కార్పొరేట్ల వశమై కార్పొరేట్ దేశాలు ఏర్పడ్డాయి.

ప్రపంచ సామాజిక మాధ్యమ దిగ్గజం అమెరికన్ సంస్థ ఫేస్‌బుక్ 2019 జూన్‌లో సొంత కరెన్సీ 'లిబ్రి'ను ప్రకటించింది. జూన్ 2020 కు డిజిటల్ వాణిజ్య ద్రవ్యంగా లిబ్రి రూపురేఖలు, విధివిధానాలు నిర్ణయిస్తానంది. లిబ్రి డీమ్‌గా మారింది. వెంటనే ఇంగ్లండ్ బ్యాంక్ పూర్వ గవర్నర్ మార్క్ కార్నీ ప్రపంచ వస్తు సముదాయ ఆధారంగా కొత్త డిజిటల్ కరెన్సీని ప్రతిపాదించారు. ప్రాచీన రోమ్‌లో లిబ్రి బరువు కొలమానం. బూడిదరంగు తోడేలు రూపంలో న్యాయ సత్య దేవత. ఆర్థికరంగం బయట కోటీశ్వరుల సృష్టి ప్రపంచ డిజిటల్ వాణిజ్య లక్షణం. శరీరశ్రమ, క్రియాశీల మేధోశక్తి, వస్తూత్పత్తి, సేవల కల్పన లేకుండా చట్టావ్యాపార, లాటరీ పద్ధతుల్లో డబ్బు పోగేసుకోటంలో ఈ వాణిజ్యం స్థిరపడింది. 260 కోట్ల ఫేస్‌బుక్ వినియోగదారులు లిబ్రితో వస్తువులు, సేవలు పొందవచ్చు. పెట్టుబడిదారీ విధానాలు సామాన్యుల జీవితాలను కాలరాసి బహుళజాతి సంస్థల, సంపన్న వర్గాల ప్రయోజనాలను కాపాడుతున్నాయి. ఈ నేపథ్యంలో లిబ్రి ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రపంచీకరణ సరళీకృత విధానాలు ఆర్థిక విశృంఖలతకు, సమస్యల పునరావృతానికి కారణం. కఠిన పొదుపు పద్ధతులు ప్రజలపై రుద్దారు. అభివృద్ధి చెందుతున్న దేశాలపై ఆర్థిక వాణిజ్య ఆంక్షలు విధించారు. బడుగుల జీవనోపాధులు దెబ్బతిన్నాయి. పేదదేశాలు ఇబ్బంది పడ్డాయి. "ఆర్థిక లావాదేవీల డిజిటల్ కరెన్సీ సార్వభౌమ కరెన్సీ స్థానాన్ని భర్తీ చేయలేదు. దురుపయోగాలకు, ఆర్థిక ఉగ్రవాదానికి దారితీస్తుంది. సార్వభౌమత్వం రాజ్యం దగ్గర ఉండాలి. ప్రైవేట్ల ప్రయోజనాలు కాపాడే బహుళజాతి సంస్థలకు బదిలీ కారాదు." ఫ్రాన్స్ ఆర్థిక మంత్రి బ్రునో లీ మైర్ స్పందన. ఫేస్బుక్ ప్రకటించిన రహస్య ద్రవ్యం అపాయకర ఆర్థిక పరిణామాలకు సంకేతం. ప్రభుత్వ కరెన్సీ ముద్రణ, పంపకం సార్వభౌమత్వ హక్కు లక్షణాలు. కార్పొరేట్ సంస్థలు ఈ అధికారాన్నీ లాక్కుంటున్నాయి. ప్రకృతి వనరుల, ఉత్పత్తి, సంపదల పంపకంలో ప్రభుత్వ విధానాలు ప్రధాన పాత్ర

డిజిటల్ కరెన్సీ

ఆరు ఖండాలను ఆక్రమించిన కార్పొరేట్ సంస్థలు

పోషించాలి. ప్రజా సాధికారితను నిర్ధారించాలి. పాలక విధానాలు ప్రజానుకూలం కావు. సంపన్నుల, కార్పొరేట్ల ప్రయోజనకరాలు. పాలక పక్షాల జుట్టు కార్పొరేట్ల చేతుల్లో ఉంది. లిబ్రి చెల్లింపుల విధానమేనని, స్వతంత్ర కరెన్సీ కాదని, అధికార కరెన్సీకి లోబడి ఉంటుందని ఫేస్బుక్ ప్రభుత్వానికి హామీ ఇచ్చింది. కానీ 2019 జులై 16 న పార్లమెంటులో కొత్త కరెన్సీని ఎలా క్రమబద్ధీకరిస్తారన్న ప్రశ్నకు ఫేస్బుక్ కార్యనిర్వహణాధికారి డేవిడ్ మార్కస్ జవాబు చెప్పలేదు.

ప్రజా సేవల వినియోగదార్ల పేర్లు, పాస్‌వర్డ్స్, అధికార గుర్తింపు, ఆర్థిక, ఆరోగ్య, లింగ, బయోమెట్రిక్, కుల, మత, తెగల వివరాలు, లైంగిక జీవిత విన్యాసాలు, మత నమ్మకాలు, రాజకీయ అనుబంధాలు కీలక వ్యక్తిగత సమాచారంలో సేకరించి పొందుపరుస్తారని మన శ్రీకృష్ణ కమిటీ తెలిపింది. ఈ సమాచారం కార్పొరేట్లు సేకరించాయి. ప్రజల జుట్టు పట్టుకున్నాయి. జాతి బాధ్యత, జవాబుదారీతనంలేని చట్టాల నిర్ణయాధికారం, ఆర్థిక విధానాలు వాటి సొంతమే. బలహీన ప్రభుత్వాలను బెదిరించి వాటి ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక విధానాల్లో దూరాయి. రాజ భవంతులు నిర్మించుకున్నాయి. మౌలిక, సేవా సౌకర్యాలు, గృహ సముదాయాలతో చిన్న స్వతంత్ర దేశాలుగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ప్రజల నివాస వసతి హక్కును పట్టించుకోదు. దీన్ని అవకాశంగా తీసుకున్న కార్పొరేట్ సంస్థలు పట్టణ ప్రణాళికల్లో తలదూర్చాయి. కోట్ల దాలర్ల గృహ సముదాయాలు నిర్మించాయి. వీటిల్లో నివసించే "తమ" ప్రజలతో పోరాటాలు చేయించి ప్రభుత్వ విధానాలను అనుకూలంగా మార్చుకున్నాయి. ఈ పద్ధతుల్లో ఉబర్ తన వ్యాపారాల్లో ప్రభుత్వ క్రమబద్ధీకరణ లేకుండా చేసింది. ఎయిర్ బి.ఎన్.బి.తన వాణిజ్య వ్యవహారాల్లో ప్రభుత్వ ఆర్థిక పరిశీలన తొలగించుకుంది. కార్పొరేట్లు పెద్ద మొత్తంలో వాణిజ్య పన్నులు రద్దు చేయించుకున్నాయి. 2018 లో అమెజాన్ 11.2 బిలియన్ డాలర్ల (రూ92,960కోట్ల) లాభాలపై పన్ను చెల్లించలేదు. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని కార్పొరేట్ సంస్థలు దురుపయోగపరిచిన విధానాన్ని కేంబ్రిడ్జ్ అనలిటిక కుంభకోణం బయటపెట్టింది. కార్పొరేట్లు ఈ సమాచారనిధిని వాణిజ్య ప్రకటనలకు, ప్రజాభిప్రాయ వక్రీకరణక, ప్రజాసమ్మతి నిర్మాణానికి, రాజకీయ ఉద్దేశాల మార్పునకు, తమ జాతీయత గుర్తింపునకు వాడుకుంటున్నాయి. ప్రత్యేక రాజ్యలక్షణాల గొప్పలతో 'కార్పొరేట్ దేశాలు'స్థాపించుకున్నాయి. రాజ్య కార్యాచరణల్లో చొరబడ్డాయి. సంప్రదాయ సార్వభౌమ లక్షణాలను హరిస్తున్నాయి. రాజ్యాలు పరిపాలన ప్రాసంగికతను కోల్పోతున్నాయి. బలహీన ప్రభుత్వాలు పాలనా విధాన విఫలతను కప్పి పుచ్చుకోటానికి దేశభక్తి ముసుగులో జాతివాద, జాత్యహంకార చర్యలకు పాల్పడుతున్నాయి. పాలనా పటుత్వం, నియంత్రణను నటిస్తున్నాయి. రాజ్యాంగ వ్యతిరేక చర్యలతో ప్రజాస్వామ్యాన్ని,రాజ్యాంగాన్నిఅపహాస్యం చేస్తున్నాయి.

అమెరికా తమ దేశ బహుళజాతిసంస్థల లాభాలు పెంచటానికి ప్రపంచ దేశాల్లో వాటి ఉత్పత్తుల, సేవల పన్నులు తక్కువ చేసే చర్యలు తీసుకుంటుంది. ఆమోదించని దేశాలపై ఆంక్షలు విధిస్తుంది. అమెరికా సంస్థలు గూగుల్, అమెజాన్, ఫేస్‌బుక్, యాపిల్, ఎయిర్ బి.ఎన్.బి. ఉబర్, ఫ్రాన్స్ లాంటి దేశాల్లో తమ వ్యాపారలావాదేవీలపై అతి తక్కువ పన్నులు చెల్లిస్తాయి. పన్నుల ఎగవేతకు ఐరోపాలోని అనుకూల దేశాల్లో వ్యాపారకేంద్రాలు స్థాపించుకుంటాయి. ఐరోపా దేశాల్లో అమెరికా సంస్థల వ్యాపారం 83.5 కోట్ల డాలర్లు దాటితే పన్ను చెల్లించేటట్లు, ఫ్రెంచ్ సంస్థల వ్యాపారం 2.7 కోట్ల డాలర్లు దాటగానే పన్ను చెల్లించాలని నిబంధనలు విధించారు. ఇది అమెరికా, చైనా, ఐరోపా దేశాల్లో 30 కంపెనీలపై ప్రభావం కలిగిస్తుంది.

ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్యవాదులకు కొన్ని సందేహాలున్నాయి. కార్పొరేట్లు ప్రభుత్వాలను శాసించే స్థాయికి ఎలా ఎదిగాయి? ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ వాణిజ్య సంస్థ, ప్రపంచీకరణల అవలక్షణాలను సవరించే రాజకీయ నిర్ణయాలను ప్రభుత్వాలు ఎందుకు తీసుకోలేకపోతున్నాయి? కార్పొరేట్ల పన్నుల రద్దుకు ప్రభుత్వాలు ఎందుకు పోటీపడుతున్నాయి? బహుళజాతి సంస్థల ఉమ్మడి ఆర్థిక విధానాలను ఎందుకు రూపొందించవు? ప్రజాప్రయోజన చర్యలు మాని కార్పొరేట్లకు అపరిమితఆదాయాలు అందించేవిధానాలను ఎందుకు అవలంభిస్తున్నాయి? కాలంచెల్లిన జాతీయ రాజకీయాలు కార్పొరేట్లపై అధీనతను తిరిగి సాధిస్తాయా? పాలకులు బహుళజాతి సంస్థలకు అమ్ముడుపోయి ప్రజాశ్రేయస్సు వదిలేయటం కారణమని పై ప్రశ్నలకు జవాబు. ఆకలి, పేదరికం, నిరుద్యోగం, పర్యావరణ కాలుష్యం, వలస వాదం, కృత్రిమ మేధస్సు వంటి సవాళ్లను అధిగమించి సమస్యలను పరిష్కరించుకుంటాయా? తప్పకుండా. అయితే ప్రపంచ దేశాలు ఉమ్మడి అపాయాలు గుర్తించాలి. సరిహద్దులుదాటి ఏకమవ్వాలి. ఐక్యకార్యాచరణ రూపొందించుకోవాలి. సమసమాజ నిర్మాణానికి పూనుకోవాలి.

వ్యాస రచయిత ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి,
చరవాణి: 94902 04545

విద్యా విధానం వ్యాపారం, కాషాయం

డాక్టర్ యం.సురేష్‌బాబు

కేంద్ర ప్రభుత్వం పెట్టిన నూతన విద్యా విధానం అరవై ఐదు పేజీల డాక్యుమెంట్లో ప్రముఖంగా ప్రస్తావించింది వ్యాపారీకరణ , కాషాయీకరణ, కేంద్రీకరణ. ప్రభుత్వం అశాస్త్రీయమైన విధానాలు, జీవంలేని విద్యా ప్రమాణాలతో నైపుణ్యంలేని సమాజాన్ని తయారు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నది. సమాన విద్యావకాశాలు లేక, శాస్త్రీయత లేక విద్య పూర్తిగా నిరుపయోగంగా మారనున్నది. మెరుగైన జీతాలు లేక ప్రభుత్వ ఉపాధ్యాయులు, జీతాలే లేక ప్రైవేటు ఉపాధ్యాయులు కాలం వెళ్లబుచ్చుతున్నారు. ఈ సంక్షోభం ఇక్కడితో ఆగదు, అజ్ఞాన సమాజంలో వికృత రూపాలతో సామాజిక సంక్షోభం రాబోతున్నది. ఇప్పుడైనా ప్రభుత్వ సలహాదారులు, విద్యా రంగంలో నిష్ణాతులు, మేధావులు, ఉపాధ్యాయులు ఆత్మ పరిశీలన చేసుకోవాలి. చదువంటే కేవలం ఇంజినీరింగ్ చదువు, అందులో కేవలం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ కోర్సులు అన్న భ్రమలో సమాజం ఉన్నది. దశాబ్ద కాలంగా ప్రైవేటు విశ్వవిద్యాలయాల దోపిడీని అడ్డుకట్ట వేయలేకుండా ప్రభుత్వం మీన మేషాలు లెక్కిస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులకు మంచి జీతాలు ఇచ్చి పర్యవేక్షణ ఏర్పాటు చేసి విలువలతో కూడిన విద్యా ప్రమాణాలను తీసుకొనిరావాలి. విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలు లేవు. అధ్యాపకులకు బోధనా సామర్థ్యాలు అంతకంటే లేవు. యాభై సంవత్సరాలు ముందు వెలసిన విశ్వవిద్యాలయాల్లో అకడమిక్ స్టాఫ్ కాలేజీలు మూతపడి దశాబ్దం అవుతుంది. రిఫ్రెషర్ కోర్సులు, ఓరియెంటేషన్, స్టాఫ్ డెవెలప్మెంట్ కోర్సులు అన్నీ అనియత విద్య లాగా టీవీలు, కంప్యూటర్లలో బోధిస్తున్నారు. ఉన్న విశ్వవిద్యాలయాలు పటిష్టం చేయకుండా కొత్తగా క్లస్టర్ యూనివర్సిటీకి, గిరిజన యూనివర్సిటీ, ఉర్దూ యూనివర్సిటీ, కేంద్ర విశ్వవిద్యాలయాలకు శంకుస్థాపన చేశారు. విద్యాలయాలంటే బిల్డింగులు, స్థలాలు కాదు, అధ్యాపకులు లేకుండా విశ్వవిద్యాలయాలు ఎలా నడుపుతారో బోధపడదు. పరీక్షలు సకాలంలో జరపరు, ఫలితాలు వెల్లడించరు, పిహెచ్డి వైవా జరపరు. పరిస్థితి ఇలా ఉంటే మరో రెండు సంవత్సరాలలో విశ్వ విద్యాలయాలను శాశ్వతంగా మూసివేయడం ఖాయమనిపిస్తుంది. విశ్వవిద్యాలయాలు మొదలుపెట్టి ఐదు సంవత్సరాలైన నిధుల లేమితో ఎప్పుడూ స్మశాన ప్రశాంతత నెలకొంటున్నాయి. విద్యలో నాణ్యత పెంచడానికి కొత్తగా కన్సల్టెన్సీలు ద్వారా కో ఆర్డినేటర్లను నియమించి ఉన్న కొద్దిమంది అధ్యాపకులతో కమ్యూనిటీ డెవలప్మెంట్, స్కిల్ డెవలప్మెంట్, ఇండస్ట్రీ ఇన్స్టిట్యూట్ ఇంటరాక్షన్ సెల్ ఏర్పాటుచేసి అర్థం పర్థం లేని పనులు చేయిస్తున్నారు.

కొత్త కోర్సులు బోధించడానికి బోధకులు లేకపోవడంతో విద్యార్థులు సుదూర ప్రాంతాలకు తరలిపోతున్నారు. అధ్యాపకులకు ఓరియెంటేషన్, రిఫ్రెషర్ కోర్సులు లేవు, బోధనా నైపుణ్యాలు మెరుగుపడాలంటే బోధకులకు కొత్త అంశాల పట్ల శిక్షణ ఉండాలి. ఉపాధ్యాయ శిక్షణా మార్గదర్శి మెటీరియల్ దొరకడంలేదు. చాల అనుబంధ కళాశాలల్లో, ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో కోర్ ఇంజినీరింగ్ బ్రాంచీలు లేకుండా కేవలం బి టెక్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ సైన్సు, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, మిషన్ లెర్నింగ్ కోర్సులు మాత్రమే ఉంటున్నాయి. మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ బ్రాంచీలు సరండర్ చేసి కంప్యూటర్ కోర్సులు తెచ్చుకుంటున్నారు. ఇక ప్రైవేట్ విశ్వ విద్యాలయాలలో ఎన్ని సెక్షన్లు ఉన్నాయో, వేటికి అప్రూవల్ ఉందో తెలియని పరిస్థితి. యూజీసీ, ఏఐసిటిఇలో పనిచేసిన ప్రబుద్ధులు పదవీ విరమణ తరువాత ఈ విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సెలర్, ఛాన్సెలర్‌గా చలామణి అవుతుంటారు, అలాగే ఇక్కడ పనిచేసినవారు ఫీజు రెగ్యులేటరీ కమిషన్ చైర్మెన్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రైవేటు విశ్వవిద్యాలయాలు అడ్మిషన్ జూన్ నెలలో పూర్తిచేసి అకడమిక్ క్యాలెండర్ జూన్‌లో మొదలు పెడితే ప్రభుత్వ కళాశాలలో, ఇంజినీరింగ్ డిగ్రీ కోర్సులలో అడ్మిషన్ డిసెంబర్ నెల వరకు జరుగుతూ ఉంటుంది. ఈ జాప్యానికి కారణం ఎవరికీ అర్థం కాదు. విద్య అంతిమ లక్ష్యం ఉపాధి అన్న చందంగా విద్యాలయాలు మారుతున్నాయి. ప్రైవేటు కళాశాలలో అధ్యాపకులు లేకపోయినా, అధ్యాపకులు నకిలీ పీహెచ్డి ఉన్న, ఒక కళాశాలలో పనిచేసే అధ్యాపకులు నాలుగు వందల కిలోమీటర్ల దూరంలో మరొక కళాశాలలో దర్శనమిస్తున్నా అధికారుల నియంత్రణ లేదు. తొంభైశాతం అధ్యాపకులు వారు బోధిస్తున్న సబ్జెక్ట్‌చదవనివారు. దశ దిశ లేకుండా, ముందుచూపు, ఆలోచనకు తావివ్వకుండా అస్తవ్యస్తంగా విద్యారంగం మారిపోతున్నది. నిలువరించాల్సిన ప్రభుత్వానికి పట్టింపు లేకపోగా, నియంత్రణకై ఒత్తిడి పెంచాల్సిన పౌర సంస్థలు, విద్యార్థి సంఘాలు చతికిలబడుతున్నాయి. ప్రజాస్వామ్యబద్ధంగా ఎదగాల్సిన సమాజం కులాలుగా, వర్గాలుగా మరింతగా బలోపేతమవుతున్నది. ఇది అభివృద్ధికరమా, అనారోగ్యకరమా అని గుర్తించే స్థితిలో ప్రజలు లేరు. వీరికి మార్గదర్శనం వహించే రాజకీయ పార్టీలు లేవు. వాకిలిని చూసి ఇంటి గూర్చి చెప్పవచ్చు అన్నట్లు, విద్యారంగాన్ని చూసే ఆ దేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితిని అంచనా వేయవచ్చు. రాజకీయం ఎంతగా కలుషితం చెందిందో, విద్యారంగం అంతే మోతాదులో విషపూరితమైనది.

మన విద్యారంగం ఎవరికోసం నడుస్తున్నదో, ఎందుకోసం నడుస్తున్నదో అంతుపట్టకుండా పోయింది. నేతాజీ సుభాష్‌చంద్రబోస్, అంబేద్కర్, లౌకికవాదం, సామ్యవాదం సామాజిక శాస్త్రాల నుండి తొలగించి దేశాన్ని బజారుకు ఈడ్చిన వారి గురించి పాఠ్యంశాలు ప్రవేశ పెట్టారు. ఆన్‌లైన్ కోర్సులు ప్రవేశపెట్టి నలభై శాతం కంపల్సరీ చేసి అధ్యాపకుల నోరు కొట్టారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిర్వాకం, నిర్వహణ గూర్చి బ్రిటీషు, మెడికల్ జర్నల్ వేలెత్తి చూపినా మనం గుర్తించే స్థితిలో లేము. ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఐఐటిలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయాలు నలభై ఐదు శాతం ఉద్యోగ క్షీణతతో కొత్త ప్రాజెక్టులు లేక సమస్యల సుడిగుండంలో కూరుకుపోయాయి. 2014 వరకు విద్యాలయాలు, కళాశాలలు, చైతన్యపూరితంగా వుంటూ, విద్యారంగం విధివిధానాల గూర్చి చర్చించేవి. అందులోని లోతుపాతులు విడమరచి చెప్పేవి. రాజ్యాంగ బద్ధంగా ఎలా ఉండాలో నిర్దేశించేది. వీటికోసం విద్యార్థి వర్గంతో పాటు అధ్యాపక వర్గం కూడా చేతులు కలిపేది, చర్చలు జరిగేవి. సమాజానికి మార్గదర్శకంగా వ్యవహరించేవారు. ఈ చైతన్యంతోనే ఉపాధ్యాయులుగా వచ్చిన యువత పాఠశాల విద్యారంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపారు.

ఉపాధ్యాయ సంఘాల్ని నిద్రలేపారు. అప్పటిదాకా ఉపాధ్యాయ హక్కులకై, సంఘాల్ని ఏర్పరచుకునే రాజ్యాంగ బద్ధతకై పోరాటాలు చేసిన సంఘాలు సామాజిక, బాధ్యతవైపు దృష్టి సారించగా, దీనికి ఆయా సందర్భాలలో చెలరేగిన ప్రజా పోరాటాలు తోడయ్యాయి. దీంతో హక్కులకై పోరాడుతూనే బాధ్యతవైపు దృష్టి సారించాలనే నిర్ణయానికి ఉపాధ్యాయ సంఘాలు వచ్చాయి.

విద్యారంగం ప్రత్యేక వ్యవస్థ కాదని, సమాజంతో విడదీయరాని బంధం ఉంటుందని, సామాజిక సమస్యలే విద్యారంగ సమస్యలుగా, ఉపాధ్యాయ రంగ సమస్యలుగా ఉంటాయి కాబట్టి వృత్తి నిబద్ధతతో పాటు సామాజిక బాధ్యతను నెరవేరిస్తేనే విద్యారంగ, ఉపాధ్యాయరంగ సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు లభిస్తాయని, తర్వాతి కాలంలో సంఘాలు గుర్తించి, ఉపాధ్యాయుల్ని కొంత మేరకు ఆ దిశవైపుకు తిప్పాయి. వీటికి అనుగుణంగానే నిబంధనావళిని, విధానపత్రాన్ని కొన్ని ముఖ్యమైన సంఘాలు రాసుకున్నాయి. ఉపాధ్యాయ సంఘాలు నిరంతరం సదస్సుల్ని, సమావేశాల్ని, మహాసభల్ని పెట్టి ఉపాధ్యాయుల్ని చైతన్యపరుస్తూ ఎదిగించాయి. ఇలా ఉపాధ్యాయుల్లో వచ్చిన గుణాత్మకమైన మార్పు విద్యారంగంపై, పాఠశాలపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ఒక దశలో ప్రభుత్వాలకు ఈ తీరు కొంత ఇబ్బందిని కూడా కలిగించింది. ఇది ఇలాగే కొనసాగితే, తమ ఉనికికే ప్రమాదమని భావించిన పాలకవర్గాలు నిర్బంధాన్ని కూడా పెంచాయి. అరెస్టుల్ని సాగించినా, వెనకాడకుండా, సంఘాలు ఎదుర్కోవడం జరిగింది. సరళీకృత నూతన ఆర్థిక విధానాలు అన్నింటా ప్రభావం చూపినట్లే, ప్రజా సంఘాలపై, వృత్తి సంఘాలపై చూపాయి. ఉపాధి ఉద్యోగ అవకాశాలు ఆంగ్లం నేర్చుకుంటేనే అన్న భ్రమలో ప్రభుత్వాలు ఉన్నప్పుడు కనీసం పాఠశాలల్లో అధ్యాపకులను నియమించకుండా విద్యార్థులను ఎందుకూ పనికిరాని వారిగా తయారు చేయడమెందుకు. ఎవరికి తోచినట్టు వారు విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నారు.

వ్యాస రచయిత రాష్ట్ర అధ్యక్షులు, ప్రజాసైన్స్ వేదిక.

కాకరేపుతున్న 'హిందీ' వివాదం

- పార్లమెంటరీ కమిటీ సిఫార్సులపై దక్షిణాదిలో వ్యతిరేకత
- రేపు తమిళనాడు వ్యాప్తంగా నిరసనలకు డీఎంకే పిలుపు

చెన్నై: దేశవ్యాప్తంగా కేంద్ర విశ్వవిద్యాలయాలు సహా అన్ని సాంకేతిక, సాంకేతికేతర, వైద్య విశ్వవిద్యాలయాల్లో సైతం హిందీని బోధనా మాధ్యమంగా చేయాలన్న పార్లమెంటరీ కమిటీ చేసిన సిఫార్సులపై దక్షిణాది రాష్ట్రాలు మండిపడుతున్నాయి. హిందీని ప్రధాన భాషగా మార్చొద్దంటూ తీవ్రంగా స్పందిస్తున్నాయి. మరో హిందీ వ్యతిరేక ఉద్యమం రానీయకూడదంటూ హెచ్చరిస్తున్నాయి. తమిళనాడులో అధికార డీఎంకే యువజన, విద్యార్థి విభాగం రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపట్టాలని పిలుపునిచ్చింది. ఈ క్రమంలో ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) యువజన విభాగం కార్యదర్శి ఉదయనిధి స్టాలిన్, విద్యార్థి విభాగం కార్యదర్శి సీవీఎంపీ ఎజిలరస సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం బలవంతంగా హిందీని రుద్దే విధానాలకు వ్యతిరేకంగా నిరసనలు చేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 15న తమిళనాడు అంతటా నిరసనలకు డీఎంకే సిద్ధమైంది. ఇంతకుముందే పార్లమెంటరీ కమిటీ నివేదికను సీఎం ఎంకే స్టాలిన్ ఖండించారు. అక్టోబర్ 10న స్టాలిన్ ట్వీట్ చేస్తూ... 'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హిందీని దక్షిణాది రాష్ట్రాలపై బలవంతంగా రుద్దుతోంది... భారతదేశ వైవిధ్యాన్ని తిరస్కరించడానికి వేగంగా అడుగులు వేస్తోంది... అధికార భాషపై పార్లమెంటరీ కమిటీ నివేదిక వాల్యూమ్-11లోని తీర్మానాలు నేరుగా భారతదేశ ఆత్మపై దాడి చేస్తున్నాయి' అని పేర్కొన్నారు. పార్లమెంటరీ కమిటీ సిఫార్సులను అమలు చేసేట్లయితే హిందీ మాట్లాడే వారు... దేశంలోనే ఇతర భాషాలు మాట్లాడేవారిని ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణిస్తారు. హిందీని బలవంతంగా రుద్దడం భారతదేశ సమగ్రతకు విరుద్ధం. గతంలో జరిగిన హిందీ వ్యతిరేక ఉద్యమాల నుంచి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాఠాలు నేర్చుకోవాలని స్పష్టం చేశారు.

ప్రధానికి కేరళ సీఎం లేఖ

హిందీ భాషను దక్షిణాది రాష్ట్రాలపై బలవంతంగా రుద్దే ప్రయత్నాలు ఆమోదయోగ్యం కాదని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. ఈమేరకు బుధవారం ఆయన ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. కేంద్ర సర్వీసులకు నిర్వహించే పరీక్షల్లో హిందీని మాధ్యమంగా మార్చాలని, హిందీని తప్పనిసరి చేయాలని పార్లమెంటు అధికార భాషా కమిటీ సిఫార్సులు వెలువడిన నేపథ్యంలో కేరళ సీఎం విజయన్ ప్రధానికి లేఖ రాశారు.

నచ్చిన భాషలో పరీక్షలు రాయనీయండి: రాహుల్

ఈ అంశంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సైతం స్పందించారు. కర్ణాటకలో భారత్ జోడో యాత్ర చేస్తున్న ఆయన... చిత్రదుర్గలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో యువతను ఉద్దేశించి ప్రసంగించారు. 'భాష అనేది మాట్లాడుకోవడానికి ఉపయోగించేది మాత్రమే కాదు. భాష అనేది ఓ విశ్వాసం, ఓ భావన. భాషలో ఓ చరిత్ర ఉంటుంది. ప్రతి రాష్ట్రానికి దాని భాషను ఉపయోగించుకునే హక్కు ఉంది. విద్యార్థులు తమకు వచ్చిన భాషలోనే పరీక్షలు రాయాలని అనుకుంటే వారిని అందుకు అనుమతించాలి' అని రాహుల్ గాంధీ చెప్పారు.

పార్లమెంటు కమిటీ ఏం చెప్పింది?

అధికార భాష విషయంపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా నేతృత్వంలో ఏర్పాటైన పార్లమెంటు కమిటీ తన సిఫారసులను వెల్లడించింది. దేశవ్యాప్తంగా కేంద్ర విశ్వవిద్యాలయాలు సహా అన్ని సాంకేతిక, సాంకేతికేతర, వైద్య యూనివర్సిటీల్లో హిందీని బోధన మధ్యమంగా కొనసాగించాలని సూచించింది. బీహార్, జార్ఖండ్, యూపీ, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, చత్తీసగఢ్, హిమాచల్ ప్రదేశ్, హరియాణా, రాజస్థాన్ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలైన ఢిల్లీ, అండమాన్-నికోబార్ దీవుల్లోని హైకోర్టుల్లో కార్యకలాపాలు హిందీలోనే జరగాలని సూచించింది. ఇటీవల మొత్తం 112 సిఫార్సులతో కూడిన నివేదికను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించింది.

పెరుగుతున్న ఆందోళనలు

పార్లమెంటరీ కమిటీ నివేదిక వెలువడిన తరువాత దక్షిణ, ఈశాన్య రాష్ట్రాల్లో హిందీకి వ్యతిరేకంగా ఆందోళనలు ప్రారంభమయ్యాయి. ప్రధానంగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలల్లో భాషాభిమానులు ఆందోళన కార్యక్రమాలను చేస్తున్నారు. ప్రధాన నాయకులు కూడా హిందీకి వ్యతిరేకంగా తమ గళాలను విప్పుతున్నారు. మరోవైపు ఈశాన్య రాష్ట్రాల్లో త్రిభాషా సూత్రాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇది ఏకపక్షం... అన్యాయం

ఎన్నికల గుర్తు, పార్టీ పేరుపై ఈసీకి ఉద్ధవ్ సేన లేఖ

న్యూఢిల్లీ: మహారాష్ట్రలోని శివసేన పార్టీ రెండుగా చీలిన క్రమంలో ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి, ఏక్‌నాథ్ షిండే వర్గానికి రెండు వేర్వేరు గుర్తులను ఎన్నికల కోసం భారత ఎన్నికల కమిషన్ కేటాయించింది. ఈ వ్యవహారంలో తమ విష యంలో వివక్ష చూపారంటూ ఎన్నికల కమిషన్‌కు ఉద్ధవ్ ఠాక్రే శివసేన లేఖ రాసింది. ఎన్నికల కమిషన్ తాజా చర్యలు అనేక సందేహాలకు తావిస్తున్నట్లు ఎన్నికల కమిషన్‌కు న్యాయవాది వివేక్‌సింగ్ ద్వారా పంపిన లేఖలో వెల్లడించింది. శివసేన పేరుపై వివాదం పరిష్కారమయ్యే వరకు దాని వినియోగంపై ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధిం చింది. విల్లు-బాణం గుర్తు వాడొద్దు అని సూచించింది. ఇటీవల శివసేన-ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే'కు మండుతున్న కాగడా గుర్తును; బాలాసాహెబంచీ శివసేన (షిండే వర్గం)కు రెండు కత్తులు, కవచం గుర్తును ఎన్నికల సంఘం కేటాయిం చింది. మహారాష్ట్రలోని అంధేరి ఈస్ట్ ఉప ఎన్నిక కోసం విల్లు-బాణం గుర్తు వినియోగంపై షిండే వాదనలకు స్పందించే సమయాన్ని కూడా తమకు ఇవ్వలేదని ఠాక్రే వర్గం తరపు న్యాయవాది సింగ్ పేర్కొన్నారు. ప్రత్యర్థి వర్గంతో పాటు అందరికీ అందుబాటులో ఉండేలా తమ అధికారిక వెబ్‌సైట్‌లో ఎన్నికల గుర్తులు, పార్టీ పేర్లకు ప్రాధాన్యతనిస్తూ లేఖను ఉన్నట్లు ఠాక్రే వర్గం ఆరోపించింది. కమిషన్ నిర్ణయానికి, పిటీషనర్ తమ వివరణను సమర్పించకముందే ఇలా జరగడం అన్యాయమని సింగ్ వెల్లడించారు. షిండే వర్గానికి పేరు, ఎన్నికల గుర్తును ఎంపిక చేసుకునేలా మొదటి ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. ఇదంతా ఏకపక్షంగా, అన్యాయంగా జరిగిందని లేఖలో పేర్కొన్నారు. మండే కాగడా కంటే రెండు కత్తులు, కవచమే ఎన్నికల గుర్తుగా బలంగా ఉన్నదన్నారు. పార్టీ పేరు, గుర్తు విషయంలో అన్యాయం చేశారని అన్నారు.

కోల్‌కతా-అగర్తలా ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం

అసోంలో అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో ద్రౌపది ముర్ము

అగర్తల: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా గురువారం అగర్తల రైల్వేస్టేషన్ నుంచి అగర్తల వరకు గౌహతి-కోల్‌కతా-గౌహతి రైలు పొడిగింపును జెండా ఊపి ప్రారంభించారు. అగర్తలా-జిరిబామ్-అగర్తలా జన శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌ను మణిపూర్‌లోని ఖోంగ్‌సాంగ్ వరకు పొడిగించడాన్ని రాష్ట్రపతి, సీఎం సాహా జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రపతి ముర్ము అక్టోబర్ 12 నుంచి 14 వరకు త్రిపుర, అసోంలలో పర్యటిస్తున్నారు. ఆమె అనంతరం కేంద్ర ఎలక్ట్రానిక్స్& ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖలు, అసోం ప్రభుత్వానికి చెందిన వివిధ ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనల చేయనున్నారు. గౌహతి లోని అసోం అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీలో ఆమె గౌరవార్థం నిర్వహించే పౌర సన్మాన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. అసోం ప్రభుత్వ రోడ్డు రవాణా, రహదారులు, పెట్రోలియం, సహజ వాయువు, రైల్వేకు చెందిన కేంద్ర మంత్రిత్వ శాఖల వివిధ ప్రాజెక్టులకు రాష్ట్రపతి శుక్రవారం ప్రారంభోత్సవం చేస్తారు. వీటిలో ఆధునిక సౌకర్యాలతో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాల ప్రారంభం, మిషన్ సౌభాగ్య, సిల్చార్‌లోని మొయినార్ బాండ్‌లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ రైల్-ఫెడ్ పెట్రోలియం నిల్వ డిపో ప్రారంభోత్సవం, రెండు హైవే ప్రాజెక్టులు, అసోంలోని టీ గార్డెన్ ప్రాంతాల్లో 100 మోడల్ సెకండరీ స్కూల్స్, గౌహతిలోని అగ్థోరిలో రెండు హైవే ప్రాజెక్టులు, ఆధునిక కార్గో-కమ్-కోచింగ్ టెర్మినల్ కోసం శంకుస్థాపన చేయనున్నారు. ఆమె తర్వాత గౌహతి నుంచి లుమ్‌డింగ్‌కి శోఖువి (నాగాలాండ్), మండిపత్తర్ (మేఘాలయ) వరకు రైలును జెండా ఊపి ప్రారంభిస్తారు. రాష్ట్రపతి ముర్ము త్రిపుర జ్యుడీషియల్ అకాడమీని ప్రారంభించి, త్రిపురలోని నేషనల్ లా యూనివర్సిటీకి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ దేశాభివృద్ధికి, యువతరం పురోగమించా లంటే సమగ్ర విద్యావిధానం అవసరమన్నారు. ఉన్నత విద్యతో పాటు ప్రాథమిక విద్యకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. త్రిపుర రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ 'విద్య-జ్యోతి మిషన్ 100'ని ప్రారంభించిందని, దీని కింద ప్రస్తుతం ఉన్న 100 హయ్యర్ సెకండరీ పాఠశాల లను నాణ్యమైన విద్యా సంస్థలుగా మార్చడంపై ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

వసపిట్టల గుంపు 'ఆప్': బీజేపీ

గాంధీనగర్: బీజేపీ నిర్వహిస్తున్న గుజరాత్ గౌరవ్ యాత్రలో పాల్గొనేందుకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గురువారం గుజరాత్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆమ్ ఆద్మీ పార్టీ అంటే చాలా ఎక్కువగా మాట్లాడేవారి గుంపు అని ఎద్దేవా చేశారు. ఆప్ నేతలు చెబుతున్న ఢిల్లీ మోడల్‌ను ప్రశ్నించారు. వారు నిజాయతీపరులైతే, మీడియాను ఢిల్లీకి తీసుకెళ్లి, ఆ మోడల్‌ను చూపించాలన్నారు. ఎటువంటి బాధ్యతను ప్రదర్శించనివారంటే తనకు భయమని, వీరు అలాంటి గుంపు అని తెలిపారు. ఈసారి కూడా గుజరాత్ ప్రజలు బీజేపీపై నమ్మకం ఉంచుతారని ధీమా వ్యక్తం చేశారు. గుజరాత్ గౌరవ్ యాత్రను బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా బుధవారం ప్రారంభించారు.

ఎస్‌డీపీఐ, పీఎఫ్ఐ కార్యకర్తల ఇళ్లపై దాడులు

బెంగళూరు: కర్ణాటక పోలీసులు గురువారం దక్షిణ కన్నడ జిల్లాలో సోషలిస్ట్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ), నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) కార్యకర్తల నివాసాలపై దాడులు చేశారు. విచారణ నిమిత్తం పోలీసులు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిషేధం విధించిన తర్వాత రాష్ట్రంలో పీఎఫ్ఐ కార్యకర్తలపై దాడులు జరగడం ఇదే తొలిసారి. పణంబూర్, సూరత్‌కల్, ఉల్లాల్, మంగళూరు రూరల్ ప్రాంతాల్లో దాడులు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. అదుపులోకి తీసుకున్నవారంతా నిషేధిత పీఎఫ్ఐకి చెందిన వారు. వీరిపై ఐపీసీ సెక్షన్ 121, ఉపా నిబంధనల పోలీసులు సెక్షన్ 121 యొక్క నిబంధనలను ప్రయోగించారు. ఎస్‌డీపీఐ, పీఎఫ్ఐ విధ్వంసక కార్యకలా పాలు, దేశ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాయని కర్ణాటకలోని అధికార బీజేపీ నేతలు ఆరోపించారు.

పట్టాలెక్కిన నాలుగో వందేభారత్

హిమాచల్‌లో ప్రారంభించిన మోదీ

ఉనా (హిమాచల్‌ప్రదేశ్): ప్రధాని నరేంద్ర మోదీ గురువారం హిమాచల్ ప్రదేశ్‌లోని ఉనా రైల్వే స్టేషన్ నుంచి దేశంలోని నాలుగో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును జెండా ఊపి ప్రారంభించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని అంబ్ అందౌరా - న్యూఢిల్లీ మధ్య ఈ రైలును నడుపుతారు. 'కొత్త వందే భారత్ రైలు మునుపటి వాటితో పోలిస్తే అధునాతనమైనది... చాలా తేలికైనది...తక్కువ వ్యవధిలోనే అధిక వేగాన్ని చేరుకోగలదు' అని అధికారులు తెలిపారు. ఈ రైలు బుధవారం మినహా వారానికి ఆరు రోజులు నడుస్తుంది. అంబాలా, చండీగఢ్, ఆనంద్‌పూర్ సాహిబ్, ఉనాలో ఆగుతుంది. ఇది కేవలం 52 సెకన్లలో గంటకు 100 కి.మీ. వేగాన్ని అందుకుంటుంది. అంతకుముందు ఉనాలోని పెఖుబేలా హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న ప్రధానికి హిమాచల్ సీఎం జై రామ్ ఠాకూర్ స్వాగతం పలికారు. ఈ ఏడాది చివర్లో ఎన్నికలు జరగనున్న రాష్ట్రంలోని రెండు జిల్లాల్లో వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపన చేసిన అనంతరం ఉనా, చంబా జిల్లాల్లో జరిగిన రెండు బహిరంగ సభల్లో ప్రధాని ప్రసంగించారు. 'ఉనా, హిమాచల్‌ప్రదేశ్‌లకు దీపావళి పండుగ ముందుగానే వచ్చింది. ధంతెరాస్, దీపావళికి ముందు హిమాచల్‌కు కొన్ని వేల కోట్ల రూపాయల విలువైన బహుమతులను ప్రకటించడం సంతోషంగా ఉంది. ఈరోజు నేను కొత్త వందే భారత్ రైలు ప్రారంభ పరుగును జెండా ఊపి ప్రారంభించాను. ఇది దేశంలో ప్రవేశపెట్టిన నాల్గవ వందే భారత్ రైలు' అన్నారు. కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పిస్తూ... గతంలో హిమాచల్‌లో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. హిమాచల్‌లో మునుపటి ప్రభుత్వాలు, ఢిల్లీలో కూర్చున్న ప్రభుత్వాలు కూడా ఇక్కడి ప్రజల అవసరాలను తీర్చడంలో ఉదాసీనంగా వ్యవహరించాయన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేస్తోందని, కొత్త మౌలిక సదుపాయాలను నిర్మిస్తోందని చెప్పుకొచ్చారు. ఉనాలో 1900 కోట్ల రూపాయల వ్యయం కాగల బల్క్ డ్రగ్ పార్క్‌కు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ... ఫార్మా పార్క్ దాదాపు రూ. 2వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తుందని చెప్పారు. 'ముడి పదార్థాలు, ఉత్పత్తి రెండూ హిమాచల్ ప్రదేశ్‌లో తయారైనప్పుడు మందులు చౌకగా మారతాయి' అని ఆయన అన్నారు. బీజేపీ ప్రభుత్వం 20వ శతాబ్దపు ప్రజల అవసరాలను తీర్చడమే కాకుండా, 21వ శతాబ్దపు ఆధునిక సౌకర్యాలను హిమాచల్‌లో ప్రతి ఇంటికీ తీసుకు వస్తోందన్నారు. 'గ్రామీణ రహదారుల అభివృద్ధి, నీటి సరఫరా, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల లభ్యతతో పాటు డిజిటల్ మౌలిక సదుపాయాలను అభివృద్ధిపర్చడానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. హిమాచల్‌లో గ్రామీణ రహదారులను రెట్టింపు వేగంతో నిర్మిస్తున్నారని, అదే సమయంలో గ్రామ పంచాయతీలకు కనెక్టివిటీ కూడా వేగంగా అందిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు.

హిజాబ్‌పై 'నిషేధమే': కర్ణాటక ప్రభుత్వం

బెంగళూరు: హిజాబ్ ధారణపై సుప్రీం కోర్టు ద్విసభ ధర్మాసనం స్పష్టమైన తీర్పు ఇవ్వలేకపోయింది. దీంతో కర్ణాటకలో హిజాబ్ ధారణపై నిషేధం కొనసాగుతుందని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బీసీ నగేష్ మీడియాతో మాట్లాడుతూ, సుప్రీం కోర్టులో స్పష్టమైన తీర్పు రాలేదు కాబట్టి పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులు, మహిళలు హిజాబ్ ధరించడంపై నిషేధం కొనసాగుతుందని చెప్పారు. కర్ణాటకలోని విద్యా సంస్థల తరగతి గదుల్లో విద్యార్థినులు హిజాబ్ ధరించడంపై రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరిలో నిషేధం విధించింది. దీనిని హైకోర్టు మార్చిలో సమర్థించింది. దీనిపై సుప్రీంకోర్టు 10 రోజులపాటు విచారణ జరిపి, సెప్టెంబరులో దీనిపై తీర్పును రిజర్వ్ చేసింది. అనంతరం గురువారం తీర్పు వెల్లడించింది. అయితే ద్విసభ్య ధర్మాసనంలోని ఇద్దరు న్యాయమూర్తులు పరస్పర భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేశారు. విద్యార్థినులు తరగతి గదుల్లో హిజాబ్ ధరించడాన్ని నిషేధిస్తూ కర్ణాటక ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను రద్దు చేస్తూ జస్టిస్ సుధాంశు ధూలియా గురువారం తీర్పు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలను సమర్థిస్తూ కర్ణాటక హైకోర్టు మార్చిలో ఇచ్చిన తీర్పును జస్టిస్ హేమంత్ గుప్తా ధ్రువీకరించారు. ఈ పిటిషన్లపై విచారణను విస్తృత ధర్మాసనానికి అప్పగించాలని కోరుతూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యూయూ లలిత్‌కు నివేదించారు. ఈ నేపథ్యంలో కర్ణాటక విద్యాశాఖ మంత్రి బీసీ నగేష్ గురువారం మీడియాతో మాట్లాడుతూ, విద్యా సంస్థల ప్రాంగణాల్లో ముస్లిం మహిళలు, విద్యార్థినులు హిజాబ్ ధరించడంపై ఆంక్షలు కొనసాగుతాయని చెప్పారు. సుప్రీంకోర్టు మెరుగైన తీర్పు ఇస్తుందని తాము ఆశించామన్నారు. అయితే ఈ తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కర్ణాటక హోం మంత్రి అరగ జ్ఞానేంద్ర మాట్లాడుతూ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని పాఠశాలల్లో యూనిఫాం కోడ్‌ను ప్రభుత్వం నిర్దేశించిందని చెప్పారు. తమ వైఖరిలో ఎటువంటి మార్పు లేదన్నారు. దీనిపై న్యాయ నిపుణులతో చర్చిస్తామని తెలిపారు.

జర్నలిస్టు రాణా అయూబ్‌పై ఈడీ అభియోగాలు

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసుకు సంబంధించి జర్నలిస్టు రాణా అయూబ్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం మనీలాండరింగ్ అభియోగాలు నమోదు చేసింది. దీంతో పాటు ఆమెపై చీటింగ్ కేసులు కూడా నమోదు చేసింది. కెట్టో.కామ్ వెబ్‌సైట్ ద్వారా సహాయం, దాతృత్వం పేరుతో సేకరించిన నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై ఆమెపై నమోదైన మనీలాండరింగ్ కేసుకు సంబంధించి ఈడీ ఫిబ్రవరిలో రూ. 1.77 కోట్లను అటాచ్ చేసింది. అయూబ్ నిధులను దుర్వినియోగం చేశారని, వ్యక్తిగత ఖర్చుల కోసం నిధులను మరో ఖాతాలోకి మళ్లించారని ఈడీ అధికారి ఒకరు తెలిపినట్లు ఓ ఆంగ్ల వార్తా సంస్థ నివేదించింది. ప్రస్తుతం గ్లోబల్ మీడియా హౌస్ కు వ్యాసాలు రాసే రాణా అయూబ్... కోవిడ్-19 సాయం సాకుతో ప్రజలను మోసం చేసి, దాతృత్వానికి ఉద్దేశించిన నిధులను ఆమె వ్యక్తిగత ఖాతాకు బదిలీ చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కాగా తనపై ఆర్థిక అవకతవకల ఆరోపణలను రాణా అయూబ్ ఖండించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నందుకే ఈడీ ఈ విధమైన ఆరోపణలు చేస్తోందని అన్నారు. ఈడీ దర్యాప్తును 'మంత్రగత్తె వేట' అంటూ అభివర్ణించారు. కాగా అయ్యూబ్ అనేక సందర్భాల్లో కేంద్రం ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఆమెపై నమోదైన ఫిర్యాదు ప్రకారం... అయూబ్ నాన్-ప్రాఫిట్ క్యాంపెయిన్ ద్వారా సేకరించిన రూ.50 లక్షలను సేవింగ్స్ ఖాతా నుంచి ఎఫ్‌డీలోకి మళ్లించారు. అయితే ఆగస్ట్ 2021లో వికాస్ సాంకృత్యాయన్ అనే ఓ వ్యక్తి అయూబ్‌పై ఫిర్యాదు చేశారు. అందులో దాతృత్వం పేరుతో సాధారణ ప్రజలను అయ్యూబ్ మోసం చేశారని ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా 2021న సెప్టెంబర్ 7వ తేదీన ఉత్తరప్రదేశ్ లోని ఇందిరాపురం పోలీస్ స్టేషన్‌లో అయూబ్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది.

ఐబీ ఉద్యోగి హత్య కేసు నిందితుడి అరెస్టు

న్యూఢిల్లీ: ఈశాన్య ఢిల్లీలో 2020 ఫిబ్రవరిలో జరిగిన అల్లర్లలో ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) ఉద్యోగి అంకిత్ శర్మ హత్య కేసులో ప్రధాన నిందితుడిని అరెస్టు చేసినట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. దర్యాప్తు సమయంలో ముంతజీమ్‌ను నింది తుడిగా గుర్తించినట్లు తెలిపారు. అతను తెలంగాణకు పారిపోగా అక్కడ అరెస్టు చేశామని పోలీసులు చెప్పారు. ఈశాన్య ఢిల్లీ చాంద్‌బాగ్‌లో శర్మ హత్యకు గుర య్యారు. 2020, ఫిబ్రవరి 25వ తేదీ సాయంత్రం 5 గంటలప్పుడు ఈ ఘటన చోటు చేసుకుంది. శర్మ మృతదేహం స్థానిక కాలువలో లభ్యమైంది. దేశ రాజధానిలో జరిగిన అల్లర్ల క్రమంలో ప్రాణాలు కోల్పోయిన 53 మందిలో శర్మ ఒకరు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మాజీ కౌన్సిలర్ తాహిర్ హుస్సేన్, మరో తొమ్మిది మందిపై ఐపీసీలోని వేర్వేరు సెక్షన్లతో పాటు యూఏపీఏ చట్టం కింద కేసులను ఢిల్లీ పోలీసులు నమోదు చేశారు. తాను అమాయకుడిని అని హుస్సేన్ చెప్తుతూ వచ్చారు. ఆయనపై ఆరోపణలను అనేక సందర్భాల్లో హుస్సేన్ తరపు న్యాయవాదులు, స్వతంత్ర్య పరిశీలకులు ప్రశ్నించారు. ముంతజిమ్ అరెస్టుపై పోలీసు అధికారి స్పందించారు. ఫలానా స్థలానికి చేరుకోని శర్మపై దాడి చేయండి అని చెబుతున్న ఫోన్ రికార్డులు లభ్యమైనట్లు వెల్లడించారు.

హిందూత్వను ఢీకొన్న ములాయం

- ఓబీసీలు, ముస్లింల మద్దతు పొందిన సోషలిస్టు నేత
- చివరికి కాషాయ దోస్తీతో చిత్తైన ఎస్పీ అధినేత

లక్నో: సమాజ్‌వాదీ పార్టీ అధినేత ములాయం సింగ్ యాదవ్ సోషలిస్టు నాయకుడిగా ఓ వెలుగు వెలిగారు. నేతాజీగా పేరుగాంచారు. ఉత్తరప్రదేశ్ -జాతీయ రాజకీయ వర్గాల్లోనూ దాదాపు అందరితో సత్సంబంధాలను ఆయన కలిగివుండేవారు. హిందూత్వ రాజకీయాలను వ్యతిరేకించారు. దానిని ఎదుర్కొనే క్రమంలో తిరుగులేని శక్తిగా నిలిచారు. 1980వ దశకంలో ఉత్తరప్రదేశ్ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చివేశారు. మండల్ రాజకీయాల్లో అజేయుడిగా నిలిచారు. అణగారిన వర్గాలను ఏకతాటిపైకి తెచ్చేందుకు శాయశక్తులా ప్రయత్నించారు. సుదీర్ఘకాలం సాగిన ఆయన రాజకీయ కెరీర్‌లో తప్పిదాలు కూడా జరిగాయి. అయితే ఆయన మతతత్వాన్ని ఎప్పుడూ వ్యతిరేకించారు. అణగారిన వర్గాల హక్కుల కోసం పాటుపడ్డారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి పీఠాన్ని మొదటిసారి అధీష్టించి 1989లో స్పాట్‌లైట్‌లోకి ములాయం సింగ్ యాదవ్ వచ్చారు. అజిత్ సింగ్‌ను ఓడించి సీఎంగా ఎన్నికయ్యారు.

ములాయం తన ఆరు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎన్నో ప్రయోగాలు చేశారు. వాటిలో కొన్ని సత్ఫలితాలు ఇవ్వగా మరికొన్ని బెడిసిగొట్టాయి. మండల కమిషన్‌కు ఇచ్చిన మద్దతుతో ఓబీసీలలో తిరుగులేని నేతగా ములాయం సింగ్ యాదవ్ నిలిచారని 1989-90లో ఉత్తరప్రదేశ్ రాజకీయాలపై వార్తలను సేకరించిన సీనియర్ పాత్రికేయులు చెప్పారు. 1990 అక్టోబరులో అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేతకు హిందూ కరసేవక్‌లు చేసిన ప్రణాళికలను ములాయం భగ్నం చేశారు. దీంతో ముస్లింలలో ఆయనకు గౌరవం పెరిగింది. ఈ కారణంగానే ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ నామరూపాలు లేకుండా పోయిందని కూడా చెబుతుంటారు. కాంగ్రెస్ సీనియర్లు వీర్ బహదూర్ సింగ్, నారాయణ్ దత్ తివారీ మధ్య అంతర్గత పోరు యాదవ్‌కు కలిసివచ్చిందని ప్రముఖ జర్నలిస్టు ముదిత్ మాథుర్ అన్నారు. తెరవెనుక ఉండి సింగ్‌కు వ్యతిరేకంగా.. యాదవ్‌కు అనుకూలంగా తివారీ ప్రచారం చేశారన్నారు. ఇట్వావా జిల్లాలో యాదవ్‌కు ప్రధాన ప్రత్యర్థిగా సింగ్ అనుచరుడు బలరాం సింగ్ యాదవ్ ఉన్నట్లు మాథుర్ తెలి పారు. 1991లో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేతిలో ఓడిన తర్వాత యాదవ్ తన సొంత పార్టీ సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ)ని 1992లో స్థాపించారు. అంతకుముందు వరకు ఆయన చంద్రశేఖర్‌కు చెందిన జనతా దళ్ (సోషలిస్టు) పార్టీలో ఉన్నారు.

అణగారిన వర్గాలతో పొత్తు ద్వారా రాజకీయాల్లో పెనుమార్పులను ములాయం సింగ్ యాదవ్ తీసుకు వచ్చారు. 1993లో కాన్షీ రామ్‌కు చెందిన బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)తో చేతులు కలిపారు. తద్వారా ఓబీసీలు, దళితులు, ముస్లింలు ఏకఛత్రం కిందకొచ్చారు. దేశ రాజకీయ చరిత్రలో ఇది అతిపెద్ద రాజకీయ ప్రయోగమని జర్నలిస్టు గోవింద్ పంత్ రాజు అన్నారు. ఈ కూటమి బలంగా ఉండి బీజేపీని ఓడించిందని, 1993లో బాబ్రీ మసీదు విధ్వంసం క్రమంలో వీచిన హిందూత్వ పవనాల ప్రభావం కూడా రాష్ట్రంలో కనిపించలేదన్నారు. హిందూత్వ శక్తిని కొంత కాలం కట్టడి చేయగలిగిన ఈ కూటమి 1995లో చీలిపోయింది. బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీ రామ్ డిమాండ్లే ఇందుకు కారణమని రాజు అన్నారు. దళితులపై దురాగతాలను నియంత్రించడంలో ముఖ్యమంత్రిగా యాదవ్ విఫలమయ్యారని, దీంతో చీలిక ఏర్పడిందని మాథుర్ అభిప్రాయపడ్డారు. తమ 'కమండలం' రాజకీయాలకు ఈ కూటమి సవాల్ విసురుతోందని బీజేపీ భావించగా ఓబీసీలు, దళితుల మధ్య చిచ్చు పెట్టడంలో కాషాయ నేత బ్రహ్మదత్ ద్వివేది కీలక పాత్ర పోషించారు. 1995 జూన్‌లో ఎస్పీ ప్రభుత్వానికి మద్దతును బీఎస్పీ ఉపసంహరించుకుంది. దీంతో ఆగ్రహానికి గురైన ఎస్పీ కార్యకర్తలు బీఎస్పీ నేత మాయావతిపై లక్నోలోని అతిథిగృహం వద్ద దాడి చేశారు. పర్యవసానంగా యాదవ్ ప్రభుత్వం కూలిపోయింది. బీజేపీతో కలిసి మాయావతి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అతిథిగృహం వద్ద దాడికి ములాయం సింగ్ యాదవ్‌కు సంబంధం లేదని అది పార్టీ కార్యకర్తలు చేసిన దాడి అని పాత్రికేయులు రాజు, మాథుర్ తెలిపారు.

యాదవ్ వర్గంతో రాజకీయాలు ప్రారంభించినప్పుడు ప్రజా నాయకుడిగా ములాయం సింగ్ యాదవ్ అవతరించారని సీనియర్ జర్నలిస్టు శరద్‌ప్రధాన్ అన్నారు. యాదవులతో మొదలు పెట్టి మెల్లగా ఓబీసీలను చేరుకున్నారని, ముస్లింల మద్దతును పొందగలగడం రాజకీయంగా ఆయన సాధించిన గొప్ప విజయమని ప్రధాన్ అన్నారు. 1992లో ముస్లింలు, ఓబీసీలతో యాదవ్ పొత్తు పెట్టుకున్నప్పటి నుంచి రాష్ట్రంలో కాంగ్రెస్ బలహీనపడిందని చెప్పారు. 2009లో మాజీ సీఎం, కల్యాణ్ సింగ్‌తో పొత్తు పెట్టుకోవడం రాజకీయంగా ములాయం చేసిన అతిపెద్ద తప్పిదం. ఆయన హయాంలోనే బాబ్రీ మసీదు విధ్వంసం జరిగింది. లోధి వర్గ ఓట్ల కోసం కరడుగట్టిన కాషాయ నేతతో ములాయం సింగ్ యాదవ్ పొత్తు పెట్టుకున్నారు. ఈ పరిణామంతో తీవ్రంగా నష్టపోయారు. లోధి వర్గీయుల ఓట్లు రాకపోగా ముస్లింలు కూడా దూరమయ్యారు. 2016లో ములాయం స్వయంగా తన తప్పును అంగీకరించినట్లు ప్రధాన్ వెల్లడించారు. 1990లో స్థానిక యంత్రాంగం, పోలీసులు కూడా ములాయం సింగ్ యాదవ్‌కు మద్దతివ్వలేదని మరో జర్నలిస్టు సుమన్ గుప్తా అన్నారు. వారు ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రంలో మతఘర్షణ పరిస్థితిని పరిష్కరించలేదని, దీంతో కరసేవక్‌లు మసీదును చేరుకోగలిగారన్నారు. మతతత్వవాదాన్ని యాదవ్ తీవ్రంగా వ్యతిరేకించేవారని, 1990 అక్టోబరు 10, నవంబరు 2 తేదీల్లో మసీదు విధ్వంసం ప్రయత్నాలను కేంద్ర దళాల సాయంతో తిప్పికొట్టగాలిగారని గుప్తా వెల్లడించారు.

'ఫ్లాగ్ మార్చ్'కు ఘన స్వాగతం

విశాలాంధ్ర-గుంటూరు : విజయవాడలో ఈ నెల 14 నుంచి 18 వరకు జరుగనున్న సీపీఐ జాతీయ 24వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కేరళ రాష్ట్రం కొల్లాం నుంచి ప్రారంభమైన యువ కమ్యూనిస్టుల ఫ్లాగ్ మార్చ్ ప్రచార జాతా గురువారం మధ్యాహ్నం గుంటూరు నగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా గుంటూరు చుట్టుగుంట వద్ద ఫ్లాగ్ మార్చ్ నాయకులకు సీపీఐ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. సీపీఐ రాష్ట్ర నాయకులు జంగాల అజయ్‌కుమార్, గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రిలతో పాటు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఆటో యూనియన్ నాయకులు ఎదురేగి ప్రచార జాతాపై పూలవర్షం కురిపిస్తూ టపాసుల మోతల మధ్య స్వాగతం పలికారు. అనంతరం ప్రచార జాతా గుంటూరులోని మెడికల్ క్లబ్, కలెక్టరేట్, పట్టాభిపురం, గుజ్జనగుండ్ల మీదుగా గెస్ట్‌హౌస్, బృందావన్ గార్డెన్స్, లక్ష్మీపురం, లాడ్జిసెంటర్, శంకర్‌విలాస్ సెంటర్, డొంకరోడ్డు మీదుగా సీపీఐ కార్యాలయానికి చేరుకుంది. విద్యార్థులు సైతం పాల్గొని బృందావన్ గార్డెన్స్‌లో ప్రచారా జాతాపై పూలవర్షం కురిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా లాడ్జిసెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కొత్తపేటలోని భగత్ సింగ్ విగ్రహాలకు సీపీఐ, యువ కమ్యూనిస్టుల ఫ్లాగ్ మార్చ్ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. భోజన విరామ అనంతరం ప్రచార జాతా విజయవాడ పయనమైంది. ప్రచార జాతాకు నాయకత్వం వహిస్తున్న యువ కమ్యూనిస్టు, ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్, ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు సుకిందర్ మహేశ్వరి, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి దినేశ్‌లతోపాటు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కే శివారెడ్డి, అధ్యక్షుడు జాన్సన్‌బాబు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర, ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వలివుల్లా ఖాద్రీ తదితరులు ఉన్నారు. సీపీఐ నగర నాయకులు నూతలపాటి చిన్న, ఆకిటి అరుణ్‌కుమార్, రావుల అంజిబాబు, ఆకిటి రామచంద్రుడు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సుభాని, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ వలి, అధ్యక్షుడు జంగాల చైతన్య, ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు జ్ఞానదీప్, వైఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు చిన్నపోతుల శ్రీను, చల్లా మరియదాసు, ఆటో యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు కురాకుల రాంప్రసాద్, మంగా శ్రీను, ఎస్ఎఫ్, వైఎఫ్ నాయకులు సాయి, నవీన్, అమర్‌నాథ్, శ్రీనాథ్, సాగర్, ఖాశిం, సుభాని, రహమాన్, అల్లాభక్షు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లివద్ద స్వాగతం పలికిన రామకృష్ణ, ముప్పాళ్ల

తాడేపల్లి : సీపీఐ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ కేరళ రాష్ట్రం కొల్లాం నుంచి విజయవాడకు జాతగా వచ్చిన ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జాతీయ నాయకులను గురువారం సాయంత్రం తాడేపల్లి ఉండవల్లి సెంటర్ వద్ద సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు వేసి శాలువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రస్తుత మహాసభ నేపథ్యంలో, గత సీపీఐ 23వ జాతీయ మహాసభలు జరిగిన కేరళ రాష్ట్రం కొల్లాం నుంచి ఈ జాత బయలుదేరిందని కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రచారం చేసుకుంటూ విజయవాడ నగరానికి చేరుకుందని, దాన్లో భాగంగా కృష్ణ, గుంటూరు జిల్లాల సీపీఐ నాయకులు, కార్యకర్తలు తాడేపల్లి ఉండవల్లి సెంటర్ కూడలి వద్ద స్వాగతం పలికామని రామకృష్ణ తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారని వారందరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడ నగరంలో భారీ ఎత్తున ర్యాలీ జరగబోతుందని ర్యాలీ అనంతరం బహిరంగ సభ జరుగుతుందని వివరించారు. ఇప్పటికే సీపీఐ జాతీయ నాయకులు అందరూ విజయవాడ నగరానికి చేరుకున్నారని పెద్దఎత్తున ఈ మహాసభలు జరుపుకోవడంతో పాటు రాబోయే రోజుల్లో దేశంలో సీపీఐ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. మహాసభలకు సహకరిస్తున్న అందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. సీపీఐ నాయకులు అక్కినేని వనజ, కంచర్ల కాశయ్య, మానికొండ దాంగే, జాలది జాన్ బాబు, చిన్ని సత్యనారాయణ, కాబోతు ఈశ్వరరావు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ మహాసభలకు అంతర్జాతీయ ప్రతినిధులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీపీఐ 24వ జాతీయ మహాసభలకు 12 దేశాల నుంచి 30 మందికిపైగా ప్రతినిధులు హాజరవుతున్నారు. సౌహార్ద్ర ప్రతినిధులుగా వీరంతా మహాసభల్లో తమ సందేశాలిస్తారు. రష్యా, చైనా, క్యూబా, ఫ్రాన్స్, అమెరికా, పాలస్తీనా, గ్రీస్, వియత్నాం, లావోస్, దక్షిణాఫ్రికా, నేపాల్, కొరియా, పోర్చుగల్, శ్రీలంక, బంగ్లాదేశ్, టర్కీ దేశాల నుంచి ఆయా కమ్యూనిస్టు పార్టీలు, ప్రజా సంఘాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతున్నట్లు సీపీఐ జాతీయ కార్యదర్శి, ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఆహ్వాన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం వెల్లడించారు.

వివిధ దేశాల నుంచి వచ్చే ప్రతినిధుల వివరాలు...

రష్యా	: కామ్రేడ్ రోమన్, కోనోనెంకో (ఎంపీ-కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ రష్యన్ ఫెడరేషన్)
చైనా	: కామ్రేడ్ చెన్ జియాన్‌జున్, కామ్రేడ్ కోవ్ క్రై (కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా)
క్యూబా	: హిజ్ ఎక్సలెన్సీ అలెంజర్ ద్రో సిమన్‌కాస్ మారిన్- (కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ క్యూబా)
ఫ్రాన్స్	: కామ్రేడ్ టెర్రే పాస్కల్ అంజే, కామ్రేడ్ లీ గొర్రిరేక్ మెలైన్ మారీ (ఫ్రెంచ్ కమ్యూనిస్టు పార్టీ)
అమెరికా	: కామ్రేడ్ హెయిలీ స్కాట్ జోసఫ్, కామ్రేడ్ రమాకాంత్ శర్మ (కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ అమెరికా)
పాలస్తీనా	: కామ్రేడ్ అఖిల్ మహమూద్ అహ్మద్ తుజోగ్ (పీపుల్స్ పార్టీ ఆఫ్ పాలస్తీన్)
గ్రీస్	: కామ్రేడ్ నికోస్ సేరెటకీస్ (కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ గ్రీస్)
వియత్నాం	: కామ్రేడ్ లామ్ వాన్ మాన్ (కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ వియత్నాం) కామ్రేడ్ లీ తన్ టంగ్ , కామ్రేడ్ కావో జియాన్ మై, కామ్రేడ్ న్యూగుయెన్ ట్రాన్ జియాన్ సన్, కామ్రేడ్ దుంగ్ న్యూగుయెన్ న్హాఖ
లావోస్	: హిజ్ ఎక్సలెన్సీ బున్నేమెన్‌చోంగ్‌హామ్, కామ్రేడ్ కె.మహావోంగ్
దక్షిణాఫ్రికా	: కామ్రేడ్ సింఫే మైకేల్ మదాలా-(ఎస్ఏసీపీ), కామ్రేడ్ ఫ్రిమ్‌రోజ్ నోమరషియా కలూజ
నేపాల్	: కామ్రేడ్ యుబ రాజ్ గ్యావాలీ (కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్-యూఎంఎల్) కామ్రేడ్ యువరాజ్ బస్కోటా
కొరియా	: హిజ్ ఎక్సలెన్సీ చో హుయ్ చోల్ (వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా) కామ్రేడ్ జోంగ్ యంగ్ రోయాంగ్
పోర్చుగల్	: కామ్రేడ్ నెవీస్ గురేరియో పెడ్రో మిగుయల్ (పోర్చుగ్రీస్ కమ్యూనిస్టు పార్టీ)
శ్రీలంక	: కామ్రేడ్ డీఎంపీ దిశనాయకే (కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ శ్రీలంక) కామ్రేడ్ డబ్ల్యూఎం చందన విజన్‌కూన్
బంగ్లాదేశ్	: కామ్రేడ్ షా ఆలమ్ (కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ బంగ్లాదేశ్) కామ్రేడ్ హసన్ చౌదరి
టర్కీ	: కామ్రేడ్ అకద్ మురాద్ (కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ టర్కీ)

మహాసభలు విజయవంతం చేద్దాం

యువ కమ్యూనిస్టుల బైక్ ర్యాలీ ప్రారంభోత్సవంలో పార్టీ మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖరరావు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : రా... కదలిరా... కమ్యూనిస్టు పార్టీ పిలుస్తోంది... జాతీయ మహాసభల్లో భాగస్వాములవుదాం... అంటూ కేరళలోని కొల్లంలో ప్రారంభించిన కమ్యూనిస్టుల రెడ్‌ఫ్లాగ్ మార్చ్ ఒంగోలు నుంచి గురువారం విజయవాడకు బయలుదేరింది. ర్యాలీని సీపీఐ మాజీ ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పీజే చంద్రశేఖరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఒంగోలులోని కలెక్టరేట్ నుంచి ట్యాంక్ రోడ్డు, నెల్లూరు బస్టాండ్, బాబుజీ కాంప్లెక్స్, అద్దంకి బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, మహాభారత్ థియేటర్, గుంటూరు రోడ్డు మీదుగా విజయవాడకు పయనమైంది. ఈ సందర్భంగా పీజే చంద్రశేఖరరావు మాట్లాడుతూ భారతదేశ గుండె చప్పుడు యంగ్ కమ్యూనిస్టు ఫ్లాగ్ మార్చ్ అని అన్నారు. ఉద్యమాల గడ్డ విజయవాడలో శుక్రవారం నుంచి ఐదు రోజులపాటు జరిగే సీపీఐ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా, పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి లక్ష్యంగా కమ్యూనిస్టు పార్టీ చేస్తున్న పోరాటాలు మరువలేనిమన్నారు. మహాసభల విజయవంతం కాంక్షిస్తూ 1700 వందల కిలోమీటర్లు బైక్ ర్యాలీ నిర్వహించటం చారిత్రాత్మక ఘట్టమన్నారు. ఈ ర్యాలీకి నాయకత్వం వహిస్తున్న ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై మాట్లాడుతూ కేరళ రాష్ట్రం కొల్లాం నుంచి బయలుదేరిన ర్యాలీకి అడుగడుగునా కమ్యూనిస్టులు పేదలు, కార్మికులు, ఉద్యోగులు, కర్షకులు స్వాగతం పలుకుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించగానే చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పార్టీ శ్రేణులు పలికిన స్వాగతం మరువలేనిది అన్నారు. విజయవాడలో 14వ తేదీ శుక్రవారం సాయంత్రం జరిగే బహిరంగ సభలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టుల స్కూటర్ ర్యాలీలో భాగస్వామ్యమైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ బీజేపీని అధికారం నుంచి తరిమికొట్టడానికి ప్రణాళిక రూపొందిస్తామన్నారు. సీపీఐ జాతీయ మహాసభలు విజయవాడ కేంద్రంగా జరుపుకోవడం, అనేక రాజకీయ తీర్మానాలను ఆమోదించనుండటం ప్రాధాన్యత సంతరించుకుందన్నారు.

పార్టీ జిల్లా కార్యదర్శి ఎం. ఎల్.నారాయణ మాట్లాడుతూ 14వ తేదీన విజయవాడలో జరిగే భారీ ర్యాలీ, బహిరంగ సభలో ప్రకాశం జిల్లా నుంచి వేలాదిగా ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామలింగం వెంకట్రావు, పీవీఆర్ చౌదరి, ఆర్.రామకృష్ణ, హనుమారెడ్డి, లక్ష్మారెడ్డి, రాజేంద్ర, కరుణానిధి, పురిని గోపి, నాగేశ్వరరావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, సుమన్ నాయుడు పాల్గొన్నారు.

'మహా' శోభ

సీపీఐ జాతీయ మహాసభల సందర్భంగా విద్యుద్దీప తోరణాలతో కాంతులీనుతున్న విజయవాడలోని విశాలాంధ్ర ప్రధాన కార్యాలయం

నేడు ట్రాఫిక్ మళ్లింపు

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: నగరంలోని కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టినట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా ఒక ప్రకటలో పేర్కొన్నారు. విజయవాడ సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఈ నెల 14వతేదీ నుంచి 18వ తేదీ వరకు సీపీఐ 24వ జాతీయ మహాసభలు జరుగనుండగా తొలిరోజు శుక్రవారం మహా ప్రజా ప్రదర్శన, స్టేడియంలో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రజలకు అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టినట్లు తెలిపారు. స్టేడియంకు దారితీసే మార్గంలో సీతన్నపేట గేటు నుంచి బుడమేరు జంక్షన్ వరకు ఏ విధమైన వాహనాలకు అనుమతి లేదన్నారు. ఏలూరు లాకుల నుండి సి.కె. రెడ్డి రోడ్డు, జి.ఎస్. రాజు రోడ్డు లోకి, బుడమేరు వైపుకు , గవర్నమెంట్ ప్రెస్ వైపుకు వాహనాలకు ప్రవేశం ఉండదని తెలిపారు.

వాహనాల మళ్లింపు ఇలా:

- రైల్వే స్టేషన్ వైపు నుండి సింగ్ నగర్ వైపుకు సి.కె.రెడ్డి రోడ్డు ద్వార వెళ్లే వాహనదారులను ఏలూరు లాకులు - అలంకార్ సెంటర్ - సాంబ మూర్తి రోడ్డు
- బోసు బొమ్మ సెంటర్ - ఘంటసాల సంగీత కళాశాల రోడ్ - ఫుడ్ జంక్షన్ - మధురానగర్ -పడవలరేవు - గుణదల సెంటర్ -రామవరప్పాడు రింగ్ - ఇన్నర్ రింగ్ రోడ్ - కండ్రిగ- పైపుల రోడ్డు మీదుగా మళ్లిస్తారు.
- చిట్టినగర్ వైపు నుండి ఎర్రకట్ట మీదుగా నగరంలోకి వచ్చే వాహనాలను కాళేశ్వరరావు మార్కెట్ , ఎర్రకట్ట మీదుగా సింగ్‌నగర్, నూజివీడు వెళ్లే వాహనాలు సి.వి.ఆర్ ఫ్లైఓవర్ మీదుగా, వై.వి.రావు. ఎస్టేట్, పైపుల రోడ్డు మీదుగా మళ్లిస్తున్నారు.
- ఫుడ్ జంక్షన్ నుండి సింగ్ నగర్, నూజివీడు వెళ్లే వాహనాలు మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు బి.ఆర్.టి.ఎస్. రోడ్డు, రామవరప్పాడు రింగ్, ఇన్నర్ రింగ్ రోడ్ ఫ్లై ఓవర్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.
- మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 9 గంటల వరకు నున్న నూజివీడు వైపునుండి కండ్రిక జంక్షన్ మీదుగా నగరంలోకి వచ్చే వాహనాలను కండ్రిక జంక్షన్ నుంచి మళ్లించి ఇన్నర్‌రింగ్‌రోడ్, రామవరప్పాడు రింగ్ మీదుగా నగరంలోకి అనుమతిస్తారు.
- పైపుల్ రోడ్, పాయకాపురం మీదుగా వన్ టౌన్‌కు వెళ్లే వాహనాలు వై.వి.రావు. ఎస్టేట్, సి.వి.ఆర్. ఫ్లై ఓవర్, మిల్క్ ఫ్యాక్టరీ మీదుగా అనుమతించారు.

ర్యాలీ, సభకు వచ్చే వాహనాలకు పార్కింగ్ ప్రదేశాలు

- ఇబ్రహీంపట్నం నుండి వచ్చే బస్సులు, లారీలు గొల్లపూడి వై. జంక్షన్ నుండి గొల్లపూడి బైపాస్ - సి.వి.ఆర్. ఫ్లైఓవర్ - వై.వి.రావు ఎస్టేట్- పైపుల రోడ్డు నుండి వాంబే కాలనీ ఎక్సెల్ ప్లాంట్ మధ్య రోడ్డులో పార్క్ చేయాలి.
- ఇబ్రహీంపట్నం నుండి కార్లు, ఇతర వాహనాలపై వచ్చే వారు గొల్లపూడి వై. జంక్షన్ నుండి గొల్లపూడి బైపాస్ -సి.వి.ఆర్. ఫ్లైఓవర్ -మిల్క్ ప్రాజెక్ట్ - చిట్టినగర్
- ఎర్రకట్ట -ఎఫ్‌సీఐ గోడౌన్ - మీసాల రాజారావు బ్రిడ్జి వద్ద నుండి బి.ఆర్.టి.ఎస్. మధ్య రోడ్డు లో పార్క్ చేయాలి.
- గుంటూరు, ప్రకాశం జిల్లాల నుండి వచ్చే బస్సులు, లారీలు వారధి మీదుగా వచ్చి బెంజ్ సర్కిల్ న్యూ ఫ్లైఓవర్ మీదుగా మహానాడు జంక్షన్ - రామవరప్పాడు రింగ్ - వద్దనుండి ఇన్నర్ రింగ్ రోడ్డు - కండ్రిక జంక్షన్ - పైపుల రోడ్డు జంక్షన్ నుండి వాంబే కాలనీ, ఎక్సెల్ ప్లాంట్ రోడ్డు లో పార్క్ చేయాలి.
- గుంటూరు, ప్రకాశం జిల్లాల వచ్చే కార్లు, టాటా మ్యాజిక్‌లు వారధి మీదుగా వచ్చి బెంజ్ సర్కిల్ న్యూ ఫ్లైఓవర్ మీదుగా మహానాడు జంక్షన్ -రామవరప్పాడు రింగ్ -పడవలరేవు జంక్షన్, ఆర్.టి.ఎస్. మీదుగా మధురా నగర్ జంక్షన్ వద్ద దిగి వారి వాహనాలను బి.ఆర్.టి.ఎస్ మధ్య రోడ్డు లో పార్క్ చేయాలి.
- నూజివీడు వైపు నుండి వాహనాలు పైపుల్ రోడ్డు వైపు నుండి వచ్చి వాంబే కాలనీ కి వెళ్లే ఎక్సెల్ ప్లాంట్ రోడ్డు లో పార్క్ చేయాలి.
- విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి , కృష్ణా జిల్లాల నుండి వచ్చే లారీలు, బస్సులు రామవరప్పాడు రింగ్ నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు - కండ్రిక జంక్షన్ - పైపుల రోడ్డు జంక్షన్, వాంబే కాలనీ, ఎక్సెల్ ప్లాంట్ రోడ్డులో పార్క్ చేయాలి. ఇక కార్లు, టాటా మ్యాజిక్ వాహనాలు రామవరప్పాడు రింగ్ -పడవలరేవు జంక్షన్, బి.ఆర్.టి.ఎస్ రోడ్డులో హెచ్.ఐ.జి క్యాన్సర్ జంక్షన్ నుండి పడవలరేవు వరకు మధ్య రోడ్డు లో పార్క్ చేసుకోవాలి.

సీపీఐ జాతీయ మహాసభలకు రూ. 2 లక్షల విరాళం

విశాలాంధ్ర-చల్లపల్లి: విజయవాడలో ఈ నెల 14 నుంచి 18 వరకు జరుగనున్న సీపీఐ 24వ జాతీయ మహాసభల విజయవంతం కోరుతూ విరాళాలు వెల్లువెత్తాయి. దాతలు అందజేసిన మొత్తం రూ.2 లక్షలు సీపీఐ అవనిగడ్డ నియోజకవర్గ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబుకు గురువారం కాంచనరావు దంపతులు అందజేశారు. కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం నిమ్మగడ్డకు చెందిన కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు, దివి తాలూకా కమ్యూనిస్టు పార్టీ ప్రథమ కార్యదర్శి మాలెంపాటి సీతారామయ్య కుటుంబ సభ్యులు మాలెంపాటి కాంచనరావు- అక్కమాంబ దంపతులు రూ. లక్ష, అమరజీవి చల్లపల్లి నారాయణరావు కుమారుడు రామచంద్రరావు రూ.20 వేలు, కృష్ణాజిల్లా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సభ్యుడు మాలెంపాటి కాంచనరావు కుటుంబ సభ్యులు రూ. 80 వేలు అందించి దాతృత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు, కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధికి, జాతీయ మహాసభల విజయవంతానికి తమ వంతు సహకారాన్ని అందించిన దాతలకు అభినందనలు తెలిపారు. సీపీఐ నాయకులు కోడె రాధా, లంక నాగమల్లి పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య రూ. 50 వేలు...

ఇదిలా ఉండగా, అవనిగడ్డ నియోజకవర్గ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో రూ.50 వేలు విరాళంగా అందించారు. మహిళా సమాఖ్య జిల్లా

ప్రధాన కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి, కోశాధికారి కంఠంనేని జ్యోత్స్నదేవి, మహిళా సమాఖ్య నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కంచర్ల ప్రభుకుమారి తదితరులు సేకరించిన రూ.50 వేలలో రూ.25 వేలు జిల్లా మహిళా సమాఖ్య తరుపున ఏపీ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి దుర్గాభవానికి, జిల్లా మహిళా సమాఖ్యకు రూ.25 వేలు అందజేశారు.

సీపీఐ జాతీయ మహాసభలకు డీహెచ్‌పీఎస్ రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీపీఐ 24వ జాతీయ మహాసభలకు దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రూ.లక్ష విరాళాన్ని ప్రకటించింది. ఈ మేరకు ఆహ్వాన సంఘం కోశాధికారి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్‌కు డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేవీ ప్రభాకర్, కరవది సుబ్బారావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప గురువారం చెక్కు అందజేశారు.

సీపీఐకి కృష్ణన్ రూ.10వేల విరాళం

విజయవాడ: సీపీఐ 24వ జాతీయ మహాసభలు విజయంతం కావాలని ఆకాం క్షిస్తూ సీపీఐకి పార్టీ సభ్యుడు ఆర్ఎన్ కృష్ణన్ పది వేలరూపాయల విరాళాన్ని అందించారు. ఈ విరాళాన్ని విశాలాంధ్ర పత్రిక కార్యాలయంలో గురువారం ప్రోగ్రెసివ్ ఫోరం నాయకులు బుడ్డిగ జమిందారుకు అందజేశారు. స్టేట్ బ్యాంకులో పనిచేసి పదవీ విరమణ పొందిన కృష్ణన్ సీపీఐలో కొనసాగుతూ ప్రోగ్రెసివ్ ఫోరం కార్యకలాపాల్లోనూ పాల్గొంటున్నారు. కమ్యూనిస్టులందరూ ప్రత్యేకించి సీపీఐ, సీపీఎం ఐక్యంగా పనిచేయాలన్న ఆకాంక్షను కృష్ణన్ వ్యక్తం చేశారు.

గన్నవరం విమానాశ్రయంలో విదేశీ ప్రతినిధులకు ఘనస్వాగతం పలుకుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, అక్కినేని వనజ, అతుల్ కుమార్ అంజన్, బుడ్డిగ జమిందార్ తదితరులు

మహాసభలకు తరలివస్తున్న ప్రతినిధులు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): నగరంలో ఈనెల 14 నుంచి 18 వరకు జరగనున్న సీపీఐ 24వ జాతీయ మహాసభలను విజయవంతం చేయడానికి అనేక రాష్ట్రాల నుంచి తరలివస్తున్న ప్రతినిధులకు విజయవాడ రైల్వేస్టేషన్‌లో నాయకులు ఘన స్వాగతం పలుకుతున్నారు. రైల్వేస్టేషన్లో గురువారం రిసెప్షన్ కౌంటర్ ఏర్పాటు చేశారు. దానిలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, ఇన్సాఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ అఫ్సర్, ఏఐవైఎఫ్ నగర జాయింట్ సెక్రెటరీ షేక్ అలీ, ఏఐవైఎఫ్ సిటీ సెక్రెటరీ ఎండీ మెయిమ్, ఏఐవైఎఫ్ నాయకులు తిలక్, కోట్రేస్ స్వయంగా రైలు దగ్గరకు వెళ్లి

ప్రతినిధులకు సాదరంగా ఆహ్వానం పలుకుతున్నారు. అనంతరం వారి కేటాయించిన వసతి గృహాలకు స్వయంగా తోడుకుని వెళ్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ జాతీయ మహాసభలకు దేశ విదేశాల నుంచి ప్రముఖులతోపాటు అనేక రాష్ట్రాల నుంచి నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారన్నారు. ఈ సభలో జాతీయ స్థాయిలో ఉన్న ప్రధాన సమస్యలను చర్చించడంతో పాటు అనేక తీర్మానాలు చేసి భవిష్యత్తు కార్యచరణ రూపొందించే అవకాశం ఉందని తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

వ్యతిరేకతను నియంత్రించడానికి ఉత్తమ మార్గం దానికి మనమే నాయకత్వం వహించడం.

వి.ఐ.లెనిన్

సీపీఐ 24వ జాతీయ మహాసభలు

అక్టోబర్ 14 - 18, 2022 విజయవాడ

ఉద్యమమే ఊపిరి... అది ఆగేదికాదు

'విశాలాంధ్ర' ఇంటర్వ్యూలో సీపీఐ మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ

డాక్టర్ కె.నారాయణ....రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆయన పేరు తెలియనివారెవ్వరూ ఉండకపోవచ్చు. ప్రజల చుట్టూ, ప్రజా సమస్యల చుట్టూ, ఉద్యమాల చుట్టూ ఆయన తిరుగుతూ వుంటారు. వివాదాలు మాత్రం ఆయన చుట్టూ తిరుగుతూ వుంటాయి. ఏతావాతా ఏం జరిగినా...వెన్నుచూపని, వెనుతిరగని నాయకుడు కె.నారాయణ. 2022 అక్టోబరు 14 నుంచి 18వ తేదీ వరకు ఉద్యమాల పుట్టినిల్లు విజయవాడ నగరంలో జరుగుతున్న సీపీఐ 24వ జాతీయ మహాసభల ఆహ్వానసంఘం అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. కనీవినీ ఎరుగనిరీతిలో ఈ మహాసభల నిర్వహణకు ఆయన పట్టుదలతో పనిచేస్తున్నారు. ప్రస్తుతం సీపీఐ జాతీయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నారాయణ 'విశాలాంధ్ర'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పార్టీతో తన అనుబంధం, గతానుభవాలు, పోరాట నేపథ్యాలు, భవిష్యత్ కార్యాచరణ, మహాసభల 'థీమ్', 'కాన్సెప్ట్'ల గురించి సవివరంగా తెలియజేశారు.

మీరెలా కమ్యూనిస్టు అయ్యారు?

నారాయణ: నిజానికి చిన్నప్పుడు నాదొక అలౌకిక ప్రపంచం. దేవునిపై విపరీతమైన భక్తిశ్రద్ధలు. ఉదయాన్నే పోయి గుడిని శుద్ధిచేయడం, పండుగలన్నింటినీ పాటించడం వంటివి చేసేవాడ్ని. కర్మసిద్ధాంతం నమ్మేవాడ్ని. ఎస్ఎల్‌సీ పాసయినప్పుడు దేవుని దయవల్ల పాసయ్యానని గుండు కొట్టించుకున్న సందర్భం కూడా వుంది. అయితే గుంటూరు వచ్చాక నా జీవితమే మారిపోయింది. భౌతికవాదం గురించి తెలుసుకున్నాను. గుంటూరులో ఏఐఎస్ఎఫ్‌లో చేరినప్పటి నుంచి కమ్యూనిజంవైపు మొగ్గుచూపాను. చివరకు కరుడుగట్టిన కమ్యూనిస్టుగా మారిపోయాను.

మొదట్లో అందరూ మిమ్మల్ని గుంటూరువాసి అనుకునేవారు కదా!

నారాయణ: అవును. చిత్తూరు జిల్లా నగరి మండలం అయినంబాకం గ్రామంలో 1949 డిసెంబరు 7వ తేదీన జన్మించాను. మా తండ్రి కంకణాల సుబ్బానాయుడు, తల్లి ఆదిలక్ష్మి. ప్రాథమిక విద్య దామరపాకం గ్రామంలో పూర్తికాగా, హైస్కూలు విద్య నగరి జెడ్పీ హైస్కూలులో, పీయూసీ మదనపల్లి బీటీ కాలేజీలో పూర్తయింది. ఆ తర్వాత ఆయుర్వేదిక్ మెడిసన్ (బీఎంఎంఎస్)ను గుంటూరు ఎస్ఆర్ ఆయుర్వేదిక్ మెడికల్ కాలేజీలో పూర్తిచేశాను. అలా మెడిసిన్ చదువు కోసం గుంటూరు వచ్చిన నేను ఏఐఎస్ఎఫ్ నాయకుడు స్టాలిన్‌బాబు ద్వారా ఆ సంఘంలో చేరాను. వాస్తవానికి మాది రాజకీయేతర కుటుంబం. అందరూ వ్యవసాయం, వ్యాపారం చేసుకునేవారే. అన్నదమ్ముల్లో ఆఖరివాడిని. 1972 వరకు ఏఐఎస్ఎఫ్ గుంటూరు పట్టణ కార్యదర్శిగా, గుంటూరు జిల్లా కార్యదర్శిగా పనిచేసి, విద్యార్థి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నాను. 1973లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నాక మకాం హైదరాబాద్‌కు మార్చాను. గుంటూరు నుంచి వచ్చినందున అందరూ నన్ను గుంటూరు వాసేనని అనుకునేవారు. ఏఐఎస్ఎఫ్ కార్యదర్శిగా చేస్తూనే బీఏఎంఎస్ హౌస్‌సర్జన్ పూర్తిచేశాను. నేనిప్పుడు క్వాలిఫైడ్ డాక్టర్‌ని. నాది చిత్తూరు జిల్లా అన్న విషయాన్ని సీపీఐ రాష్ట్ర నాయకత్వం ఆలస్యంగా తెలుసుకున్నది. దాంతో తమ్మారెడ్డి, గిరిప్రసాద్ పట్టుబట్టి మరీ చిత్తూరు జిల్లాకు వెళ్లాలని ఆదేశించారు. ఎమర్జెన్సీ కాలంలో తిరుపతి కేంద్రంగా రాయలసీమ స్టూడెంట్స్, యూత్ సంఘాల బాధ్యునిగా పనిచేశాను. 1983లో జిల్లా పార్టీ సహాయ కార్యదర్శిగా, ఆ తర్వాత 86లో కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాను. ఆ ఏడాదే తణుకులో జరిగిన పార్టీ మహాసభలలో కార్యవర్గంలోకి తీసుకున్నారు. 1999 నుంచి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యునిగా బాధ్యతలు అప్పగించారు. సురవరం సుధాకరరెడ్డి రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నప్పుడు నేను సహాయ కార్యదర్శిగా పనిచేసి, ఆయన అప్పగించిన ప్రతి పనినీ నిబద్ధతతో పూర్తిచేశాను. నల్గొండ మహాసభల తర్వాత రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాను. రాష్ట్ర విభజన వరకు నేనే పార్టీ కార్యదర్శిగా పనిచేశాను. పుదుచ్చేరి జాతీయ మహాసభల్లో పార్టీ జాతీయ కార్యదర్శిగా తీసుకున్నారు. ఇప్పటివరకు ఆ బాధ్యతల్లో కొనసాగుతున్నాను.

మీకు స్ఫూర్తి ప్రదాత ఎవరు?

నారాయణ: మొదట్లో రాజకీయాలంటే అస్సలు ఆసక్తిలేదు. ఏఐఎస్ఎఫ్‌లో చేరిన తర్వాతనే నా దృష్టి అటు మళ్లింది. పోరాటయోధుడు చండ్ర రాజేశ్వరరావు హీరోయిజం నాకిష్టం. నీలం రాజశేఖర్‌రెడ్డి, తమ్మారెడ్డి, గిరిప్రసాద్, సురవరం సుధాకరరెడ్డి మార్గదర్శకత్వంలో రాటుదేలాను. ముఖ్యంగా సుధాకరరెడ్డి నన్ను ఎల్లవేళలా ప్రోత్సహిస్తూనే వున్నారు. రాయలసీమలో ఎద్దుల ఈశ్వరరెడ్డి, వీకే ఆదినారాయణరెడ్డి, ఐదుకల్లు సదాశివన్, ఎన్.శివరామిరెడ్డి, జె.వెంకట్రామరెడ్డి, చిత్తూరులో ఎ.కృష్ణారెడ్డి, గంథమనేని శివయ్య, స్వామిరెడ్డి వంటి ఆదర్శమూర్తులంతా నాకు స్ఫూర్తినిచ్చారు. రాయలసీమ జలాల కోసం చేసిన పోరాటంతో వీరందరి సమన్వయంతో పనిచేశాను. సాన్నిహిత్యం ఎక్కువ. పార్టీ నాయకునిగా కాకుండా కుటుంబరీత్యా సన్నిహితంగా ఉండేవాళ్లం. బంధువుల కన్నా ఎక్కువగా వుండటం వల్ల వారితో మమేకమై పనిచేయడం గర్వకారణంగా వుంది.

ఉద్యమ ప్రస్థానమంతా దూకుడేనా?

నారాయణ: నేను పాల్గొన్న ప్రజా ఉద్యమాలకు లెక్కే లేదు. సమస్య ఎక్కడుంటే నారాయణ అక్కడుంటాడు. ఆ సమస్యను పరిష్కరించాకే తిరిగొస్తాడు. అందరిదృష్టిలో అదే ఉండేది..ఇప్పటివరకు అదే చేశాను. ఏఐఎస్ఎఫ్‌లో ఉండగా గుంటూరులో హోటల్ రేట్లు తగ్గించాలని వారం రోజులపాటు పెద్ద ఉద్యమం నడిపాను. టిఫిన్‌పై పది పైసలు పెంచినా పోరాటమే. చివరకు చాలా హోటళ్లు మూయించాం. ఆనాటి నుంచే ఉపన్యాసకునిగా తయారయ్యాను. సీపీఐ పిలుపు మేరకు దొంగ నిల్వల వెలికతీత (డీహోర్డింగ్), భూ ఆక్రమణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాను. తొలుత గుంటూరు. ఆ తర్వాత హైదరాబాద్‌లో ఉద్యమ ప్రస్థానం సాగింది.

ఈ మహాసభల్లో కొత్త తీర్మానాలేమైనా చేస్తారా?

నారాయణ: అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు, రాష్ట్ర విభజన హామీల అమలు వంటి డిమాండ్లపై తీర్మానాలు చేస్తాం. ఇక జాతీయ స్థాయిలో మతోన్మాదం, అవినీతి, బీజేపీ నిరంకుశ దాడులు వంటి అంశాలపై తీర్మానాలు చేసే ఆలోచనలో వున్నాం.

- మిగతా 11లో

సీపీఐ 24వ జాతీయ మహాసభలు 2022 అక్టోబరు 14 నుంచి 18వ తేదీ వరకు పోరాటాల పురిటగడ్డ విజయవాడ నగరంలో జరుగుతున్నాయి. ఇప్పటివరకు విజయవాడ రెండుసార్లు సీపీఐ జాతీయ మహాసభలకు (1961, 1975) ఆతిథ్యమిచ్చింది. ముచ్చటగా మూడోసారి బెజవాడ అతిపెద్ద రాజకీయ చర్చకు వేదిక కాబోతున్నది. దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి దాదాపు 1000 మంది ప్రతినిధులు, 20 దేశాల నుంచి విదేశీ ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరవుతున్నారు. తొలి రోజు జరుగుతున్న భారీ ప్రదర్శన, బహిరంగ సభకు లక్షమంది ప్రజలు తరలివస్తున్నారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితుల దృష్ట్యా సీపీఐ మహాసభలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ నేపథ్యంలో మహాసభల నిర్వహణకు నాయకత్వం వహిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ 'విశాలాంధ్ర'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కమ్యూనిస్టుపార్టీతో తన అనుబంధంతోపాటు దేశ, రాష్ట్ర రాజకీయ, ఇతర పరిస్థితులపై అనేక విషయాలు వెల్లడించారు. ఈ ఇంటర్వ్యూలోని ప్రధానాంశాలను ఇక్కడ ప్రచురిస్తున్నాం...

ప్రజా పోరాటాల్లో తగ్గేదేలే

విశాలాంధ్ర ఇంటర్వ్యూలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

మీరెలా కమ్యూనిస్టు అయ్యారు?

రామకృష్ణ: విద్యార్థి ఉద్యమాల ద్వారా ఏఐఎస్ఎఫ్ పట్ల ఆకర్షితుడనై కమ్యూనిస్టునయ్యాను. రంగయ్య, గౌరమ్మ మా తల్లిదండ్రులు, వారు రైతులు. 1957లో కర్నూలు జిల్లా ఆలూరు మండలం మొలగవల్లి గ్రామంలో పుట్టాను. హైస్కూలు విద్య మొలగవల్లిలోనూ, ఇంటర్ ఆలూరులో పూర్తి చేశాక, డిగ్రీ చదువు కోసం అనంతపురం వెళ్లి అక్కడే స్థిరపడ్డాను. ప్రధానంగా విద్యార్థి ఉద్యమాలు చేపట్టిన ఏఐఎస్ఎఫ్ అంటే ఎంతో అభిమానం. అందులో చేరిన తర్వాత ఎస్కే యూనివర్శిటీలో స్టూడెంట్స్ యూనియన్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యాను. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులుగా, జాయింట్ సెక్రటరీగా పనిచేసిన తర్వాత ఏఐవైఎఫ్‌లో కొద్దికాలం మాత్రమే ఉన్నాను. 1975లో సీపీఐ సభ్యత్వం తీసుకొని, పూర్తిస్థాయిలో పార్టీ కార్యకలాపాల్లో పాల్గొన్నాను. 1984-85లో అనంతపురం జిల్లా జాయింట్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టాను. అప్పటి జిల్లా కార్యదర్శి వెంగమనాయుడు ఎక్కువగా తన స్వగ్రామంలో ఉండటం వల్ల జిల్లా కేంద్రంలో దాదాపు అన్ని కార్యకలాపాల్లోనూ నేను పాల్గొనేవాడిని. ఆ విధంగా ప్రజాదరణ పొందడంతో 35వ యేటనే అంటే 1992లోనే జిల్లా పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు.

చిన్నప్పుడే ఎమ్మెల్యే అయ్యారు కదా!

రామకృష్ణ: అవును. సీపీఐ అనంతపురం జిల్లా కార్యదర్శిగా రెండేళ్లు పూర్తికాకుండానే, 1994లో అనంతపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం దక్కింది. ఘన విజయం సాధించాను. దీంతో 37వ యేటనే శాసనసభలో అడుగుపెట్టాను. ఎమ్మెల్యేగా అనేక ప్రజాసమస్యలను అసెంబ్లీలో లేవనెత్తాను. ముఖ్యంగా రాయలసీమ కరువు, సాగుజలాలు, రైతు సమస్యలపై శాసనసభ సాక్షిగా పోరాడాను. నియోజకవర్గ ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ శాయశక్తులా సేవలందించాను. అదంతా కమ్యూనిస్టు పార్టీ ఘనతే. 1995లో ఢిల్లీలో జరిగిన సీపీఐ జాతీయ మహాసభల్లో నన్ను జాతీయ కౌన్సిల్‌కు తీసుకున్నారు. రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో కార్యవర్గ సభ్యునిగా ఎన్నికయ్యాను. కొద్దికాలానికే రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యునిగా బాధ్యతలు అప్పగించారు. రాష్ట్ర విభజనకు ముందు సీపీఐ ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శిగా డాక్టర్ కె.నారాయణ ఉన్నప్పుడే, నేను సహాయ కార్యదర్శిగా ఉండేవాడిని. విభజనానంతరం 2014లో విజయవాడ మహాసభల్లో సీపీఐ ఏపీ కార్యదర్శిగా నన్ను ఎన్నుకున్నారు. 2018 కడప మహాసభల్లో రెండోసారి, 2022 ఆగస్టులో విశాఖలో జరిగిన మహాసభల్లో మూడవసారి కార్యదర్శిగా ఎన్నికయ్యాను. ప్రస్తుతం జాతీయ కార్యవర్గసభ్యునిగా కొనసాగుతున్నాను. సంక్షిప్తంగా ఇదీ నా పొలిటికల్ కెరీర్.

మీలో స్ఫూర్తి రగిలించిందెవరు?

రామకృష్ణ: రాయలసీమ కమ్యూనిస్టు యోధులు ఐదుకల్లు సదాశివన్, వీకే ఆదినారాయణరెడ్డి నాకు మార్గదర్శకత్వం వహించగా, నీలం రాజశేఖర్‌రెడ్డి ప్రోత్సాహం ఎనలేనిది. ఇక ప్రజానాయకుడిగా మంచి ఆదరణ ఉన్న తరిమెల నాగిరెడ్డి, సుదీర్ఘకాలం ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసి, గొప్ప పాలనదక్షునిగా నిలిచిన జ్యోతిబసు రాజకీయ జీవితాలు నాలో ఎక్కువగా స్ఫూర్తినింపాయి.

మీ రాజకీయ జీవితంలో గొప్పగా నిలిచిన ప్రజాఉద్యమాలు ఏవి?

రామకృష్ణ: విద్యార్థి నాయకునిగా ఎన్నో ఉద్యమాలు చేశాం. నిజానికి అవి లెక్కకు దొరకవు. కేసులు, జైళ్ల నిర్బంధాలు కోకొల్లలు. హాస్టల్ సమస్యలు, రాయలసీమ వెనుకబాటుతనం, కరువు, పరిశ్రమలు, రాయలసీమకు కృష్ణాజలాల తరలింపు, ఉపాధి అవకాశాలు వంటి ఎన్నో అంశాల ప్రాతిపదికగా చేపట్టిన ఉద్యమాల్లో నా పాత్ర ఉంది. అనంతపురంలో కౌకుంట భూపోరాటం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. వెయ్యి

- మిగతా 11లో

తెలంగాణకు మద్దతు నష్టం కలిగించిందా?

రామకృష్ణ: మాది జాతీయ పార్టీ. ప్రత్యేక తెలంగాణకు మద్దతునిచ్చాం. రాష్ట్ర విభజన తర్వాత సహజంగానే సీపీఐని రాష్ట్ర ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. సానుకూలత ప్రదర్శించలేకపోయారు. అయితే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఉద్యమంతో ప్రజలంతా మా వెంట నిలబడ్డారు. మళ్లీ మేం ఉద్యమపథం పట్టాం.



అమరావతిపై మీది ఒకే మాటా?

రామకృష్ణ: అవును. మాకు రెండునాల్కలుండవు. అమరావతి రాజధాని చేయాలన్న విధానంపై స్పష్టంగా ఉన్నాం. 1000 రోజుల సుదీర్ఘ పోరాటానికి మద్దతుగా ప్రత్యక్షంగా నిలబడిన ఏకైక పార్టీ మాదే. సీపీఐ ఒకే వైఖరితో ఉంది. ప్రధానపాత్ర పోషించింది. అప్పుడప్పుడూ వచ్చి మద్దతు తెలపడం, అవసరానికి వచ్చిన తోడ్పాటు ఇవ్వడం లాంటి విధానాలు మావికావు. అమరావతికి సంపూర్ణ మద్దతునిస్తున్నాం. ప్రత్యక్షంగా పోరాడుతున్నాం...భవిష్యత్‌లోనూ పోరాడుతాం. అలాగే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రత్యక్షంగా ఈనాటివరకు పోరాడుతూనే వున్నాం. ఇవికాకుండా, అట్టడుగువర్గాల అభ్యున్నతి కోసం సామాజిక హక్కుల వేదిక ద్వారా జనసమీకరణ చేస్తున్నాం. అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడుతున్నాం. లాల్-నీల్ నినాదాన్ని ముందుకు తీసుకుపోతున్నాం.

ప్రత్యేక హోదా ఉద్యమం కలిసొచ్చిందా?

రామకృష్ణ: విభజన హామీలు నెరవేర్చడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. దీంతో ప్రత్యేక హోదా కోసం ఉద్యమం చేపట్టాం. అన్ని జిల్లాల్లో బస్సుయాత్ర, రాష్ట్రబంద్ చేపట్టాం. ప్రత్యేక హోదా సాధన సమితి పిలుపునిచ్చినప్పటికీ, ఇందులో కేవలం సీపీఐ, కాంగ్రెస్ పార్టీలు మాత్రమే పాల్గొన్నాయి. ఢిల్లీకి ప్రత్యేక రైలులో వెళ్లి, అన్ని పార్టీలను పిలిచి ప్రత్యేక హోదా కోసం పోరాడాం.

సీపీఐ 24వ జాతీయ మహాసభలు



దేశ భవితకు భూమిక

డి.రాజా, సీపీఐ ప్రధాన కార్యదర్శి

భారత కమ్యూనిస్టు పార్టీ 24వ జాతీయ మహాసభలు ఈ నెల 14 నుంచి 18 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో జరుగుతున్నాయి. కేరళలోని కొల్లాంలో జరిగిన 23వ జాతీయ మహాసభల నుంచి ఆర్‌ఎస్‌ఎస్-బీజేపీ పాలనలో దేశ వ్యాప్తంగా మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై దాడులు జరుగుతున్నాయి. మైనారిటీలపై వివక్ష, విద్వేషాలు, ఎస్సీ, ఎస్టీ, మహిళల హక్కులు హరింపు, ప్రభుత్వ రంగ సంస్థల విభజన, ప్రైవేటీకరణ, మన రాజ్యాంగానికి నిస్సిగ్గుగా తూట్లు పొడిచే ప్రయత్నాలు తరచుగా జరుగుతున్నాయి.

బీజేపీ ప్రభుత్వ నయా ఉదారవాద క్రోనీ పెట్టుబడిదారీ విధానం ఫలితంగా మునుపెన్నడూ లేని విధానంలో దేశ జనాభాలోని ఒక్క శాతం సంపన్నుల వద్ద సంపద కేంద్రీకృతమైయింది. అంబానీ, అదాని పేర్లు ఆశ్రిత పక్షపాతం, అసమానతలతో పర్యాయపదంగా మారిపోయాయి. నిరుద్యోగం మునుపెన్నడూ లేని విధంగా తీవ్రంగా పెరిగింది. మోదీ ప్రభుత్వ అపసవ్య నిర్వహణ కారణంగా కోవిడ్-19 మహమ్మారి లక్షలాది మంది ప్రాణాలను, జీవనోపాధిని బలిగొన్నది. దేశాన్ని తీవ్ర సంక్షోభంలోని నెట్టింది. యావత్ ప్రపంచంలో సామ్రాజ్యవాద తీవ్ర దాడులు, మితవాద, అతిమితవాద శక్తుల పెరుగుదల పెరిగింది. మితవాద జనాకర్షణ పెరుగుదల, ప్రపంచంలో కొన్ని అతిపెద్ద ప్రజాస్వామ్యాల క్రమానుగత నిర్మూలన నేడు ఒక లక్షణంగా మారింది.

మితవాద శక్తుల తీవ్ర దాడులు జరుగుతున్నప్పటికీ, ఈ విషాద సమయంలోనూ వామపక్షాల నాయకత్వంలో జనాదరణ, సైద్ధాంతిక పోరాటాల రూపంలో ప్రపంచ వ్యాప్తంగా ఆశారేఖలు కూడా గోచరిస్తున్నాయి. వామపక్షాలు ప్రపంచ వ్యాప్తంగా నయా ఉదారవాదం, మత చాందసవాదం, జాత్యాహకారం, వివక్షత శక్తులకు వ్యతిరేకంగా వామపక్షాలు పోరాటాలు చేస్తున్నాయి. ద్రవ్య పెట్టుబడి వ్యాప్తి సృష్టించిన ఆత్రుతలకు వ్యతిరేకంగా వామపక్షాలు బలియమైన ప్రతిఘటనోద్యమం నిర్వహిస్తున్నాయి. లాటిన్ అమెరికన్ వంటి దేశాల్లో ఈ ఉద్యమాలు సంఘటితమయ్యాయి. సామ్రాజ్యవాద దాడులను ప్రతిఘటిస్తూ బలమైన ప్రజానుకూల విధాన ఎజెండాతో అధికారాన్ని హస్తగతం చేసుకున్నాయి. ప్రత్యామ్నాయాన్ని వారు సమర్పించడం వల్ల రాజకీయంగా, అమెరికా నేతృత్వంలోని ఆధిపత్యానికి వారి ప్రతిఘటనకు భౌగోళిక రాజకీయంగానూ ఈ పరిణామాలు ముఖ్యమైనవి.

ప్రపంచంలోని ఈ పరిణామాలకు భారతదేశం కూడా అతీతం కాదు. అన్ని ప్రజాస్వామ్య వ్యవస్థల అణచివేత, సమాజాన్ని విభజించడం మోదీ ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండా. మైనారిటీలకు వ్యతిరేకంగా విస్తృతమైన సంకేతం ద్వారా అధిక సంఖ్యాకులను ఐక్యం చేసేందుకు వారిలో మనోభావాలను రెచ్చగొడుతున్నారు. అత్యధిక సంఖ్యాకుల ఏకాండీ తత్వానికి మరో పేరైన హిందూత్వను ముందుకు తీసుకెళ్లేందుకు కుల, ప్రాంతీయ తప్పుడు విధానాలను వినియోగించడంలో ఆర్‌ఎస్‌ఎస్-బీజేపీలు వేగాన్ని పెంచాయి. బీజేపీ చెప్పుకుంటున్న అభివృద్ధి డొల్లతనం గురించి స్వయంగా బీజేపీనే చర్చించడం లేదు. ఉద్యోగాలు ఇవ్వడానికి బదులు యువతకు ఆర్‌ఎస్‌ఎస్-బీజేపీ విద్వేషాన్ని , ఉత్సుకతలను ఇస్తున్నది. దేశంలో పేదరికం, అసమానతలను నిర్మూలించడానికి బదులు ఆర్‌ఎస్‌ఎస్-బీజేపీ శాంతి, మత సామరస్యాన్ని నిర్మూలిస్తున్నది. ప్రజలు వారి అవసరాల పట్ల తమ నిబద్ధతలు, మన దేశంలో కూడా వామపక్షాలు సుదృఢంగా ఉన్నాయి. సోషలిజం కొరకు మన పోరాటాన్ని పటిష్టవంతం చేస్తూనే ప్రజాస్వామ్య, లౌకిక భారతదేశ పరిరక్షణకు చోదక శక్తిగా వ్యవహరిస్తున్నాయి.

ప్రభుత్వ రంగం మన దేశ ఆర్థిక వ్యవస్థకు గట్టి పునాది. బ్రిటీష్ పాలన నుంచి స్వాతంత్ర్యం పొందిన తర్వాత జాతీయకరణ చేయబడిన, ప్రణాళికబద్ధ పరిశ్రమ దేశం ముఖ్య రంగాలలో స్వయం సమృద్ధి సాధించడానికి దోహదం చేసింది. ప్రభుత్వ రంగంలో రిజర్వేషన్ విధానం ద్వారా అననుకూల వర్గాలు అవకాశాలను, ప్రాతినిధ్యాన్ని పొందాయి. క్రోనియిజం గట్టి మోతాదులతో నయా ఉదార వాదంపై సైద్ధాంతిక ఆధారం ఫలితంగా మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని క్రమానుగతంగా ధ్వంసం చేస్తున్నది. ఇది మన ఆర్థిక సార్వభౌమత్వానికి ముప్పుగా పరిణమించింది. సామాజిక భావనను ఇది వమ్ము చేస్తుంది. ఎట్టి సామాజిక బాధ్యతలేని బహుళజాతి కార్పొరేట్ దిగ్గజాలు మన దేశ సహజ వనరులను దోచుకుంటున్నారు. మన దేశంలోని అడవులు, గనులు, నదులు, క్షేత్రాలు వారి దోపిడీకి దారాదత్తం చేశారు. లాభాల వేటలో పర్యావరణానికి భారీగా నష్టం వాటిల్లుతున్నది.

పెట్టుబడిదారీ విధానం వికృత భావనలు మన తలుపు తడుతున్నాయి. ఇటీవల ఉపసంహరించిన వ్యవసాయ నల్లచట్టాలు ఒక చక్కటి ఉదాహరణ. గ్రామీణ భారతాన్ని కార్పొరేట్లకు అప్పగించడం వ్యవసాయ చట్టాల ఉద్దేశం. తయారీ, సేవల రంగాల తర్వాత దేశంలోని వ్యవసాయ, అనుబంధ కార్యకలాపాలపై ఆధిపత్యానికి పెట్టుబడిదారులు ఎదురు చూస్తున్నారు. దేశంలోని నిరుద్యోగ యువకులు, మహిళలు ప్రత్యేకించి, విద్యాధికులు స్తబ్దుగా ఉన్నారు. ఉపాధి అంశాలపై పెద్దఎత్తున నిరసనలను మనం చూశాం. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని మోదీ వాగ్దానం చేశారు. కానీ భారతదేశ ఆర్థిక వ్యవస్థ తీవ్రగతిన ధ్వంసం కావడంతో అది కార్యరూపం దాల్చలేదు. 'పుండుపై కారం చల్లినట్లు సాయుధ బలగాలలో రిక్రూట్‌మెంట్ కొరకు కాంట్రాక్టు పద్ధతిపై అగ్నిపథ్ పథకాన్ని బీజేపీ ప్రభుత్వం ప్రకటించింది. దేశంలోని యువత, విద్యార్థులకు ఇచ్చిన వాగ్దానాలకు ఇది ద్రోహం చేయడం తప్ప మరొకటి కాదు. వామపక్షాల నమూనా పరిపాలన రాజకీయ శక్తి మాత్రమే సుస్థిరమైన, ప్రజానుకూల పాలన అందించగలదని కోవిడ్-19 నిస్సందేహంగా రుజువుచేసింది. మితవాదుల విధానాలు లాభం, దురాశ ఆధారితమైనవి. కాగా వామపక్షాల నమూనా నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసేది. కేరళలో కోవిడ్ మహమ్మారిపై సమర్థవంతంగా పోరాడేందుకు అభివృద్ధి నమూనా పునర్మించబడింది. అది విజయవంతం కావడంతో యావత్ దేశం హర్షించింది. అనేక అంతర్జాతీయ వేదికలు కూడా విశ్వసించాయి.

భారతీయ భావనపై మరింత శక్తివంతంగా, కేంద్రం మద్దతుతో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దాడి కొనసాగుతున్నది. హిందీ, హిందూ, హిందుస్థాన్ అన్న వారి భావన ఏకాండీ తత్వంతో కూడినది. మన దేశ సాంస్కృతిక, భాషా పరమైన, ప్రాంతీయ వైవిధ్యాన్ని తుడిచిపెట్టాలని కోరుకుంటారు. బహుళత్వం, సమానత్వంలకు ఆర్‌ఎస్‌ఎస్ ధిక్కారం ఎటువంటిదంటే మన రాజ్యాంగ లౌకిక, సంక్షేమ, ఫెడరల్ లక్షణాన్ని ధ్వంసం చేసేది. ఆర్‌ఎస్‌ఎస్ దేశ వ్యాప్తంగా మైనారిటీలపై దాడులు జరుపుతున్నది. మైనారిటీలకు వ్యతిరేకంగా క్రమపద్ధతిలో వివక్షతకు రాజ్యాధికారాన్ని అది ఇప్పుడు ఉపయోగిస్తున్నది. ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యంలోని ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దళితులు, వ్యవస్థాగత వివక్షత తారస్థాయికి చేరింది. రాజ్యాంగం ఐదవ షెడ్యూలు, పీఈఎస్ఈ చట్టం నీచంగా అమలు జరపడంతో గిరిజనుల భూహక్కుల ఉల్లంఘన తీవ్ర సమస్యగా పరిణమించింది. కుల గణన నిర్వహించాలని డిమాండ్ వేగం పుంజుకుంది. అయితే కులాన్ని ప్రామాణికంగా చేర్చకూడదని బీజేపీ మొండి వైఖరితో ఉండడం వెనుకబడిన కులాల్లో అశాంతికి ఆజ్యం పోసింది. ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పునరుజ్జీవన మలుపులో భాగంగా లింగ మూసలను మరింత బలపరుస్తున్నాయి. మహిళలపై నేరాలు, హింస మోదీ ప్రభుత్వ పాలనలో నిత్యకృత్యమయ్యాయి. బీజేపీ నాయకులు మహిళలను ఉల్లంఘించిన అనేక ఉదాహరణలున్నాయి. వారికి ప్రభుత్వ యంత్రాంగం మద్దతు పలకడం వెలుగులోకి వచ్చింది.

భారతీయ సమాజం పరస్పర విరుద్ధమైన ప్రయోజనాలు గల వర్గాల మధ్య మాత్రమే విభజించబడింది కాదని అర్థం చేసుకోవాలి. స్థితిస్థాపక, దృఢమైన, క్రమానుగత కుల వ్యవస్థ కూడా మనకు ఉంది. కులం క్రమానుగత నిర్మాణాన్ని నిర్మూలించకుండా ఏ విప్లవాత్మక వ్యూహం విజయవంతం కాదని గమనించవలసి ఉంటుంది. కొత్త సమాచారం, ఉత్పాదక సాంకేతిక పరిజ్ఞానం మళ్లీ కార్మికవర్గం కూర్పులో గణనీయమైన మార్పు తీసుకొచ్చింది. పితృస్వామ్యం పర్యావసాన మహిళా విద్వేషం మన జనాభాలో సగం మంది పురుషాధీనంలో ఉండడం ప్రధాన సమస్య. సామాజిక విముక్తికోసం ముందుకు సాగడానికి, ఆర్‌ఎస్‌ఎస్ బీజేపీని సమగ్రంగా ఓడించడానికి వర్గ, కుల, పితృస్వామ్య సమష్టిగా ఎదుర్కోవాలి. ఈ సందర్భంలో సమాజంలోని చీలికలను ఉపయోగించుకునే ఆర్‌ఎస్‌ఎస్ కుయుక్తులను మనం గుర్తుంచుకోవాలి. ఈ నేపథ్యంలో మాత్రం ఇటీవల ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ చేసిన ప్రసంగాన్ని నిశితంగా చూడాలి. కుల వివక్షను అంతం చేయాలని, మహిళా సాధికారత కోసం ఆయన చేసిన విజ్ఞప్తి జనాభా నియంత్రణ చట్టం ద్వారా ముస్లిం జనాభా పెరుగుదలతో కూడినదిగా ఉంది. కుల వివక్షతను అంతం చేయడంపై ఆర్‌ఎస్‌ఎస్ ఆకస్మిక ఉద్ఘాటన సమానత్వం పట్ల ఎలాంటి నిబద్ధతతో చేసింది కాదు. అయితే ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులను సమష్టిగా సమీకరించడం కోసం ఉద్దేశించినది. మతతత్వం కులతత్వానికి వ్యతిరేకం కాదు. అన్ని స్థాయిల్లో అన్ని రకాల వివక్షతలపై, అన్ని స్థాయిల్లో పితృస్వామ్యంపై నిరంతర పోరాటాలు మాత్రమే కులం నిర్మూలనకు దోహదం చేస్తాయి.

కోవిడ్-19 సంక్షోభం మన సమాజాన్ని క్షతగాత్రురాలిని చేసింది. ప్రైవేటు రంగంపై అధికంగా ఆధారపడడం వల్ల మన ఆరోగ్య మౌలిక సౌకర్యాలు దాని కింద పడిపోయాయో చూశాం. మహమ్మారి సంవత్సరాల్లో విద్యలో అంతరం, డిజిటల్ విభజన, పెరుగుతున్న విద్య ప్రైవేటీకరణ చాలా మందికి విద్యను సుదూర స్వప్నంగా చేశాయి. గ్రామీణ భారత దేశంలో ప్రబలంగా ఉన్న అనిశ్చిత జీవన ప్రమాణాలతో భూమిలేనివారి ఉదాహరణ పెరుగుతోంది. భూమిలేని తనం, వలసలు అత్యంత ముఖ్యమైన గృహనిర్మాణ సమస్యను క్లిష్టతరం చేశాయి. నిరుద్యోగ సంక్షోభం తీవ్రతరం అవుతున్నది. మోదీరాజ్ హయాంలో ప్రపంచ ఆకలి సూచీలో నిరంతర పతనాన్ని చూసింది. అందువల్ల ప్రజారోగ్యం, ప్రభుత్వ విద్య, భూమి, గృహనిర్మాణం, ఉపాధి, ఆహార భద్రతను మన ఎజెండాలో ప్రాథమిక డిమాండ్లుగా తీసుకోవడం అనివార్యం. సాంస్కృతిక జాగాను అభివృద్ధి నిరోధక శక్తులు ఉపయోగించుకోవడాన్ని మేము ఆపవలసిన అవసరం ఉంది. మాకు మేము, అలాగే మా అభ్యుదయ సాంస్కృతిక విలువలను పటిష్టవంతం చేసుకోవలసిన అవసరం కూడా ఉంది. మా గతాన్ని పునర్ నిర్వచించి, దాని వారసత్వాన్ని ఉపయోగించుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నిస్తుంది. వారి విభజన ఎజెండాను మరింత ముందుకు తీసుకెళ్లడానికి ప్రముఖుల రచనలను ఉద్దేశపూర్వకంగా వక్రీకరిస్తున్నారు. ఇది మనకు వదిలిపెట్టి వెళ్లిన సమగ్ర, ప్రగతిశీల వారసత్వానికి అవమానం కూడా. మన భవిష్యత్ కార్యక్రమాలు అభ్యుదయ ఆలోచనాపరులు, రచయితలు, సంఘసంస్కర్తల సుసంపన్న కృషి, వారసత్వంతో కూడినవిగా ఉండాలి. కబీర్, కాళిదాస్ వంటి మధ్యయుగం నాటి కవులపై సమానత్వం, పెరియార్, అయ్యన్ కళ్లీ ప్రబోధించిన హేతుబద్ధత, శ్రీ నారాయణ గురూ, డాక్టర్ అంబేద్కర్, అణగారిన వర్గాల ప్రజల హక్కుల సాధనకు చేసిన కృషి మన పోరాటాలలో భాగం కావాలి. ఆర్‌ఎస్‌ఎస్ విద్వేషంతో ప్రజలను కలుషితం చేసేందుకు ప్రయత్నిస్తున్నది. దాన్ని మనం సామరస్యం, ఐక్యతతో తిరిగి స్వాధీనం చేసుకోవాలి.

ఆర్థికంగా, సామాజికంగా సాధించేందుకు ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న ప్రయత్నానికి మా ఎజెండా పూర్తిగా వ్యతిరేకం. ఆర్‌ఎస్‌ఎస్-బీజేపీని ఓడించడానికి ప్రతిపక్షాల ఎజెండా కూడా ఆర్‌ఎస్‌ఎస్‌కు భిన్నంగా ఉండాలి. ఆర్‌ఎస్‌ఎస్-బీజేపీకి వ్యతిరేకంగా సూత్రబద్ధ ఐక్యతను దృఢతరం చేయడానికి లౌకిక-ప్రజాతంత్రపార్టీల మధ్య వామపక్షం వైపు మొగ్గ వైఖరి అవసరం. ఈ ఐక్యత పెంపొందించడానికి వామపక్షాలు చొరవ చూపాలి. రాజకీయ పార్టీలు ప్రజా బాహుళ్యం, వర్గ సంస్థలతో కూడిన విశాల ఐక్యత నిర్మాణం మన లక్ష్యంగా ఉండాలి. మన రాజ్యాంగ పరిరక్షణ కోసం సామాజిక ఉద్యమాలు, ఆర్‌ఎస్‌ఎస్-బీజేపీ నిర్దయాత్మక, విషపూరిత విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు ముమ్మరం చేయాలి. దేశం, ప్రజల మౌలిక ప్రయోజనాలను రక్షించడంలో వామపక్షాల చారిత్రక పాత్ర గురించి సీపీఐ స్పష్టంగా ఉంది. ఈ అపూర్వ, నూతన రాజకీయ పరిస్థితిలో ఈ దృక్పథం, చారిత్రక బాధ్యతతో సీపీఐ వామపక్ష ఐక్యత, అన్ని లౌకిక, ప్రజాస్వామ్య దేశభక్తి యుత శక్తుల ఐక్యత బావుటాను ఎగురవేస్తోంది.

మా ఎజెండా, స్పష్టత, బాధ్యతను దృష్టిలో ఉంచుకుని మన సహచరులు సీపీఐ 24వ మహాసభలను పార్టీ భవిష్యత్ కోసం మాత్రమే కాకుండా దేశం, దాని ప్రజల భవిష్యత్ కోసం మహాసభగా మార్చాలి. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకోవడం, ప్రబోధించండం వాటిని అమలు చేయవలసిన బాధ్యత మన పార్టీకి ఉన్నది. అందువల్ల సీపీఐ 24వ జాతీయ మహాసభలు ఆశాభావంతో కూడిన మహాసభలకు మెరుగైన ప్రపంచం, మెరుగైన సమాజం కోసం మన పోరాటం మరింత శక్తివంతంగా, విప్లవ ఉత్సాహంతో కొనసాగాలి. మన భవిష్యత్ కార్యక్రమం, కర్తవ్యాలను నిర్ణయించుకోవడానికి సమావేశమవుదాం. ప్రజాస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి, సోషలిజం కొరకు మన పోరాటాన్ని బలోపేతం చేయడానికి ప్రజలకు ఆశాభావాన్ని అందించడానికి మనమందరం ఈ మహాసభలను జయప్రదం చేద్దాం.

వారి స్ఫూర్తే నన్ను నడిపించింది

ప్రజా పోరాటాలు సంతృప్తినిచ్చాయి

భారత కమ్యూనిస్టుపార్టీ (సీపీఐ) అగ్రనాయకులు చంద్ర రాజేశ్వరరావు, బహుముఖ ప్రజ్ఞాశాలి సి.రాఘవాచారి ఆలోచనా, జీవన విధానం, నల్లమ గిరిప్రసాద్, పువ్వాడ నాగేశ్వరరావు, ఎం. కొమరయ్య లాంటి నేతల పోరాట తీరు నన్ను కమ్యూనిస్టుపార్టీనాయకునిగా తయారు చేశాయి. జర్నలిస్టుగా ప్రారంభమై తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ఎదిగేంతవరకు జీవితంలో అనేక పోరాటాలను, ప్రతికూల పరిస్థితులను చవిచూశాను. తొలుత సబ్‌ఎడిటర్‌గా విశాలాంధ్ర జర్నలిస్టుగా నా ప్రస్థానం ప్రారంభమైంది. ఆ తరువాత 1982లో కొత్తగూడెం విశాలాంధ్ర విలేకరిగా పనిచేయడానికి వచ్చాను. 1984లో కమ్యూనిస్టుపార్టీ కొత్తగూడెం పట్టణ కార్యదర్శిగా ఎన్నికయ్యాను. 1988లో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన తొలి మండల పరిషత్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో విజయం సాధించాను. ఎంపీపీగా కొత్తగూడెం పట్టణ విస్తరణకు కృషి చేశాను. సి.ఆర్.నగర్ ,మార్క్స్ ఎంగిల్స్,లెనిన్ పేర్లతో అనేక కాలనీలను ఏర్పాటు చేయడం జరిగింది. గిరిప్రసాద్‌నగర్, కొమరయ్యనగర్, రజబ్‌అలీనగర్‌లతోపాటు రామాంజనేయ కాలనీ, వికలాంగుల కాలనీ, లెప్రసీకాలనీలనుఏర్పాటు చేయడంతోపాటు కొత్తగూడెం మండలాభివృద్ధికి విశేషకృషి చేశాను. ఆ తర్వాత కొత్తగూడెం నియోజకవర్గ సీపీఐ కార్యదర్శిగా, 2005లో సీపీఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యాను. ఖమ్మం జిల్లాలో ప్రతి మండలంలోను పార్టీని ఏర్పాటుచేయాలనే నా సంకల్పం నెరవేరడం నాకు అత్యంత సంతృప్తినిచ్చింది.

2009 శాసనసభ ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి పోటీచేసి అప్పటి మంత్రి వనమా వెంకటేశ్వరరావుపై విజయం సాధించి,శాసనసభలో సీపీఐ పక్ష ఉపనాయకునిగా పనిచేశాను. అనేక ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషిచేశాను. ముఖ్యంగా లక్షల కోట్ల రూపాయల విలువైన ఖనిజ సంపదను కాపాడే క్రమంలో సభలో, బయటనిర్వహించిన పోరాటం దేశవ్యాపితం కావడం అప్పటి ప్రభుత్వం లీజును రద్దుచేయడం జరిగింది. బయ్యారం, నేలకొండపల్లి, గార్ల మండలాలలో లక్షా 40వేల ఎకరాలలో నిక్షిప్తమైన ఖనిజ సంపదను కాపాడేందుకు జిల్లా దిగ్బంధనం పేరుతో చేసిన చారిత్రాత్మక పోరాటం కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఓ మైలు రాయిగా నిలిచిందని అనడం సందేహం లేదు. ప్రజల పక్షాన బహుముఖ ఆందోళనలు, పోరాటాలు నిర్వహించిన సమయంలో టాడా సహా అనేక కేసులను ఎదుర్కొని వరంగల్ సెంట్రల్ జైల్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతు సంఘం జిల్లా కార్యదర్శిగా రైతాంగం సమస్యలపైన, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షునిగా సింగరేణి సమస్యలపైన అనేక పోరాటాలను నిర్వహించాను. పార్టీయే బాధ్యతలు అప్పగించినా అందుకనుగుణంగా నిరంతరం ప్రజల్లో ఉండాలనేది నా తపన. 2022 సెప్టెంబర్ 7వ తేదీన భారత కమ్యూనిస్టుపార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యాను. రాష్ట్రంలో ప్రతి జిల్లాకు, ప్రతి మండలానికి కమ్యూనిస్టుపార్టీని విస్తరింప చేయడమే నా ముందున్న లక్ష్యం. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆందోళన చేస్తూనే పార్టీ విస్తరణే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించడం జరుగుతుంది. నా జీవిత కాలం అమరులిచ్చిన స్ఫూర్తితో వారుచూపిన మార్గంలోనే పయనిస్తాను.

- కూనంనేని సాంబశివరావు,
సీపీఐ తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు

స్వాగత గీతం

పల్లవి: - అమరజీవులందించిన -
శ్రమజీవులు సృజియించిన
అజరామరమైన చరిత -
సాధించిన సమర ఘనత
ఘోషించెను కృష్ణానది
తీరం - భాసించెను
విజయవాడ నగరం
"అమరజీవులందించిన"

చరణం:- అక్కన్నలు మాదన్నలు
శాతవాహన చాళుక్యులు
మొఘలాయిలు
పఠానులు జమీనులు ఫ్రెంచివారు
మహ్మదీయ పాలనకు, రారాజుల బురుజులకు
ఆముక్తమాల్యదలో స్థానమైన కనకపురం
పలికింది. విజయపురపు గీతం...
చరితాత్మక గత స్మృతుల స్వాగతం... సుస్వాగతం....
"అమరజీవులందించిన"

చరణం:- మంచి గెలుపు తథ్యమని, చెడు గెలుపే మృగ్యమని
నిజరూపపు నిదర్శనై నిలిచె ఇంద్రకీలాద్రి
పోరాడే గెలవాలని తెలిపే ముస్లిందర్గా
గుణదల మేరీమాత, భవానీ ద్వీపాలు
మురిపించెను మానవతా వేదం...
సామ్యవాద సోదరులకు స్వాగతం... సుస్వాగతం...
"అమరజీవులందించిన"

చరణం:- శాంతివనపు గురుతులుగా విలసిల్లిన గాంధీగిరి
చరిత స్మృతులు దాచుకున్న విక్టోరియ మ్యూజియం
ఉక్కునైన వంచగలిగి, తుక్కునైన తిరిగి మలచె
సంఘటితపు శ్రమస్వేదం కొలువైన ఆటోనగరు
అరుదైన గౌరవాల సారం...
రుధిరవర్ణ శోభితులకు స్వాగతం... సుస్వాగతం...
"అమరజీవులందించిన

చరణం:- చారిత్రక ఆకృతులకు కొలువైన కొండపల్లి
మన సంపద పెంచుతున్న విటిపిఎస్, బెల్లు
సిరులు పంచెగనిగా పేరొందిన బ్యారేజీ
కొల్లేటి సోయగాలు, మంగినపూడి తీరాలు అందించెను ఆదర్శపు తీరం...
సమసమాజ స్థాపకులకు స్వాగతం... సుస్వాగతం...
"అమరజీవులందించిన"

చరణం:- విశ్వఖ్యాతి మధురఫలం నూజివీడు మామిడిరసం
చేనేతకు ప్రాకారం వరికోతల మమకారం
తేనీటికి తీయదనం అందించిన కెసిపి అంగరంగ వైభవాల ప్రాకృతిక సందేశం
పూరించెను విప్లవాల శంఖం....
ఆశయాల సాధకులకు స్వాగతం... సుస్వాగతం...
"అమరజీవులందించిన"

చరణం:- యక్షగాన కోలాటాలు జంతరు పెట్టె డప్పుకోళ్లు
దేవపెట్టె హరికథ తప్పెటగుళ్లు జముకథ
పులివేషం కర్రసాము బేతాళులు బుడబుక్కలు
కొమ్మదాసరి బుర్రకథ గరిడీలు గంగిరెద్దుల
ప్రజాకళలు ప్రభవించిన తీరం...
సాంస్కృతిక ప్రాభవాల స్వాగతం... సుస్వాగతం...
"అమరజీవులందించిన"

చరణం:- నాట్య జగతి సిగలోన సింధూరం కూచిపూడి
గౌతముడి బోధనల క్షేత్రమైన అమరావతి
అన్నపూర్ణ అను కీర్తి అనురాగపు ధరియిత్రి
వామపక్ష ఐక్యతకు ఆలవాలమైన ధాత్రి
జాతీయత గురుతిచ్చిన తీరం...
ఆత్మీయ సోదరులకు స్వాగతం... సుస్వాగతం...
"అమరజీవులందించిన

చరణం:- జమిందారు నెదిరించి భూపోరును సాగించి
అరుణోదయ కాంతులతో తిమిరాలను తరిమేసిన
చంద్ర రాజేశ్వరుడు, తమ్మిన పోతరాజులు
జనియించిన ఈ గడ్డకు యువతరమే తరలిరాగ
ఘోషించెను విప్లవాల వేదం...
అజరామర వారసులకు స్వాగతం...సుస్వాగతం...
"అమరజీవులందించిన"

చరణం:- కదనంలో ప్రథమంటూ కదిలిన వనితలతో
మట్టినైన మణిచేసే రైతన్నలు కూలీలతో
గతకాలపు ఆనవాలు భవితవ్యపు ఓనమాలు
దిద్దుకొనగ దీక్షబూని విచ్చేసిన వీరులతో ఎరుపెక్కిన కృష్ణానది తీరం...
మ్రోగించెను భవితవ్యపు నాదం...
మహాసభల ప్రతినిధులకు స్వాగతం... సుస్వాగతం...
ఆహుతులకు నేతలకు స్వాగతం... సుస్వాగతం.....
సిపిఐ జాతీయ మహాసభల స్వాగతం... సుస్వాగతం....
"అమరజీవులందించిన"

రచన :-యడ్ల కృష్ణకిషోర్

ఉద్యమమే ఊపిరి...అది ఆగేదికాదు

(9వపేజీ తరువాయి)

సీపీఐని ఫైటింగ్ పార్టీగా మార్చారన్న వాదన నిజమేనా?

నారాయణ: ఒక విధంగా అది నిజమే. తిరుపతి ఎస్కే యూనివర్శిటీలో రెడ్డీస్, నాన్ రెడ్డీస్ మధ్య పెద్ద గొడవ జరిగింది. ఆ గొడవల్లో మధ్యలో వెళ్లి ఏఐఎస్ఎఫ్ స్థాపించాను. మా నాయకుడు దివాకరరెడ్డిపై హత్యాయత్నం జరిగింది. కత్తిపోట్లు పొడిచారు. అటువంటి పరిస్థితుల్లో కులోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు రాడికల్స్‌తో గొడవ. అక్కడ కూడా వారిని ప్రతిఘటించాం. అతివాద తీవ్రవాదులతోనూ పోరాడి గెలిచిన స్థితిలో ఎఐఎస్ఎఫ్‌ను ఫైటింగ్ ఫెడరేషన్‌గా తయారు చేశాం. ఏఐవైఎఫ్‌లోకి వెళ్లిన తర్వాత దాన్ని బలోపేతం చేసి రౌడీయిజంపై పోరాటం చేశాం. సామాజిక కార్యక్రమాలతోపాటు హాకర్స్, రిక్షావారి సమస్యలు, భూ పట్టాలు. నివేశన స్థలాల కోసం ఉద్యమాలు చేశాను. తిరుపతిలో ఏకంగా 20 కాలనీలు వేయించాం. అదొక రికార్డు. బినామీ భూములకు వ్యతిరేకంగా చిత్తూరులో ఉద్యమించి, వేల ఎకరాల భూములను పేదలకు పంపిణీ చేశాం. దళితులు, మహిళలపై దాడులను ప్రతిఘటించాం. ఈ క్రమంలో ఎన్నో గాయాలు తగిలాయి. ప్రాణాపాయాల నుంచి తప్పించుకున్నాను. ఆ కోణంలోనే సీపీఐ ఫైటింగ్ పార్టీగా మారినట్లు చెపుతుంటారు. జిల్లా కార్యదర్శిగా ఉన్నప్పుడు గాట్, డంకెల్ ఒప్పందాలకు వ్యతిరేకంగా ప్రభుత్వ కార్యాలయాలపై నల్లజెండాలు ఎగురవేశాం. చిత్తూరు పుంగనూరు ఎమ్మార్వో కార్యాలయంపై నల్లజెండా ఎగరవేసిన సందర్భంలో సమీపంలో జరుగుతున్న ఎఐసీసీ కాన్ఫరెన్స్‌లో కాంగ్రెస్ నాయకులు దాన్ని పేపర్లో చూసి సీరియస్ అయ్యారు. దాని ఫలితంగా దేశద్రోహం కేసు పడింది. 13రోజులు జైలులో వున్నాను. వాయల్పాడు జైలుకు పంపించారు. తిరుపతిలోనే మహిళపై జరిగిన ఓ హత్య కేసులో బంద్‌కు పిలుపు పోలీసును కొట్టిన ఆరోపణపై 15 రోజులు జైలులో ఉన్నాను.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా కూడా ఇంతేనా?

నారాయణ: రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాష్ట్రమంతటా తిరుగుతూ శ్రీకాకుళం నుంచి చిత్తూరు జిల్లా వరకు ల్యాండ్స్, సోషల్ అట్రాసిటీస్‌పై పోరాడాను. శ్రీకాకుళం జిల్లా కంబిరిగాం భూపోరాటంలో ఎమ్మార్వోను కొట్టిన ఆరోపణలో 15 రోజుల జైలు శిక్ష అనుభవించాను. జంగారెడ్డి గూడెంలో కూడా ఎమ్మార్వోపై దాడి చేసినట్లు వచ్చిన ఆరోపణపై రాజమండ్రి సెంట్రల్ జైలులో 15 రోజులు ఉంచారు. దేశద్రోహం కేసుపెట్టారు. అక్రమ నిల్వల వెలికితీతలో భాగంగా విశాఖలో చేసిన పోరాటంలో డెకాయిట్ కేసు పెట్టి 15 రోజులు జైల్లోకి నెట్టారు. హైదరాబాద్, రంగారెడ్డి చుట్టుపక్కల వేల ఎకరాల భూముల అక్రమణలో విజయం సాధించాం. అన్నింటికీ మించి విద్యుత్ ఉద్యమం గొప్పది. బషీర్‌బాగ్ కాల్పుల ఘటనలో నా చెయ్యి విరిగింది. ఆనాడు సురవరం పార్టీ కార్యదర్శి, నేను సహాయ కార్యదర్శిగా వున్నాను. హైదరాబాద్ హఫీజుపేట (కొండాపూర్) ప్రభుత్వ భూములను ల్యాండ్ మాఫియా ఆక్రమించి ఇళ్లు కట్టుకుంటే దూకుడుగా పోయి పగలగొట్టాం. విశాఖలో ప్రభుత్వ భూములను కబ్జా చేసిన ల్యాండ్ మాఫియాను ఎదిరించాం. ఈ సందర్భంగా గోడను కాలితో తన్నినప్పుడు నా కాలు విరిగింది.

గత విజయవాడ మహాసభలకు హాజరయ్యారా?

నారాయణ: 1975లో విజయవాడలో జరిగిన 10వ మహాసభలకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా డెలిగేట్‌గానే హాజరయ్యాను. ఆ సభకు ప్రతినిధులు భారీగా వచ్చారు. అంతర్జాతీయంగా 30 దేశాల నుంచి ప్రతినిధులు వచ్చారు. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టులంతా తరలివచ్చారు. అప్పట్లో ఎస్ఏ డాంగేకు మంచి పేరుంది. భూపేష్‌గుప్తా, ఇంద్రజిత్ గుప్తా, చంద్ర రాజేశ్వరరావులను చూసి ఉత్తేజితులయ్యే వాళ్లం. సీఆర్ ప్రధాన కార్యదర్శిగా వున్నారు. ఆ మహాసభలు ఒక గొప్ప మహోత్సవంలా సాగాయి. లక్షమందికిపైగా హాజరై, పెద్ద ప్రదర్శన నిర్వహించారు. ఒక్కమాటలో చెప్పాలంటే, తిరునాళ్లలా ఉండేది. సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాల్స్, పుస్తకాల షాప్స్, కల్చరల్ వింగ్స్, సాహిత్యకారుల సభలతో కళకళలాడింది. నా జీవితంలో అదొక అద్భుతం. జీవితాంతం గుర్తించుకోవాల్సిన సభలవి.

తెలుగు రాష్ట్రాల్లో వామపక్షాలు బలహీనపడలేదా?

నారాయణ: తెలుగు రాష్ట్రాల్లో వామపక్షాలు స్వల్పంగా బలహీన పడిన మాట వాస్తవమే. అది చిన్న విరామం మాత్రమే. ప్రాంతీయ పార్టీలు బలపడ్డాక, వామపక్షాలకు గడ్డుకాలం ఎదురైంది. కానీ ప్రజలు ఎల్లప్పుడూ లెఫ్ట్‌కు మద్దతునిస్తూనే వున్నారు. ఈ మధ్యకాలంలో ప్రజల పక్షాన మా పోరాటాలు పెరిగాయి. అందరూ ఆదరిస్తున్నారు. ఇది శుభపరిణామం. అదేసమయంలో అన్ని వామపక్షాలు ఒకతాటిపైకి రావడం ద్వారా చాలా సమస్యలకు పరిష్కారం ఇవ్వవచ్చు. ప్రజాస్వామ్యాన్ని పరిమితం చేసే పద్ధతిలో, ఉద్యమాలను అణచివేసే పద్ధతిలో, ప్రజాస్వామ్య ఉద్యమాలకు లేకుండా చేయడానికి కేంద్ర ప్రభుత్వం, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు యత్నిస్తున్నాయి. ఏపీలో కూడా ఇలాంటి విధానాలు కొనసాగుతున్నాయి. అందుకే వామపక్షాలు బలపడటానికి ఇదే మంచి తరుణం.

రాష్ట్ర ప్రభుత్వ విధానాలు మరీ దారుణంగా ఉన్నాయన్నదే మీ ఆరోపణా?

నారాయణ: కచ్చితంగా. ఎందుకంటే ఏ విషయంలోనూ జగన్ ప్రభుత్వం సజావుగా వ్యవహరించడం లేదు. ఆంధ్రా చరిత్రలోనే ఇవి చీకటి రోజులు. ఏపీలో రాజధాని విజయవాడ కావాలని సీపీఐగా మేం మొదట్నించీ కోరుకుంటున్నాం. ప్రాజెక్టులకు రివర్స్ టెండరింగ్‌తో పరిపాలన కూడా రివర్స్ అయింది. అవినీతికి వ్యతిరేకంగా నిలబడతానని చెప్పిన జగన్ పాలనలో సర్వం అవినీతిమయమే. 'కరప్షన్ ఫ్రీ గవర్న్‌మెంట్' అని హామీ ఇచ్చిన జగన్...దాన్ని డీసెంట్రలైజేషన్ చేశాడు. ఇప్పుడు అవినీతి కాన్‌సెంట్రేట్ అయిపోయింది. ఇసుక, మైనింగ్, మద్యం పాలసీలతో అవినీతి పొమ్ము ఒకే ద్వారం గుండా పోతున్నది. ఏ ఆఫీసుకు వెళ్లినా...డబ్బు లేకుండా పని జరగడం లేదు. నవతర్నాలు తప్ప అన్నీ వైఫల్యాలే. ప్రజాస్వామ్యం లేకుండా చేస్తున్నది. ల్యాండ్ మాఫియా పెరిగింది. ప్రత్యర్థులపై దాడులు పెరిగాయి. యువకుడైన జగన్ రాజకీయాలు బాగా చేస్తాడని రాజన్న రాజ్యం తెస్తాడని ఆశించారు. కానీ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి విరుద్ధపాలన సాగుతోంది. ఒక్కమాటలో చెప్పాలంటే అబ్బకే పంగనామాలు పెట్టిన సీఎంగా మారిపోయాడు.

ఈ జాతీయ మహాసభలకు ప్రాధాన్యత వుందా?

నారాయణ: ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుంటే ఇంత ప్రాధాన్యత గల మహాసభలు మేం కూడా ఏనాడూ చూడలేదు. ఎందుకంటే, మోదీ పాలనలో దేశం అన్నిరంగాల్లోనూ అథోగతిపాలైంది. 52 ఏళ్ల నా రాజకీయ జీవితంలో ఇంత బ్లాక్‌మెయిలింగ్ కేంద్ర ప్రభుత్వాన్ని నేనెన్నడూ చూడలేదు. ఆర్ఎస్ఎస్ మతోన్మాదాన్ని రెచ్చగొట్టినా ఇంకో కోణంలో అదొక నిజాయితీ గల సంస్థ అని అనేకునేవాళ్లం. కమ్యూనిస్టుల తర్వాత ఆదర్శనాయకులు వారేనని భావించేవాళ్లం. ఇప్పుడు ఆ సంస్థ, దాని అనుబంధ సంఘాల చేష్టలను చూస్తే కళ్లుబైర్లు కమ్ముతున్నాయి. సకల అరాచకాలతో అది బరితెగించింది. ఆడవాళ్లను రేప్ చేసి జైలుకు వెళ్లిన వారిని హీరోలుగా కీర్తిస్తూ స్వాగతం పలుకుతున్నారు. గాడ్సేకు గుళ్లు కడుతున్నారు. ఇది దేశానికే అవమానకరం. ప్రత్యర్థులపై దాడులకు తెగబడుతున్నారు. బీజేపీకి సాయంచేసేవాళ్లను కమలం పువ్వులో పెట్టి పూజ చేస్తున్నారు. భారత రాజ్యాంగానికి ముప్పు వాటిల్లింది. సహజంగా ప్రతిపక్షాలు, విదేశీ శక్తుల నుంచి రాజ్యాంగానికి ముప్పు వాటిల్లుతుందని భావించేవాళ్లు. కానీ విచిత్రమేమిటంటే, పాలకపక్షం బీజేపీ నుంచే ఈ ప్రమాదం తలెత్తింది. ప్రజాస్వామ్యం లేదు. నయా ఫాసిస్టు వ్యవస్థ నెలకొన్నది. ఈ దశలో సీపీఐ జాతీయ మహాసభల్లో కీలక నిర్ణయాలు తీసుకోకపోతే కమ్యూనిస్టులకు ప్రమాదం కన్నా దేశానికే ప్రమాదం. బీజేపీకి వ్యతిరేకంగా వున్న సెక్యులర్, డెమోక్రటిక్, లెఫ్ట్ శక్తుల సమీకరణ బాధ్యత సీపీఐపై వుంది. ఆ దిశగా మహాసభల్లో చర్చలు జరుపుతాం. ఇది చారిత్రక అవసరం కూడా. ఇదే బెజవాడలో 1961లో ఉమ్మడి సీపీఐ మహాసభ జరిగింది. ఆ తర్వాత పార్టీ చీలిపోయింది. ఇప్పుడు ఇదే చారిత్రక ప్రదేశంలో వామపక్షాలను ఆహ్వానిస్తున్నాం. వామపక్షాల పునరేకీకరణకు ఇది నాంది కావాలన్నదే మా ఆకాంక్ష.

ఇంకేదైనా ప్రత్యేకత వుందా?

నారాయణ: ఈ జాతీయ మహాసభలను ఆర్థికంగా గడ్డు పరిస్థితుల్లోనే నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ తోడ్పాటు జీరో. కేవలం ప్రజల ప్రోత్సాహంతోనే ఈ సభలను నిర్వహిస్తున్నాం. జనమే మాకు చందాలిచ్చి సభలను జరుపుతున్నారు. ఈ మహాసభలకు అయ్యే ఖర్చును ఊరూరా తిరిగి విరాళాల ద్వారా సేకరించాం. ప్రజలు ఎంతో సానుకూలంగా స్పందించి మాకు సహకరిస్తున్నారు. వారందరికీ ఆహ్వానసంఘం అధ్యక్షునిగా నేను అభినందనలు తెలియజేస్తున్నాను. డప్పు కళాకారులు, జనసేవాదళ్, సాంస్కృతిక కార్యక్రమాలు హైలైట్ కానున్నాయి.

– ఎ.బి.కూన

భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ మహాసభలు

సంఖ్య	సంవత్సరం	ప్రదేశం	ప్రధాన కార్యదర్శి
ప్రారంభ సమావేశం	1925 (డిసెంబర్ 25-26)	కాన్పూర్	కామ్రేడ్ ఎస్.వి.ఘాటే
కలకత్తా సమావేశం	1933	కలకత్తా	కామ్రేడ్ జి.అధికారి
కలకత్తా	1936		కామ్రేడ్ పి.సి. జోషి
మొదటి మహాసభ	1943 (మే 23- జూన్ 1)	బొంబాయి	కామ్రేడ్ పి.సి.జోషి
2వ మహాసభ	1948 ఫిబ్రవరి 28-మార్చి 6	కలకత్తా	కామ్రేడ్ బి.టి.రణదివే
అఖిల భారత సమావేశం	1951 అక్టోబర్ 9-15)	కలకత్తా	కామ్రేడ్ అజయ్ ఘోష్
విస్తృత సమావేశం	1952-53 (డిసెంబర్ 30- జనవరి 10)	పాలఘాట్	కామ్రేడ్ అజయ్ ఘోష్
3వ మహాసభ	1953-54 డిసెంబర్ 27-జనవరి 4	మధురై	కామ్రేడ్ అజయ్ ఘోష్
4వ మహాసభ	1956 ఏప్రిల్ 19-29	పాలఘాట్	కామ్రేడ్ అజయ్ ఘోష్
5వ మహాసభ	1958 ఏప్రిల్ 6-13	అమృత్‌సర్	కామ్రేడ్ అజయ్ ఘోష్
6వ మహాసభ	1961 ఏప్రిల్ 7-16	విజయవాడ	కామ్రేడ్ అజయ్ ఘోష్
1962 ఎస్.ఎ.డాంగే, ఛైర్మన్, ఇఎంఎస్ నంబూద్రిపాద్, ప్రధాన కార్యదర్శి, 1964లో పార్టీలో చీలిక			
7వ మహాసభ	1964 డిసెంబర్ 12-23	బొంబాయి	కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు డాంగే - ఛైర్మన్
8వ మహాసభ	1968 ఫిబ్రవరి 7-15	పాట్నా	కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు డాంగే - ఛైర్మన్
9వ మహాసభ	1971 అక్టోబర్ 3-10	కొచ్చిన్	కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు డాంగే - ఛైర్మన్
10వ మహాసభ	1975 జనవరి 27-ఫిబ్రవరి 4	విజయవాడ	కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు డాంగే - ఛైర్మన్
11వ మహాసభ	1978 మార్చి 31 -ఏప్రిల్ 7)	భటిండా	కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు డాంగే - ఛైర్మన్
12వ మహాసభ	1982 మార్చి 22-28	వారణాసి	కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు (ఛైర్మన్ పదవి రద్దుచేయబడింది)
13వ మహాసభ	1986 మార్చి 12-17	పాట్నా	కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు
14వ మహాసభ	1989 మార్చి 6-12	కలకత్తా	కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు
15వ మహాసభ	1992 ఏప్రిల్ 10-16	హైదరాబాద్	కామ్రేడ్ ఇంద్రజిత్ గుప్తా
16వ మహాసభ	1995 అక్టోబర్ 7-11 డిప్యూటీ జనరల్ సెక్రటరీ	న్యూఢిల్లీ	కామ్రేడ్ ఇంద్రజిత్ గుప్తా ఎ.బి.బర్ధన్
17వ మహాసభ	1998 సెప్టెంబర్ 14-19	చెన్నై	కామ్రేడ్ ఎ.బి.బర్ధన్
18వ మహాసభ	2002 మార్చి 26-31	తిరువనంతపురం	కామ్రేడ్ ఎ.బి.బర్ధన్
19వ మహాసభ	2005 మార్చి 29- ఏప్రిల్ 3 2007 డిప్యూటీ జనరల్ సెక్రటరీ	చండీఘర్	కామ్రేడ్ ఎ.బి.బర్ధన్ సురవరం సుధాకరరెడ్డి
20వ మహాసభ	2008 మార్చి 23-28 డిప్యూటీ జనరల్ సెక్రటరీ	హైదరాబాద్	కామ్రేడ్ ఎ.బి.బర్ధన్ సురవరం సుధాకరరెడ్డి
21వ మహాసభ	2012 మార్చి 27-31	పాట్నా	కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి
22వ మహాసభ	2015 మార్చి 25-29	పుదుచ్చేరి	కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి
23వ మహాసభ	2018 ఏప్రిల్ 25-29	కొల్లాం	కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి

2019 జులై 24న ఢిల్లీలో జరిగిన జాతీయ సమితి సమావేశంలో కామ్రేడ్ సుధాకరరెడ్డి రిలీవ్ కావడంతో కామ్రేడ్ డి.రాజా జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

ప్రజా పోరాటాల్లో తగ్గేదేలే

(9వపేజీ తరువాయి)

ఎకరాలకు ఎన్టీఆర్ ద్వారా పట్టాలు ఇప్పించడం జరిగింది. కర్నూలులోని నా జన్మస్థలం మొలగవల్లిలో సురవరం సుధాకరరెడ్డి, చదువుల రామయ్య సారథ్యంలో 1500 ఎకరాల మిగులుభూములను పేదలకు ఇప్పించాం. అనంతపురం పట్టణంలో ఇళ్లస్థలాల పోరాటం జిల్లాలోనే చరిత్రాత్మకం. 9 రోజులు నిరాహారదీక్ష చేపట్టాను. 11 రోజులపాటు జైలులో ఉన్నాను. చివరకు 10,000 మందికి ఇళ్లస్థలాలు ఇప్పించడంలో ఘన విజయం సాధించాం. నేటికీ అక్కడ సీపీఐ జెండా రెపరెపలాడుతూనే వుంటుంది.

పొలిటికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ జరిగిందెప్పుడు?

రామకృష్ణ: 1984లో నాదెండ్ల భాస్కరరావు వెన్నుపోటు పొడిచిన ఉదంతంలో ఎన్‌టీ రామారావు ఉద్వాసనకు గురైనప్పుడు, "ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటం" పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం వెల్లువెత్తింది. ఆ సమయంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సీపీఐ ముందుండి నిలిచింది. ఆ ఉద్యమంలో నేను 100మందితో కలిసి 15 రోజులపాటు జైలులో వున్నాను. అయితే ఆ వందమందిలో నేనొక్కడినే రాజకీయ నాయకుడిని. దీంతో అదొక చర్చనీయాంశమైంది. ఎన్‌టీఆర్ తిరిగి అధికారంలోకి వచ్చి ప్రమాణస్వీకారం చేసిన తర్వాత మమ్మల్ని విడుదల చేశారు. ఈ ఉద్యమంలో రాష్ట్రంలో 30 మంది మరణించగా, అందులో అనంతపురం జిల్లావాసులే 15 మంది ఉన్నారు. ఆ ఉద్యమంలోనే నాకు రాజకీయంగా ప్రాచుర్యం లభించింది.

అనంతపురంలో ఒకప్పుడు ఉద్రిక్తతల నడుమ ఉద్యమాలు చేసినట్లు చెపుతూ వుంటారు. నిజమేనా?

రామకృష్ణ: అవును...నిజమే! 1989 నుంచి 94 మధ్యకాలంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో అనంతపురం జిల్లాలో ఆ పార్టీ నాయకులు అరాచక రాజ్యాన్ని సృష్టించారు. ప్రత్యర్థి పార్టీలపై దాడులు, మహిళలు, దళితులపై అన్యాయాలతో జిల్లా అట్టుడికిపోయింది. ముఖ్యంగా అన్ని పార్టీలవారూ భయభ్రాంతులకు గురయ్యారు. చాలా మంది అజ్ఞాతంలోకి వెళ్లిపోవాల్సి వచ్చింది. అయితే సీపీఐ గట్టిగా నిలబడింది. కాంగ్రెస్ గూండాలకు వ్యతిరేకంగా బలమైన పోరాటం చేసింది. తాడిపత్రి, ధర్మవరం, పెనుగొండలలో సమావేశానికి అనుమతి ఇవ్వలేదు. దాంతో మేము ఇతర ప్రాంతాల్లో సమావేశాలు జరుపుకున్న తర్వాత తాడిపత్రిలో అనుమతివ్వక తప్పలేదు. అది గుర్తుచేసుకుంటే ప్రస్తుత జగన్ ప్రభుత్వం అలాగే ఉన్నట్లనిపిస్తుంది. ఆ ఉద్యమం నా జీవితంలో మరుపురానిది. అది నా రాజకీయ ప్రయాణంలో చాలా కీలకమైనది. నన్ను నాయకుడిగా ఎలివేట్ చేసింది ఆ ఉద్యమాలే. ఆ తర్వాత 1994 ఎన్నికల్లో నేను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాను

జగన్‌కు మోదీ మద్దతుంది కదా!

రామకృష్ణ: జగన్ గుడ్డిగా మోదీ ప్రభుత్వానికి మద్దతునివ్వడం వల్ల కేంద్రం కూడా చూసీచూడనట్లు పోతున్నది. రాష్ట్రంలో అరాచక ప్రభుత్వం నెలకొన్నది. అవినీతి పెరిగింది. ధరలు పెరిగాయి. కాంట్రాక్టుల బిల్లులు బుట్టదాఖలయ్యాయి. దీంతో పనులన్నీ నిలిచిపోయాయి. మద్యం మాఫియా విజృంభించింది. ఆదాయం కొల్లకొడుతు న్నారు. మైనింగ్, ఇసుక మాఫియా పెచ్చరిల్లిపోతున్నది. స్థానిక సంస్థల నిధులు దారిమళ్లాయి. మంత్రులు డమ్మీలయ్యారు. అంతా సీఎంవోనే. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలియజేద్దామన్నా అనుమతి లేదు. ధర్నాలు, చలో అసెంబ్లీ కార్యక్రమాల్లో పోలీసుల దమననీతి అందరికీ తెల్సిందే. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అన్యాయం జరిగింది. హామీమేరకు సీపీఎస్‌ను రద్దు చేయలేదు. దీంతో అందరిలోనూ అసంతృప్తి గూడుకట్టుకొని వుంది. వైసీపీ గడపగడపకు కార్యక్రమంలో ప్రజల అసమ్మతి చూస్తూనే వున్నాం.

ప్రస్తుత పరిస్థితుల్లో సీపీఐ మహాసభలకు ప్రాధాన్యత వుందా?

రామకృష్ణ: 1975లో విజయవాడలో జరిగిన సీపీఐ జాతీయ మహాసభల్లో చిన్న వాలంటీర్‌గా పాల్గొని, ప్రతినిధులకు టీ, కాఫీలు అందించి గొప్ప అనుభూతిని పొందాను. ఈ మహాసభలకు నేను ఆహ్వానసంఘం ప్రధానకార్యదర్శిగా ఉండటం గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను. దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మా మహాసభలకు ఎనలేని ప్రాధాన్యత వుంది. మోదీ 8 ఏళ్ల పాలనలో దేశం ఎటుపోయిందో అర్థం కావడం లేదు. మైనారిటీలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఫక్తు ఆర్ఎస్ఎస్ ఎజెండా అమలవుతోంది. ప్రజాసమస్యలు పట్టించే లేదు. 2014 ఎన్నికల వాగ్దానాలు అమలు కాలేదు. రైతులు, కార్మికులు, ఉద్యోగులు, యువత నిరాశలో పడ్డారు. ధనిక, పేదరికం అంతరం విపరీతంగా పెరిగిపోయింది. క్రోనీ క్యాపిటలిజం విజృంభిస్తోంది. అంబానీలు, అదానీలే మోదీకి దేవుళ్లుగా మారిపోయారు. కేంద్ర, రాష్ట్ర సంబంధాలు విచ్ఛిన్నమయ్యాయి. సమాఖ్య వ్యవస్థ దెబ్బతిన్నది. ఈ నేపథ్యంలో లౌకిక ప్రజాతంత్ర శక్తులను ఒకే వేదికపైకి తీసుకురావాలన్నదే మహాసభ ఉద్దేశం. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్నదే ప్రధాన ఎజెండాగా చర్చ జరుగుతుంది. ఆర్థిక విధానాల్లో మార్పురావాలి. ఇందుకోసం ప్రత్యామ్నాయ ఆర్థిక విధానంపై చర్చ జరుపుతాం. ఈ పరిస్థితుల్లో రైతులు, కార్మికులతోపాటు ప్రజలకు ఏం చేయాలో పిలుపునివ్వబోతున్నాం.

రైతు సమస్యలపై ఎక్కువ పోరాటాలు చేసినట్లుంది?

రామకృష్ణ: నిజమే. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అధ్యక్షునిగా నేను బాధ్యతలు స్వీకరించిన తర్వాత, సాగునీరు, గిట్టుబాటుధర వంటి అనేక సమస్యలపై పోరాడాం. రాష్ట్రమంతటా పర్యటించింది ఆ సమయంలోనే. పైగా అన్ని రైతుసంఘాలను ఒక తాటిపైకి తీసుకువచ్చి పోరుబాటలో నడిపించిన ఘనత మాదే. యూపీఏ చైర్‌పర్సన్‌గా సోనియాగాంధీ అనంతపురం వచ్చినప్పుడు మేం నిరసన చేపట్టాం.

ఈ మహాసభలు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తాయా?

రామకృష్ణ: సీపీఐ చీలిన తర్వాత తొలిసారిగా అన్ని వామపక్షాల్లో ఒకే గొంతు విన్పిస్తున్నది. అదేమిటంటే, కమ్యూనిస్టులంతా ఏకం కావాలని. సీపీఐ కలకత్తా మహాసభ నుంచి కమ్యూనిస్టులు ఏకం కావాలని మేం కోరుతూనే వున్నాం. ఈసారి ఆ ఆకాంక్ష ఇంకా బలంగా వుండబోతున్నది. కమ్యూనిస్టుల పునరేకీకరణ దిశగా ఉద్యమాలు దిశానిర్దేశం చేస్తాయి. ఇప్పటికే లెఫ్ట్ ఐక్యత పెరిగింది. భవిష్యత్‌లో ఐక్య ఉద్యమాలు మరింత పెరుగుతాయి.

– ఎ.బి.కూన

రాష్ట్రానికి రాజకీయ దుర్గతి పట్టిందా?

రామకృష్ణ: కచ్చితంగా! ఉమ్మడి రాష్ట్రంతోసహా రాష్ట్ర చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో రాజకీయ దుర్గతి పట్టింది. దీన్ని ఎవరూ ఊహించలేదు. జగన్ రాష్ట్రాన్ని అప్పులుపాలు చేశారు. అందులో కొంతభాగాన్ని స్కీమ్‌ల ద్వారా ప్రజలకిస్తున్నారు. ఏ కోశానా అభివృద్ధి లేదు. సంక్షేమ పథకాలను మేం సమర్థిస్తున్నాం. కానీ అభివృద్ధిని గాలికి వదిలేయడం ఎంతవరకు సబబు? అప్పులు తీర్చకుండా అభివృద్ధి ఎలా సాధ్యం? మీ కుటుంబం అప్పుల ఊబిలో కూరుకు పోయిన ప్పుడు మీ ఇల్లు ఎలా అభివృద్ధి సాధిస్తుంది? రాష్ట్రం విషయంలోనూ అంతే! ఈ లాజిక్కును జగన్ మిస్సయ్యారని అనుకోవడం లేదు. కాకపోతే పాలన చేతకాక ఇలా జరుగుతోంది. అన్ని వ్యవస్థలూ నిర్వీర్యమవుతున్నాయి. ఏకపక్ష పాలన సాగుతోంది. పోలీసువ్యవస్థ జగన్ చెప్పుచేతల్లో వుంది. 2014 ఎన్నికల నాటి హామీల్లో హోదా, విభజన హామీల పట్ల ఏ మాత్రం శ్రద్ధలేదు. పోలవరంపై నమ్మకమే లేదు. నిర్వాసితులకు సాయం లేదు. అమరావతి పట్ల కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారు. ప్రాంతాల మధ్య చిచ్చు రగిల్చి, నీచస్థితికి దిగజారారు. అన్ని ప్రాంతాలను సమ తూకంతో అభివృద్ధి చేయాల్సిన సీఎం...అది వదిలేసి ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టడం బాధాకరం. పేరుకే వికేంద్రీకరణ...3 రాజధానులు మూర్ఖపు నిర్ణయం. రాష్ట్రం ఆర్థికంగా అధోగతిపాలైంది.

ఏర్పాట్లు ఎంతవరకు వచ్చాయి?

రామకృష్ణ: సీపీఐ 24వ మహాసభలకు మూడోసారి విజయవాడ ఆతిథ్యమిస్తున్నది. ప్రభుత్వం సహకరించకపోయినా, ప్రజల సహకారంతో ఈ మహాసభలను భారీగానే నిర్వహిస్తున్నాం. 29 రాష్ట్రాల నుంచి దాదాపు 1000 మంది ప్రతినిధులు, 20 దేశాల నుంచి విదేశీ ప్రతినిధులు హాజరవుతున్నారు. వామపక్షాలకు చెందిన నాయకులు సౌహార్ద్ర సందేశాలు ఇస్తారు. అమరావతి, విశాఖ ఉక్కు, ప్రత్యేక హోదా వంటి పోరాటాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు కూడా ఈ మహాసభలు ప్రాధాన్యత ఇస్తాయి. కమ్యూనిస్టులకు పెట్టనికోటగా ఉన్న విజయవాడలో చంద్ర రాజేశ్వరరావు ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు 10వ జాతీయ మహాసభలు ఇక్కడ జరిగాయి. లక్షలాది మంది ర్యాలీ నిర్వహించారు. ఈసారి కూడా అదేస్థాయిలో ప్రజల నుంచి స్పందన ఉంటుంది. ఏపీతోపాటు తెలంగాణ, తమిళనాడు నుంచి కూడా ప్రజలు తరలిరావడంతో ఆనాటి మహాసభలను ఇవి గుర్తుకు తెస్తున్నాయి. వేలాది మంది రెడ్‌షర్ట్ వాలంటీర్లతో జనసేవాదళ్ కవాతు ప్రత్యేక ఆకర్షణ కాబోతున్నది. లౌకిక శక్తులకు ఈ మహాసభలు మంచి ఉత్సాహాన్ని ఇస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

అరుణ తారలు

టెర్రరిస్టుల సింహస్వప్నం
సత్యపాల్ డాంగ్

అట్టడుగు, అణగారిన వర్గాల ప్రజల పక్షాన స్థిరమైన అంకితభావంతో, అచంచలమైన దీక్షతో పనిచేసిన నిష్కళంకమైన ప్రజానాయకుడు, ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు సత్యపాల్ డాంగ్ (1920 - 2013). పంజాబ్‌లో ఖలిస్థానీ తీవ్రవాదం పడగవిప్పినప్పుడు తీవ్రవాదులకు వ్యతిరేకంగా అత్యంత ధైర్యసాహసాలతో పోరాడిన కమ్యూనిస్టు యోధులలో సత్యపాల్ డాంగ్, ఆయన జీవన సహచరి విమలా డాంగ్ దంపతులు ప్రముఖులు. పంజాబ్లో తీవ్రవాద ఛాయలు పొడచూపినప్పటి నుంచీ సీపీఐ కార్యకర్తలు ప్రాణాలకు తెగించి తీవ్రవాదులను వ్యతిరేకించడంలో అసమానమైన ధ్కైర్య సాహసాలు ప్రదర్శించారు. "ఈ పిరికిపందల తూటాలు మా సంకల్పాన్ని తుంచలేవు, మేము ప్రజల మధ్య ఉండి పోరాడతాం" అని సత్యపాల్ డాంగ్, విమలా డాంగ్ నిర్భయంగా ప్రకటించేవారు. వారిద్దరూ ఉద్రిక్తతకు ఆలవాలమైన అమృతసర్‌లోనే నివసించే వారు. సమాజానికి అందించిన అత్యుత్తమ సేవలకు గుర్తుగా భారత ప్రభుత్వం 1998లో సత్యపాల్ డాంగ్‌ను పద్మవిభూషణ్‌తో సత్కరించింది. స్వాతంత్ర్య సమరయోధుడు అయిన సత్యపాల్ డాంగ్ పంజాబ్‌కు చెందిన తొలితరం రాజకీయవేత్త, రచయిత. బీజేపీ-ఆర్ఎస్ఎస్‌తో సహా అన్ని రాజకీయ పార్టీలలోనూ సత్యపాల్ డాంగ్ అభిమానులు కోకొల్లలుగా ఉన్నారు. పంజాబ్ రాష్ట్ర అసెంబ్లీకి సీపీఐ తరపున నాలుగు పర్యాయాలు డాంగ్ ఎన్నికయ్యారు. 1967 ఎన్నికలలో నాటి ముఖ్యమంత్రి గియాని గురుముఖ్ సింగ్ ముసాఫిర్‌ని మట్టికరిపించారు. జస్టిస్ గుర్నామ్ సింగ్ నేతృత్వంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రిగా పనిచేశారు. ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) నాయకునిగా దేశ కార్మికోద్యమంలో భాగస్వామి అయ్యారు. 1980 లలో ఖలిస్తాన్ ఉద్యమ సమయంలో,



డాంగ్ చెహర్తాలో నిర్మించిన ఏక్తా భవన్లో ఉంటూ వేర్పాటువాదానికి వ్యతిరేకంగా అకుంఠిత దీక్షతో శ్రమించారు. పంజాబ్, కాశ్మీర్ రాజకీయాలకు సంబంధించి మతం, రాజకీయాలపై ఒక విశ్లేషణాత్మక నివేదిక, పంజాబ్ సంక్షోభం, మతం, రాజకీయాలపై తన అభిప్రాయాలను వివరిస్తూ టెర్రరిజం ఇన్ పంజాబ్ అనే రెండు పుస్తకాలు ప్రచురించారు.

సత్యపాల్ డాంగ్ 1920 అక్టోబరు 4న బ్రిటిష్ ఇండియాలోని పంజాబ్ ప్రావిన్స్‌ని గుజ్రాన్వాలాలో జన్మించారు. లాహోర్లో పాఠశాల విద్య అభ్యసించారు. విద్యార్థి దశలోనే భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. ప్రారంభంలో భారత జాతీయ కాంగ్రెస్ వామపక్ష విభాగంతో కలిసి పనిచేశాడు, ఆ తరువాత సీపీఐలో చేరారు. 1940 లలో పార్టీలోని బొంబాయి కమ్యూన్లో క్రియాశీల కార్యకర్త అయ్యారు. తరువాత, 25 సంవత్సరాల వయస్సులో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్)కు ప్రధాన కార్యదర్శి అయ్యారు. 1943లో ముంబ్కెలో జరిగిన పార్టీ మొదటి మహాసభకు హాజరయ్యారు. ఈ సమయంలోనే, విమల బకయాతో కలిసి పనిచేసే అవకాశం ఆయనకు లభించింది. విద్యార్థి రోజుల నుంచి వారు సహచరులు. 1952లో సత్యపాల్, విమల వివాహం చేసుకున్నారు. తమ ప్రజాజీవనానికి ఆటంకంగా మారుతుందని సంతానం కూడా వద్దనుకున్న ఆదర్శజీవులు డాంగ్ దంపతులు. పార్టీ నిషేధ కాలం, ఆ తరువాత డాంగ్ దంపతులకు అమృతసర్ ప్రాంతంలో కార్మికవర్గాన్ని సంఘటితం చేసే బాధ్యతను పార్టీ అప్పగించింది. దానితో అమృత్సర్ సమీపంలోని ఛెహర్తా సాహిబ్ అనే గ్రామానికి మకాం మార్చారు. 1953లో మొదటి స్థానిక ఎన్నికలు జరిగినప్పుడు, డాంగ్ ఛెహర్తా మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. డాంగ్ తరువాత దశాబ్దంన్నర పాటు ఛెహర్తా స్థానిక రాజకీయాలలో పాలుపంచుకున్నారు, అనేక సార్లు మునిసిపాలిటీకి నాయకత్వం వహించారు. ఆదర్శ పట్టణంగా అభివృద్ధి చేయడానికి కృషి చేశారు. 1967లో జరిగిన శాసనసభ ఎన్నికలలో అమృతసర్ పశ్చిమ నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థిగా పోటీచేసి ముఖ్యమంత్రి గియాని గురుముఖ్ సింగ్ ముసాఫిర్‌పై విజయం సాధించారు. సీపీఐ భాగస్వామిగావున్న యునైటెడ్ ఫ్రంట్ ఎన్నికలలో మెజారిటీ సాధించింది. జస్టిస్ గుర్నామ్ సింగ్ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వంలో డాంగ్ ఆహార, పౌర సరఫరాల మంత్రిగా పనిచేశారు. మంత్రిగా ఉన్న సమయంలో మంత్రి బంగ్లాను వినియోగించుకోవడానికి నిరాకరించి ఎమ్మెల్యే హాస్టల్‌ను ఎంచుకున్న నిరాడంబరజీవి. అధికారంలో ఉన్నప్పుడు బూర్జువా పార్లమెంటరీ విధానంవల్ల ఏర్పడే అవలక్షణాలను ఏమాత్రం అలవర్చుకోకుండా సమర్థుడైన పరిపాలకుడుగా నిరూపించుకున్నారు. తదుపరి 1969, 1972, 1977లో జరిగిన మూడు శాసనసభ ఎన్నికలలోనూ ఈ నియోజకవర్గం నుంచి విజయంసాధించారు. 1980 ఎన్నికలలో సేవా రామ్ అరోరా చేతిలో ఓడిపోయారు. 1982 ఎన్నికలలో విమలా డాంగ్ ఈ నియోజకవర్గం నుంచి తిరిగి ఎన్నికయ్యారు. 2009లో విమలాడాంగ్ మరణం తర్వాత క్రియాశీల రాజకీయాల నుంచి సత్యపాల్ డాంగ్ తప్పుకున్నారు. 2013జూన్ 6న తుదిశ్వాసవిడిచారు.

-మోదుమూడి మురళీకృష్ణ

ఆదర్శకమ్యూనిస్టు
పెద వెంకట్రాయుడు

కృష్ణాజిల్లా కమ్యూనిస్టు ఉద్యమం తొలితరం నాయకుల్లో ఒకరు కామ్రేడ్ కాట్రగడ్డ పెద వెంకట్రాయుడు. శ్రామిక జన విముక్తి కోసం తన యావజీవితాన్ని అంకితం చేసిన ధన్యజీవి ఈయన. నిరాండంబరంగా, నీతి, నిజాయితీలకు నిలువుటద్దంగా జీవించారు. గన్నవరం ల్యాండ్ మార్టిగేజ్ బ్యాంకు ఎన్నికల్లో సీపీఐ 2 స్థానాలలో మాత్రమే గెలిచింది. తమ సొంత పార్టీ ఎక్కువ స్థానాలు గెలిచినా సుందరయ్యగారు తమ పార్టీ వారిని కాదని పెదవెంకట్రాయుడుని ఆ బ్యాంకు ఛైర్మన్‌గా ఎన్నిక చేశారు. ఇది వారి నిజాయితీకి పట్టం కట్టడమే. 1919 జూలై 15న గన్నవరం తాలూకా బుద్ధవరంలో ఈయన జన్మించారు.

విద్యార్థి దశలో ఎస్.ఎస్.ఎల్.సి.లో డిటెన్షన్ విధానానికి వ్యతిరేకంగా 32రోజుల విద్యార్థి సమ్మెకు నాయకత్వం వహించారు. వెల్లంకి విశ్వేశ్వరరావు, కడియాల గోపాలరావు, వేములపల్లి ఆంజనేయులు విద్యార్థి ఉద్యమంలో ఈయన సహచరులు, పెండ్యాల వెంకటేశ్వరరావు, ముక్కామల నాగ భూషణంలతో కలిసి జాతీయోద్యమంలో వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నారు. 1937 బ్రిటిష్ ప్రభుత్వ నూతన రాజ్యాంగానికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో ఎర్రజెండా పట్ల ఆకర్షితులై జీవితాంతం ఎర్రజెండాను విడవలేదు. 1939లో రెండవ ప్రపంచయుద్ధం వ్యతిరేక ప్రచారంలో పాల్గొన్నారు. జయప్రకాష్ నారాయణ రాసిన "సోషలిజం ఎందుకు" అనే గ్రంథం, 'నవశక్తి' పత్రిక పాఠకునిగా సోషలిస్టు సాహిత్యంతో అనుబంధం పెంచుకున్నారు. కమ్యూనిస్టు పార్టీ రహస్య పత్రిక 'స్వతంత్ర భారత్' ప్రతులను రహస్యంగా గ్రామాలలో పంపిణీ చేసేవారు. గన్నవరం తొలిపార్టీ శాఖ సభ్యునిగా ఉన్నారు.

నిజాం వ్యతిరేక సాయుధపోరాట కాలంలో అనేకమంది తెలంగాణా పార్టీ నాయకులు రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, రాజబహదూర్ గౌర్, దేవులపల్లి వెంకటేశ్వరరావులతో పాటు చంద్రరాజేశ్వరరావు, చలసాని వాసుదేవరావు, కొండేపూడి లక్ష్మీనారాయణ వంటి ఆంధ్ర నాయకులకు బుద్ధవరంలో రక్షణ కల్పించారు. 1948లో బుద్ధవరంలో రాష్ట్ర పార్టీ మహాసభల నిర్వహణలో కీలకపాత్ర వహించారు. పార్టీ నిషేధానికి గురైనా 1948 కలకత్తా పార్టీ కాంగ్రెస్‌లో పాల్గొన్నారు. 1948 మే 30న తొలిగా అరెస్టు అయ్యారు. 1948 ఆగస్టులో మరోసారి అరెస్టై 6నెలలు బైండోవరకు గురై 23రోజులు జైల్లో ఉన్నారు. అనంతరం రహస్య

జీవితంలోకి వెళ్ళారు. కొరియర్‌గా పార్టీ రహస్య పత్రాలను అన్ని కేంద్రాలకు అందజేసే కీలక బాధ్యతలు నిర్వహించారు. ఈ కాలంలోనే చింతపల్లి పాపారావును పోలీసులు కాల్చిచంపారు. పొట్లూరి సుందరంకు రహస్యంగా ఆశ్రయం కల్పించారు. పెద వెంకట్రాయుడు రహస్య జీవితంలో ఉండగా ప్రభుత్వం వీరి ఆస్తులను జప్తు చేసి స్వాధీనం చేసుకుంది. పొట్లూరి సుందరం పోలీసులకు లొంగిపోయి రహస్యాలు వెల్లడించటంతో అరెస్టుకు గురై విజయవాడ పళనియప్పన్ క్యాంపు జైలులో, విజయవాడ సబ్ జైలులో 5 మాసాలు నిర్బంధంలో వున్నారు. 1952 ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేసి విజయం సాధించారు. బిల్డింగ్ సొసైటీ అధ్యక్షునిగా రాయ్‌నగర్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రారంభించిన తొలి సంవత్సరాలలో గన్నవరం తొలి సర్పంచ్‌గా ఎన్నికై ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు.

సూరంపల్లి గ్రామంలో మొఖాసాదార్లు పేదల సాగుభూమికి చెరువు నీళ్ళు ఇవ్వక పంటపోతున్నది. వందలాది పేదలతో పెద వెంకట్రాయుడు నీళ్ళు తూము తీయటానికి వెళ్ళగా మొఖాసాదార్లు కాల్పులు జరిపారు. మొదటి దెబ్బకు అన్నే రామారావు నేల కూలాడు. రెండవ దెబ్బ వెంకట్రాయుడును గురి చూచి కాలిస్తే పక్కన ఉన్న కామ్రేడ్ పక్కకు తోసి వేయగా బోడపాటి లక్ష్మయ్య నేలకొరిగారు. మూడవ గుండు బోడపాటి చిన అంజయ్యకు తగిలి చనిపోయాడు. మూడెకరాల భూమికోసం ముగ్గురు బలైనారు. ఇది 1961 అక్టోబరులో జరిగింది. ఈ ఘటన తర్వాత 1964లో పార్టీ చీలిపోయింది. అయినా వెంకట్రాయుడు 24 ఏళ్ళపాటు అష్టకష్టాలు పడి ఈ కేసులను ఎదుర్కొన్నారు. మొఖాసాదారుకు యావజ్జీవ శిక్ష పడగా, వెంకట్రాయుడు తదితరులపై పెట్టిన రెండు కేసులు కొట్టి వేశారు.

పార్టీ చీలిక తరువాత సీపీఐ తాలూకా కార్యదర్శిగా గ్రామ గ్రామాన తిరిగి పార్టీ నిర్మించారు. తొలి రోజుల నుండి కృష్ణాజిల్లా వివిధ ప్రాంతాలలో పార్టీ నిర్మాణానికి విశేషమైన కృషి చేశారు. గన్నవరం తాలూకాలో అత్యంత గౌరవనీయమైన కమ్యూనిస్టుగా, నిజాయితీగా జీవించారు. తన కుటుంబ సభ్యులను సైతం కమ్యూనిస్టులుగా తీర్చిదిద్దారు. వీరి పెద్ద కుమారుడు కాట్రగడ్డ జోషి గన్నవరం నియోజకవర్గానికి సీపీఐ కార్యదర్శిగా ఉన్నారు. గన్నవరం విమానాశ్రయం నిర్వాసిత రైతుల పక్షాన పోరాటం నిర్వహించి రైతులకు న్యాయం కల్పించారు. రాజకీయాలకు అతీతంగా అందరి గౌరవాభిమానాలకు పాత్రుడై జీవించిన ఆదర్శ కమ్యూనిస్టు కామ్రేడ్ కాట్రగడ్డ పెద వెంకట్రాయుడు.

- చలసాని వెంకటరామారావు

రాజ్యసభలో రైతుబంధు
జెడ్ఏ అహ్మద్

భారత కమ్యూనిస్టు పార్టీ, రైతు సంఘం సీనియర్ నాయకుడు జెడ్ఏ అహ్మద్ (29 అక్టోబర్ 1908 - 1999). ఆయన ఉత్తర ప్రదేశ్ రాజకీయాలలో ప్రముఖ వ్యక్తిగా నిలిచాడు. సీపీఐ తరపున 1958 నుంచి దాదాపు 25 ఏళ్ల రాజ్యసభలో ప్రజాగొంతుకగా నిలిచారు. 1958-1962, 1966-1972, 1972-1978, 1990 నుంచి 1994 వరకు రాజ్యసభ సభ్యునిగా పనిచేశారు. అట్టడుగు, అణగారిన వర్గాలు, రైతులు, కార్మికుల అగచాట్లను పార్లమెంట్ దృష్టికి తీసుకువెళ్లడంలో కృతకృత్యులయ్యారు. 1976 నుంచి 1978 వరకు రాజ్యసభ ప్రభుత్వ హామీల కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. సీపీఐ నాయకునిగా ప్రజాసమస్యల పరిష్కారానికి మొక్కవోని దీక్షతో కృషిచేశారు. రైతు నాయకునిగా రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. 1951-56 మధ్య సీపీఐ ఉత్తరప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. 1979 జూన్ 7 నుంచి 10వరకు విజయవాడలో జరిగిన అఖిలభారత కిసాన్‌సభ (ఏఐకేఎస్)22వ జాతీయ మహాసభలో ఏఐకేఎస్ అధ్యక్షునిగా అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా ఇంద్రదీప్ సిన్హా ఎన్నికయ్యారు.

1930లలో సీపీఐ నాయకత్వ సూచనల మేరకు అహ్మద్ కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ (సీఎస్‌పీ)లో చేరి జాతీయ స్థాయిలో సహాయ కార్యదర్శిగా పనిచేశారు. 1940లలో పాకిస్తాన్‌లో కొంతకాలం ప్రవాస జీవనం గడిపిన తర్వాత ఆయన భారతదేశానికి తిరిగి వచ్చి సీపీఐ ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర సమితి కార్యదర్శి అయ్యారు. తరువాత నాలుగు పర్యాయాలు రాజ్యసభకు ఎన్నికయ్యారు. అహ్మద్ తండ్రి గుజరాత్‌లో ప్రముఖ పోలీసు అధికారి. చలనచిత్ర నిర్మాత డబ్ల్యూజెడ్ అహ్మద్ జెడ్ఏ అహ్మద్‌కు సోదరుడు. అహ్మద్ మరో సోదరుడు జఫరుద్దీన్ కరాచీలో పోలీసు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా పనిచేశారు. విద్యాభ్యాసం అనంతరం బ్రిటన్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత, అహ్మద్ హజ్రా బేగంను వివాహం చేసుకున్నారు. ఆమె బ్రిటన్‌లో చదువుకున్నారు. ఆమె కూడా కమ్యూనిస్టు భావాలు కలిగివున్నారు. ఆమె కూడా సీఎస్‌పీలో పనిచేశారు. ఈ దంపతులకు ఒక కుమార్తె ఉంది.

అహ్మద్ 1930లలో కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో విద్యనభ్యసించారు. ఆ సమయంలో ఆయనకు సజ్జాద్ జహీర్, కేఎం అష్రఫ్‌లతో ఏర్పడిన పరిచయం స్నేహంగా మారింది. భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత వారు ముగ్గురూ సీఎస్పీలో చేరారు. అహ్మద్ 1937-1938లో సీఎస్పీ ఆల్ ఇండియా జాయింట్ సెక్రటరీగా పనిచేశాడు, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నెహ్రూ ఉన్న సమయంలో అలహాబాద్‌లో జవహర్‌లాల్ నెహ్రూతో కలిసి వారు ముగ్గురూ పనిచేశారు. యునైటెడ్ ప్రావిన్సెస్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా 1937-1939 మధ్యకాలంలో అహ్మద్ పనిచేశారు.

అహ్మద్ యునైటెడ్ ప్రావిన్స్‌లో సీపీఐ ప్రముఖ వ్యక్తిగా ఎదిగారు. 1948లో కలకత్తాలో జరిగిన పార్టీ రెండవ మహాసభ తర్వాత ముస్లిం నాయకులు చాలా మంది పాకిస్తాన్‌కు వెళ్లారు. అయితే, అలా వెళ్లడానికి అహ్మద్ ఇష్టపడలేదు. ఆయన సన్నిహిత మిత్రుడు సజ్జాద్ జహీర్ పాకిస్తాన్‌కు వలస వెళ్లి, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ పాకిస్తాన్ ప్రధాన కార్యదర్శి అయ్యాడు. పాకిస్తాన్ వెళ్లి అక్కడ పార్టీని నిర్మించడంలో సహాయం చేయవలసిందిగా సీపీఐ నాయకత్వం అహ్మద్‌ను కోరింది, అందుకు ఆయన సున్నితంగా తిరస్కరించి భారత్‌లోనే ఉండి ఇక్కడ కమ్యూనిస్టు పార్టీ, రైతు సంఘం నిర్మాణానికి ఎనలేని కృషిచేశారు.

భారత్‌లో ఆయన పేరు మీద అరెస్ట్ వారెంట్ ఉండటంతో ఆయన లాహోర్‌కు బయలుదేరారు. లాహోర్‌లో తన సోదరుడు డబ్ల్యూజెడ్ అహ్మద్ వద్ద కొన్ని వారాలపాటు జెడ్ఏ అహ్మద్ ఉన్నారు. అక్కడ కూడా అరెస్ట్ వారెంట్ జారీ కావడంతో అహ్మద్ కరాచీకి మారారు, అక్కడ తన సోదరుడు జఫరుద్దీన్ అహ్మద్ వద్దకు అతిథిగా వెళ్లారు. జఫరుద్దీన్ కరాచీలో పోలీసు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్నారు. అహ్మద్‌ను అప్పగించాలని ఆయనపై అధికారుల నుంచి తీవ్ర ఒత్తిడి వచ్చింది. కానీ ఆయన అంగీకరించలేదు. దాదాపు నెలపాటు కరాచీలో ఉన్న తర్వాత, అహ్మద్ భారతదేశానికి తిరిగి వచ్చారు. ఉత్తరప్రదేశ్‌లో సీపీఐ బలోపేతంకావడంలో ఆయన కృషి అమోఘం. రైతు సంఘం నాయకునిగా దేశవ్యాప్తంగా రైతాంగ ఉద్యమాన్ని విస్తరించారు.

- ఎం. లక్ష్మీరాజ్యం

టాటా ఇనుము
ఉక్కు సంస్థలో మహత్తర సమ్మెలు

జంషెడ్‌పూర్‌లోని టాటా ఇనుము ఉక్కు కర్మాగారం ఒక భారతీయ బహుళజాతి ఉక్కు తయారీ సంస్థ, 1907 ఆగస్టు 26న స్థాపించబడింది. టాటా గ్రూపులో ఇది ఒక భాగం. ప్రపంచ వ్యాపితంగా ఉక్కు రంగంలో ఇది సేవ చేస్తున్నది. 26 దేశాలలో కార్యకలాపాలు సాగిస్తున్నది. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో వేగంగా ఇది అభివృద్ధిని సాధించింది. బొంబాయిలో కేంద్ర కార్యాలయం ఉన్న ఈ సంస్థను జంషెడ్జీ టాటా, దొరాబ్జి టాటాలు నెలకొల్పారు. 32 వేలకు పైగా ఉద్యోగులు ఈ సంస్థలో ప్రస్తుతం పని చేస్తున్నారు.

ఉక్కు రంగంలో టాటాలకు ఎంతో పట్టు ఉంది. నాణ్యత విషయంలో జంషెడ్‌పూర్ టాటా కర్మాగారం ఎంతో ప్రతిష్ట కలిగింది. 1920లో ఇక్కడ బ్రహ్మాండమైన కార్మిక సమ్మె పోరాటం జరిగింది. తిరిగి 1922 సెప్టెంబరు 19 నుండి మరో గొప్ప సమ్మె ఇక్కడ జరిగింది. ఈ సమయంలోనే ఉక్కు ధర ప్రపంచవ్యాపితంగా పడిపోయింది. యూరప్‌లో కార్మికుల వేతనాలు తగ్గిపోయాయి. ఈ టైమ్‌లోనే టాటాలు కంపెనీ విస్తరణ పనులు ప్రారంభించారు. కంపెనీ పెట్టుబడి రెట్టింపు అయ్యింది. ఈ నేపథ్యంలో కంపెనీ ఇద్దరు కార్మికులను పని నుండి డిస్మిస్ చేసింది. వారిని తిరిగి పనిలోకి తీసుకోవాలని, యూనియన్‌ను గుర్తించాలని, 8 గంటల జనరల్ షిఫ్టు అమలు జరపాలని, ఓవర్ టైం పని కోసం కార్మికులపై ఒత్తిడి తేరాదని, బోనస్ ఇవ్వాలనే కోర్కెలతో సాగిన సమ్మె సంపూర్ణంగా విజయవంతమైంది. యాజమాన్యం మొండివైఖరి, సమస్యల పట్ల నిర్లక్ష్యం కారణంగా సమ్మె దీర్ఘకాలం కొనసాగింది. చివరకు ఎ.ఐ.టి.యు.సి. నాయకులు దివాన్ చమన్‌లాల్ 1922 అక్టోబరు 20న జంషెడ్‌పూర్ వచ్చి యాజమాన్యంతో చర్చలు జరిపి మేనేజ్‌మెంట్ - కార్మికులతో ఒక కమిటీ ఏర్పాటుతో అక్టోబరు 23న సమ్మె విరమించి తిరిగి పనిలో చేరారు. కానీ యాజమాన్యం కక్ష సాధింపునకు పాల్పడి యూనియన్ కార్యదర్శి జి.సేథీతో సహా పలువురు ఉద్యోగులను భర్తరఫ్ చేయటంతో తిరిగి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

1924లో తీవ్ర అశాంతి పరిస్థితులలో కన్సిలియేషన్ కమిటీ జంషెడ్ పూర్‌లో జరిగింది. చిత్తరంజన్‌దాస్, చమన్‌లాల్, ఎన్.ఎం.జోషి, సి.ఎం. ఆండ్రూస్‌లు పాల్గొన్నారు. మోతీలాల్ నెహ్రూ, రంగస్వామి అయ్యంగార్ పరిశీలకులుగా వచ్చారు. తీవ్ర ప్రతిష్టంభన ఏర్పడినా చివరకు యూనియన్‌ను గుర్తించి, సేథీ తదితరులను పనిలోకి తీసుకోవటంతో సమస్య పరిష్కారమైంది.

ప్రపంచంలోని అన్నిదేశాలలో ఇనుము, ఉక్కు పరిశ్రమలలో ఇతర పరిశ్రమలలోని కార్మికుల కంటే వేతనాలు రెట్టింపు కన్నా ఎక్కువగా వున్నాయి. కానీ భారత దేశంలో జౌళి కార్మికుల

కంటే 15శాతం తక్కువ జీతాలు ఉన్నాయి. జంషెడ్‌పూర్ ఉక్కు కార్మికుల నెలజీతం 20రూపాయలు కంటే తక్కువగా ఉంది. 1922 సమ్మె ఒప్పందం కార్మికుల అసంతృప్తిని ఏమాత్రం తగ్గించలేదు. ఈ అసంతృప్తితోనే కార్మికులు 1928 వరకు పనిచేశారు. దీనితో 1928 ఏప్రియల్ 18 నుండి 13వరకు దీర్ఘకాలం మరో సమ్మె జంషెడ్‌పూర్ టాటా ఉక్కు కర్మాగారంలో జరిగింది. దీనికి ముందు 1925లో మహాత్మగాంధీ యాజమాన్యంతో ఒక ఒప్పందం కుదిర్చారు. కానీ అది కార్మికులను సంతృప్తి పర్చలేదు. గాంధీ టాటాలను మానవతా వాదిగా భావించాడు. కార్మికుల కష్టసుఖాలను తీర్చే యజమానిగా పేర్కొన్నాడు. కానీ టాటా యాజమాన్యం కార్మికుల పట్ల క్రూరంగా వ్యవహరించింది. కార్మికుల అణచివేత, జీతాలు తగ్గింపు రిట్రెంచ్‌మెంటు వంటి చర్యలకు పాల్పడింది. గాంధీజీ ఒప్పందం కార్మికులను సంతృప్తి పరచనందున తీవ్రపోరాటంపై వెళ్ళవలసిన అనివార్య పరిస్థితులు కల్పించబడ్డాయి.

1928 ఫిబ్రవరి 17న ముందుగా క్రేన్ డ్రైవర్లు సమ్మె చేశారు. 15రోజుల తర్వాత రైలు పట్టాలకు తుది మెరుగులు దిద్దే కార్మికులు సమ్మె చేశారు. బొగ్గు కొలిమి వద్ద కార్మికులు పనికి అంతరాయం కల్పించారు. ఉక్కు రేకులు తయారు చేసే కార్మికులు 18వ తేదీన, బ్రాయిలర్ ప్లాంట్ కార్మికులు 21వ తేదీన, స్వీపర్లు కూడా సమ్మెలో పాల్గొన్నారు. జీతాలు 25శాతం పెంచాలని, వార్షిక ఇంక్రిమెంట్‌తో జీతం స్కేల్ ఉండాలని, బోనస్, భర్తరఫ్ మరియు ఒక కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 18వేల మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. జంషెడ్‌పూర్‌లోని కమ్యూనిస్టులు సమ్మెను ప్రోత్సహించారు. మే 8న సమ్మెలోని కార్మికులందరినీ డిస్మిస్ చేస్తూ యాజమాన్యం ఆదేశాలు ఇచ్చింది. యాజమాన్యం మొండిగా వ్యవహరించింది. ఐనా కార్మికులు కమ్యూనిస్టుల సహకారంతో తీవ్రపోరాటం చేశారు. చివరకు సుభాష్‌చంద్రబోస్ జోక్యంతో ఒక ఒప్పందం కుదిరింది. డిస్మిస్ అయిన వారిని పనిలోకి తీసుకున్నారు. జీతాలు స్వల్పంగా పెరిగాయి. నెలజీతం అడ్వాన్సుగా ఇచ్చారు. కక్ష సాధింపు లేకుండా హామీ ఇచ్చారు. కానీ ఈ ఒప్పందం కూడా కార్మికులకు సంతృప్తిని కలిగించలేదు. సుదీర్ఘ 6నెలల సమ్మె పోరాటం కార్మికులకు ఎన్నో గుణపాఠాలు నేర్పింది. కార్మికుల పట్టుదల, ధైర్య సాహసాలకు ఈ సమ్మె ఒక ప్రతీకగా నిలిచింది. నాటి పోరాట స్ఫూర్తి, చైతన్యం నేటి కార్మిక వర్గానికి దిక్సూచి కావాలి. సీపీఐ 24వ జాతీయ మహాసభల సందర్భంగా ఆనాటి పోరాట స్ఫూర్తిని కార్మిక వర్గం గ్రహించి ముందుకు సాగాలి. కార్మిక వర్గాన్ని సంఘటితం చేయాలి.

సిహెచ్.వి.రావు